01 . 08. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శుక్రవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 65 , పేజీలు : 12 వెల:రూ.5/-

SIMULANEOUSLY PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com


velthuru Newspaper



## అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు అందే విధంగా కృషి చేస్తాను

- ఎమ్మెల్యే ఆదిలాబాద్ పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు జూలై 31:**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా



## నలుగురు కొత్త జడ్జిల ప్రమాణం

- ప్రమాణ స్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్



**హైదరాబాద్,జూలై31( వెలుతురు):**
తెలంగాణ హైకోర్టులో కొత్తగా

## రోహింగ్యాలు చొరబాటుదారులా..శరణార్థులా?

- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం



**న్యూఢిల్లీ, జూలై31 (వెలుతురు):**
రోహింగ్యాల విషయమై కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆసక్తికర ప్రశ్నలు అడిగింది. రోహింగ్యాల విషయంలో దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు

# పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌దే తుది నిర్ణయం

**తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్‌ను అనుమతించిన సుప్రీం ధర్మాసనం.. వీలైనంత త్వరగా లేదా 3 నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అయితే, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు వేటు వేయాలంటూ బీఆర్ఎస్ చేసిన విజ్ఞప్తిని సీజేఐ గవాయ్ తోసిపుచ్చారు. అదే సమయంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించాలనే అంశంపై పార్లమెంట్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ గవాయ్ ఆదేశించారు. కాగా, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపుల కేసుపై సుప్రీంకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. స్పీకర్ తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలనే అంశంలో కోర్టులు జోక్యం చేసుకోవచ్చా లేదా అనే దానిపై సుప్రీంకోర్టులో సుదీర్ఘ వాదనలు నడిచాయి. ఈ వాదనల అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది.**



### 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందే

### ఫిరాయింపులపై పార్లమెంట్ సమీక్షించాలి

### బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో సుప్రీం తీర్పు

**న్యూఢిల్లీ,జూలై31( వెలుతురు):**
బిఆర్ఎస్ నుంచి పార్టీ మారిన 10 ఎమ్మెల్యేలపై అనర్హత చర్యలను వీలైనంత త్వరగా లేదా 3 నెలల్లోపు నిర్ణయించాలని సూచించింది. ఏ ఎమ్మెల్యే అయినా.. స్పీకర్ ప్రక్రియను పొడిగించాలని అడగకూడదు. అలా చేస్తే స్పీకర్ ప్రతికూల నిర్ణయాలు తీసుకోవచ్చు. రాజకీయ ఫిరాయింపులు జాతీయ చర్చనీయాంశంగా మారింది. దాన్ని అరికట్టకపోతే.. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని వ్యాఖ్యానించారు. వివిధ సందర్భాల్లో ఈ అంశంపై పార్లమెంటులో చేసిన వివిధ ప్రసంగాలను కూడా పరిశీలించాం. రాజేష్ పైలట్.. దేవేంద్ర నాథ్ మున్ని లాగా.. అనర్హత చర్యలపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం కోర్టుల ముందు జాప్యాన్ని నివారించడమే. పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు కట్టబెట్టారు. ఆర్టికల్స్ 136, 226, 227 లకు సంబంధించి న్యాయ సమీక్ష అధికారాలు చాలా పరిమితంగా ఉన్నాయి. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోవడంలో డివిజన్ బెంచ్ తప్పు చేసింది. స్పీకర్ ఒక న్యాయనిర్ణేత అధికారిగా వ్యవహరిస్తూనే హైకోర్టు, సుప్రీంకోర్టు అధికార పరిధికి లోబడి ఉండే ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తారని తీర్పులో ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ 2014 నవంబర్ 22న తీర్పును పక్కన పెడుతున్నాము. ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి,



## దేవాదాయ శాఖలో ఈ-ఆఫీసు సర్వీసును ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ

- ఇక పారదర్శకంగా ఫైళ్ల క్లియరెన్స్

**హైదరాబాద్ వెలుతురు జులై 31:**
తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖలో ఫైల్స్ క్లియరెన్స్ పనితీరును వేగవంతం చేసేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రాధాన్యతనిస్తున్నారు. గురువారం తెలంగాణ సచివాలయంలో

## రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుండి తప్పుడు వాగ్దానాలు...

- నేడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ప్రజలను మభ్య పెడుతున్నారు..
- కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రకటించిన విధంగా బీసీలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి.
- బీసీలపై కాంగ్రెస్ ది కపట ప్రేమ
- బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు


**హైదరాబాద్ వెలుతురు జూలై 31:**
తెలంగాణ రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుండి రేవంత్ రెడ్డి తప్పుడు వాగ్దానాలు చేస్తూనే ఉన్నారని అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ప్రజలను మభ్యపెడుతూ, తన ఇష్టానుసారంగా మాయ మాటలు చెప్పుకుంటూ రేవంత్ రెడ్డి కాలం గడుపుతున్నారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ఘాటు



# జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక సమర్పణ

- 15 నెలల పాటు విచారించిన కమిషన్
- కెసిఆర్, ఈటెల, హరీష్, తదితరలు విచారణ
- 115 మందిని విచారించి నివేదిక రూపొందించిన కమిషన్





**హైదరాబాద్, జూలై31( వెలుతురు):**
కాళేశ్వరంపై విచారణ చేపట్టిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికను సమర్పించింది. నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు నివేదిక అందజేసింది. 2024 మార్చి 14న కమిషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 15 నెలల పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి విచారించింది. ఇందులో కెసిఆర్,

# రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా కుట్రలు

- వైసీపీ హయాంలో ఏపీ ఎంతో నష్టపోయింది
- ప్రభుత్వం మారుతోందంటూ సింగపూర్‌కు మెయిల్
- మెయిల్ చేసిన మురళీకృష్ణకు వైకాపాతో సంబంధాలు
- రాజధాని అమరావతి అభివృద్ధికి సింగపూర్ అంగీకారం
- రూ. 45 వేల కోట్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు
- మీడియాతో మంత్రి నారా లోకేశ్

**అమరావతి,జూలై31( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు రాకుండా చేయాలని వైసీపీ కుట్రలు పన్నుతోందని రాష్ట్ర ఐటీ-, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ విమర్శించారు. రేపో మాపో ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారిపోతుందంటూ సింగపూర్ అధికారులకు మురళీకృష్ణ అనే వ్యక్తి ఈ మెయిల్ చేశారని తెలిపారు. మురళీకృష్ణకు వైసీపీ నేతలతో సత్సంబంధాలు ఉన్నాయని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులందరికీ ఈ మెయిళ్లు పెట్టారని వివరించారు. వైసీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ఆర్ సంస్థతో మురళీకృష్ణకు సంబంధమున్నట్లు-



## 2న అన్నదాత సుఖీభవకు శ్రీకారం

- ప్రకాశం జిల్లా దర్శిలో ప్రారంభించనున్న సిఎం
- అధికారులతో సమీక్షించన చంద్రబాబు



## మీరు చెప్పే రాజ్యాంగాన్ని ఆచరిస్తారా?

- సుప్రీం తీర్పుపై రాహుల్‌కు హరీష్ రావు ప్రశ్న



# రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఎమర్జెన్సీ పరిస్థితులు

- పర్యటన కోసం ఆంక్షలు విధించడం విడ్డూరం
- పరామర్శించ డానికి వస్తే తప్పేంటి
- ప్రతిపక్ష నేతను చూస్తే బాబుకు భయమెందుకు
- ప్రశ్నించేవారి గొంతు నొక్కేస్తున్నారు
- జైలులో మాజీమంత్రి కాకాణికి పరామర్శ
- మాజీ ఎమ్మెల్యే ప్రసన్న నివాసంలో భేటీ
- మీడియాతో కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శలు



**నెల్లూరు,జూలై31( వెలుతురు):**
రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఇవాళ రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు కనిపిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తన పార్టీ వాళ్లను పరామర్శించ డానికి వస్తే తప్పేంటని.. పర్యటన కోసం ఆంక్షలు విధించడం విడ్డూరంగా ఉందని అన్నారు. నెల్లూరులో ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడారు.. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఇవాళ రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు తలపిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మా పార్టీ వాళ్లను పరామర్శించడానికి వస్తే తప్పేంటి?.. పర్యటన నేపథ్యంలో ఆంక్షలు విధించడం విడ్డూరంగా ఉందని అన్నారాయన. గురువారం నెల్లూరు పర్యటనలో భాగంగా.. అక్రమ కేసుల్లో జైల్లో ఉన్న మాజీ మంత్రి కాకాణితో

(మొదటి పేజీ తరువాయి..)

## నలుగురు కొత్త జడ్జిల ప్రమాణం

నియమితులైన నలుగురు జడ్జిలు ప్రమాణ స్వీకారం చేశారు. చీఫ్ జస్టిస్ వీరితో ప్రమాణం చేయించారు. జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్‌తో సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. హైకోర్టులో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, లాయర్లు హాజరయ్యారు. హైకోర్టులో లాయర్లుగా ఉన్న ఈ నలుగురిని జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో వారి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 28న ఆమోదముద్రవేశారు. దీంతో రాష్ట్ర హైకోర్టులో జడ్జిల సంఖ్య 30కి చేరింది. మొత్తం 42 మంది జడ్జిలు ఉండాలి.

## అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు అందే విధంగా కృషి చేస్తాను



ప్రధానమంత్రి ఆవాస్ యోజన, రాష్ట్ర నిధులతో ఇల్లు లేనటువంటి పేదవారందరికీ ఇల్లు అందజేయాలని ఆలోచనతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. గురువారం జైనథ్ మండలం లోని జైనథ్. బెల్గాం. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలను అందజేసి.. నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ ఫలాలు అర్హులైన పేదవారికి మాత్రమే అందాలన్నారు. ప్రభుత్వ పథకాలు ఏవి వచ్చినా అర్హులైన వారికి అందే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. నియోజకవర్గంలోని లబ్ధిదారులు ఎవరు కూడా మధ్యవర్తులను నమ్మవద్దని సూచించారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారికి తక్కువ ధరకే సిమెంట్ లభించే విధంగా కంపెనీలతో మాట్లాడుతానని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు బిజెపి నాయకులు కరుణాకర్ రెడ్డి రాందాస్ రాకేష్ రెడ్డి విజయ్ అశోక్ రెడ్డి. రమేష్. సూర్య. అశోక్.. సాయి. విశాల్. నరేష్. ప్రతాప్ ఉషన్న తదితరులు ఉన్నారు..

## రోహింగ్యాలు చొరబాటుదారులా..శరణార్థులా?

గురువారం విచారణ చేపట్టింది. రోహింగ్యాలను శరణార్థులుగా ప్రకటించేందుకు అర్హులేనా? అని ప్రశ్నించిన సుప్రీంకోర్టు.. అసలు రోహింగ్యాలు చొరబాటుదారులో.. శరణార్థులో తేల్చాలని ఆదేశించింది. ఒకవేళ రోహింగ్యాలు చొరబాటుదారులైతే బహిష్కరిస్తున్నారా? అని కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, రోహింగ్యాల బహిష్కరణకు కేంద్రం, రాష్ట్రాలు తీసుకున్న చర్యలేంటని కూడా అత్యున్నత న్యాయస్థానం కేంద్రాన్ని కోరింది. న్యాయమూర్తులు సూర్యకాంత్, దీపంకర్ దత్తా ఇంకా ఎన్.కోటీశ్వర్ సింగ్ లతో కూడిన బెంచ్ ఈ అంశంపై విచారణ జరిపింది. రోహింగ్యాలు చొరబాటుదారులో.. శరణార్థులో తేలాక ఇతర సమస్యలు, పర్యవసానాల గురించి మాట్లాడవచ్చని అభిప్రాయపడింది. ఒకవేళ రోహింగ్యాలు శరణార్థులుగా ప్రకటిస్తే, వారికి ఏ రక్షణలు లేదా హక్కులు ఉన్నాయో చెప్పాలని బెంచ్ ప్రశ్నించింది. అక్రమ వలసదారులైతే, వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహిష్కరించే చర్య సరైనదేనా? వారిని నిరవధికంగా నిర్బంధించడం లేదా బెయిల్‌పై విడుదల చేయవచ్చా.. అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రోహింగ్యాల నిర్బంధమే కీలక అంశమని పిటిషనర్ల తరపున న్యాయవాది న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం.. రోహింగ్యాలకు సంబంధించి దాఖలైన అనేక పిటిషన్లను మూడు విభాగాలుగా విభజించి విచారణ చేపడతామని పేర్కొంది. ప్రతి బుధవారం వీటిని విచారించేందుకు సమయాన్ని కేటాయిస్తామని పేర్కొంది. కాగా, రోహింగ్యాలు దేశంలో 12 రాష్ట్రాల్లో నివసిస్తున్నట్లు- కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. తెలంగాణ, ఢిల్లీ, యూపీ, వెస్ట్ బెంగాల్, తమిళనాడులో అధికంగా, మరికొన్ని రాష్ట్రాల్లో తక్కువగా రోహింగ్యాలు ఉన్నట్టు- సమాచారం.

## దేవాదాయ శాఖలో ఈ-ఆఫీసు సర్వీసును ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ



దేవాదాయ శాఖకు సంబంధించి ప్రధాన కార్యాలయం కమిషనరేట్‌లో ఈ-ఆఫీస్ సర్వీసును మంత్రి ప్రారంభించారు. ఈ కొత్త విధానం ద్వారా దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో పెండింగ్ ఫైల్ వ్యవహారాలు వేగంగా, పారదర్శకంగా ముందుకు వెళ్ళనున్నాయి. ఈ ప్రారంభ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ ఎస్. వెంకటరావు తదితరులు ఉన్నారు.

### దేవాదాయ శాఖలో పాలనా సంస్కరణలకు ఊతం: మంత్రి కొండా సురేఖ

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఈ-ఆఫీస్ వల్ల దేవాదాయ శాఖలో సంస్కరణలు జరుగుతాయని, ఇదొక గొప్ప ముందడుగు అని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఈ-ఆఫీసు ద్వారా ఫైల్స్ త్వరగా, ఆలస్యం లేకుండా క్లియర్ చేయవచ్చన్నారు. డిజిటల్‌గా అన్నీ ట్రాక్ అవుతాయన్న కారణంగా సిబ్బంది మధ్య అపోహలు ఉండవన్నారు. అలాగే, ఫైల్స్ మాయం కావడం, తడిసిపోవడం, దొంగతనం లేదా అగ్ని ప్రమాదాల్లో నష్టం చెందడం లాంటి సమస్యలు ఉండవన్నారు. ఎక్కడినుంచైనా, ఎప్పుడైనా ఫైల్స్ క్లియర్ చేసే అవకాశం ఉంటుందని వివరించారు. ఉన్నతాధికారులు, ఈ-ఆఫీసు వల్ల వారి కార్యాలయాల్లో భౌతికంగా ఉండాల్సిన అవసరం లేదన్నారు. అత్యవసర ఫైల్స్‌ను ప్రత్యేకంగా గుర్తించేందుకు ట్యాగ్ చేయవచ్చని తెలిపారు. కొద్ది రోజుల్లో యాదగిరిగుట్ట టెంపుల్ సర్వీసులను కూడా డిజిటలైజ్ చేస్తామని, అనంతరం రాష్ట్రంలోని 30 పెద్ద దేవస్థానాలల్లో ఈ ఆఫీసు సర్వీసులు వినియోగిస్తామన్నారు. దీంతోపాటు పీఏలు, సీసీలు లాంటి మధ్యవర్తుల జోక్యం చాలా తక్కువవుతుందన్నారు. ఈ-ఆఫీస్ సాఫ్ట్‌వేర్‌ను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (%చీ×జ%) అభివృద్ధి చేసిందని శైలజా రామయ్యర్ తెలిపారు. దీంతోపాటు అప్లికేషన్ నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఉండబోవని, పారదర్శకతకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ఎన్ఐసీ జాయింట్ డైరెక్టర్ రాఘవాచారి, టెక్నికల్ మేనేజర్ సవిత హాజరయ్యారు.

### ఈ-ఆఫీసు ద్వారా కారుణ్య నియామకానికి మంత్రి సురేఖ ఆమోదం:

ఈ-ఆఫీసు ప్రారంభోత్సవంలో భాగంగా మంత్రి కొండా సురేఖ మొదటి ఫైల్‌ను ఈ-అప్లికేషన్ ద్వారా ఆమోదించారు. ఒక కారుణ్య నియామక ప్రక్రియను పూర్తి చేశారు. నవీన్ కుమార్ అనే వ్యక్తికి తన తండ్రి మరణించగా దేవాదాయ శాఖలో ప్రభుత్వ ఉద్యోగాన్ని మంత్రి సురేఖ మంజూరు చేశారు. ఈ-ఆఫీసు ప్రక్రియను విజయవంతంగా చేసినందుకు దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. వెంకటరావును మంత్రి అభినందించారు. గత 15 రోజులుగా కమిషనర్ స్వయంగా కంప్యూటరైజేషన్ పనులను పర్యవేక్షించారని కొనియాడారు. ప్రతి సిబ్బందికి తగిన శిక్షణ కల్పించారని, ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా అమలులోకి రావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

# పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌దే తుది నిర్ణయం

ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి చర్యలు సంవత్సరాల తరబడి సాగడం అర్థరహితంగా అని పేర్కొంది. ఈ అంశంపై సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసిన తర్వాత మాత్రమే స్పీకర్ ఎమ్మెల్యేలకు నోటీసు జారీ చేయడం దురదృష్టకరం అని వ్యాఖ్యానించింది. అపరేషన్ సక్సెస్.. పేషెంట్ డైడ్' అన్న సూత్రం వర్తించకూడదని వ్యాఖ్యానించింది.ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాలి. ఇలాంటి చర్యలు ఏళ్ల తరబడి సాగడం వల్ల అర్థరహితంగా మారుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి, ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడికౌశిక్‌రెడ్డి, కేపీవివేకానంద, జి.జగదీశ్‌రెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్, భాజపా శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో తొమ్మిదిసార్లు విచారణకు వచ్చాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం అన్నిపక్షాల వాదనలు విన్న తర్వాత ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, ఎ.గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లు ఉన్నారు. సుదీర్ఘ వాదనల అనంతరం గురువారం తీర్పు వెలువడింది. దీనిని బిఆర్ఎస్ నేతలు స్వాగతించాలి.

# రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా కుట్రలు

తెలిసిందన్నారు. ఇదే క్రిమినలైజేషన్ ఆఫ్ పాలిటిక్స్ అని ఆయన అభివర్ణించారు. గురువారం అమరావతిలో మంత్రి నారా లోకేష్ విలేకర్లతో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో ఏపీ ఎంతో నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీశారని మండిపడ్డారు. రాజధాని అమరావతి సంయుక్త అభివృద్ధికి సింగపూర్ అంగీకారం తెలిపిందన్నారు. సింగపూర్ పర్యటనలో రూ. 45 వేల కోట్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. సింగపూర్‌లో నాలుగు రోజుల్లో సీఎం చంద్రబాబు 26 మీటింగ్స్ నిర్వహించారని వివరించారు. 19 వన్ టూ వన్ మీటింగ్స్‌లో తాను సైతం పాల్గొన్నానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ఎ÷-లాంట్, డేటా సెంటర్స్ ఏర్పాటు-కానున్నాయని చెప్పారు. అత్యధిక పన్నులు చెల్లింపు సంస్థగా ఉన్న అమర్ రాజా... పక్క రాష్ట్రానికి పారిపోయేలా చేశారని వివరించారు. అంతేకాదు.. లులూ గ్రూప్‌ను సైతం ఏపీ నుంచి జగన్ తరిమేశారని చెప్పారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణే తమ లక్ష్యమని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏపీ బ్రాండ్‌ను తిరిగి సాధించేలా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఏపీలో పెద్ద ఎత్తున డేటా సెంటర్లు రానున్నాయని తెలిపారు. ఆ క్రమంలో రాష్ట్రంలో టాటా ఇన్నోవేషన్ హబ్స్ ఏర్పాటు-కానుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్లస్టర్లుగా విభజించి.. అభివృద్ధికి శ్రీకారం చుట్టామని తెలిపారు. యువతకు ఉద్యోగాల కల్పన కోసం నైపుణ్య శిక్షణపై దృష్టి సారించినట్లు- వివరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయన తర్వాత ఏపీకి బ్రాండ్ తిరిగొచ్చిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పరిశ్రమలు వస్తున్నాయని చెప్పారు. వైసీపీ హయాంలో ఏకపక్షంగా సింగపూర్ ఒప్పందాలు రద్దు చేశారని ఆరోపించారు. వైసీపీ హయాంలో సింగపూర్ ప్రభుత్వంపై అవినీతి ముద్ర వేశారని గుర్తు చేశారు. విశాఖను ఐటీ- పటంలో పెట్టాలని తాము నిర్ణయించామని తెలిపారు. టీ-సీఎస్‌కు రూ.99 పైసల చొప్పున భూమి కేటాయించామని మంత్రి నారా లోకేష్ వివరించారు. వైఎస్ జగన్ నెల్లూరు జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్రంలో ఎమర్జెన్సీ వాతావరణం ఉందని విమర్శించారు. దీనిపై నారా లోకేష్ తనదైన శైలిలో ప్రశ్నించారు. ఎమర్జెన్సీ వాతావరణం ఉంటే అసలు జగన్ బయటకు రాగలరా..? అంటూ ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ఇంటి గేటు-కు తాళ్లేసి కట్టలేదా..? అని గుర్తు చేశారు. భద్రతగా పోలీసులను పెడితే.. పోలీసులను మోహరించారని అంటారని.. పోని పోలీసులను పెట్టకుంటే భద్రత ఇవ్వలేదని పేర్కొంటారన్నారు. సొంత తల్లి, చెల్లి మీద ఎవ్వడైనా కేసులు పెడతారా..? అంటూ వైఎస్ జగన్ వ్యవహార శైలిని ఈ సందర్భంగా నిలదీశారు. ఆ కేసులో గెలిచానని సంబరాలు చేసుకుంటారా..? అంటూ సందేహం వ్యక్తం చేశారు. తల్లి మీద కేసు పెట్టి సంబరాలు చేసుకునే ఏ-కై-క వ్యక్తి జగన్ మోహన్ రెడ్డే అని ఆయన వ్యంగ్యంగా అన్నారు. తల్లి, చెల్లికి అన్యాయం చేసిన వ్యక్తి అసలు నాయకుడిగా పని కొస్తాడా..? అంటూ నారా లోకేష్ అనుమానం వ్యక్తం చేశారు. మద్యం కుంభకోణం కేసులో వైఎస్ జగన్ అరెస్ట్ అవుతారా అంటూ విలేకరి అడిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ ఆసక్తికర కామెంట్ చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందంటూ ఆయన వ్యాఖ్యానించారు.

## సుప్రీం తీర్పుపై నిపుణులతో చర్చించి నిర్ణయం

**హైదరాబాద్,జూలై31( వెలుతురు):**
ఫిరాయింపుల ఎమ్మెల్యేల వ్యవహారంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. తనకు మూడు నెలల గడువు విధించడంపై న్యాయ నిపుణులతో చర్చించాకే తదుపరి నిర్ణయానికి వెళ్తామని అన్నారు. ఈ క్రమంలో ధన్‌ఖడ్ వ్యాఖ్యల ప్రస్తావన తెచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు పై న్యాయ నిపుణులతో చర్చిస్తా. మాజీ ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ ఏం మాట్లాడారో అందరూ చూశారు. వాటిని కూడా మేము పరిశీలిస్తున్నాం. గతంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చాం. సుప్రీంకోర్టు తీర్పును పరిశీలించాకే అన్ని వివరాలు త్వరలో చెప్తా అని అన్నారు. ఇదిలా ఉంటే.. పార్టీ మారిన పది మందిపై తొలుత తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఆ సమయంలో.. విచారణ షెడ్యూల్ కోసం సింగిల్ బెంచ్ జడ్జి తెలంగాణ స్పీకర్‌కు నాలుగు వారాల గడువు విధించారు. అయితే డివిజనల్ బెంజ్ దానిని కొట్టేసింది. ఇక ఇవాళ్టి తీర్పులో ఫిరాయింపులపై చర్యల విషయంలో స్పీకర్‌కు సుప్రీం కోర్టు మూడు నెలల కాలపరిమితి విధించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రపతి, గవర్నర్‌లకు గడువు విధిస్తూ సుప్రీం కోర్టు సంచలనాత్మక తీర్పు వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉప రాష్ట్రపతి హోదాలో ఓ కార్యక్రమానికి హాజరైన ధన్‌ఖడ్.. సుప్రీం కోర్టుపై తీవ్ర వ్యాఖ్యలే చేశారు. పార్లమెంటే సుప్రీం అని. ఎన్ని-కై-న ప్రజాప్రతినిధులే రాజ్యాంగ ప్రకారం అల్టిమేట్ మాస్టర్స్ అని అన్నారాయన. 'సుప్రీం కోర్టు రాష్ట్రపతికి గడువు విధించడం తగదు. ఇప్పుడు జడ్జీలు శాసనాలు చేస్తారు, కార్యనిర్వాహక విధులు నిర్వర్తిస్తారు, సూపర్ పార్లమెంటులా వ్యవహరిస్తారు' అని విమర్శించారు. న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్య శక్తులపై అణుక్షిపణి ప్రయోగించకూడదు అని తీవ్ర వ్యాఖ్య చేశారాయన. అయితే.. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలన్న పిటిషన్ విచారణ సమయంలో సుప్రీం కోర్టు పరోక్షంగా ధన్‌ఖడ్ వ్యాఖ్యలపై స్పందించింది. ఇప్పుడు మేమే కార్యనిర్వాహక వ్యవస్థలో జోక్యం చేస్తున్నామన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నాం. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతికి ఆదేశాలు ఇవ్వాలా? అంటూ ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

## మీరు చెప్పే రాజ్యాంగాన్ని ఆచరిస్తారా?



**హైదరాబాద్,జూలై31( వెలుతురు):**
తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు-పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. ఈ అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని హరీశ్‌రావు ప్రస్తావిస్తూ.. మీరు బోధించే వాటిని మీరు ఆచరించగలరా..? అని రాహుల్ గాంధీని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. మీ తండ్రి దివంగత రాజీవ్ గాంధీ 52వ రాజ్యంగ సవరణ ద్వారా ప్రవేశపెట్టిన ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్పీకర్‌ను మీరు కోరుతారా..? అని ప్రశ్నించారు. లేదా రాజ్యాంగాన్ని చేతిలో మోసుకెళ్లడం కేవలం ఎన్నికల మోసమా..? అని రాహుల్ గాంధీని హరీశ్‌రావు నిలదీశారు.

## 2న అన్నదాత సుఖీభవకు శ్రీకారం



**అమరావతి,జూలై31( వెలుతురు):**
రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన హామీ మేరకు 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ నేపథ్యంలోనే గురువారం నాడు అన్నదాత సుఖీభవ పథకం అమలుపై సంబంధిత అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 2వ తేదీన 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతుంది. ఆగస్టు 2న ప్రకాశం జిల్లా దర్శిలో 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. అదే రోజున పీఎం కిసాన్ పథకం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6,000 సాయంతో కలిపి రాష్ట్ర వాటాగా మరో రూ.14,000 కూటమి ప్రభుత్వం ఇవ్వనుంది. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రైతుకు రూ.20,000 నగదును 3 విడతలుగా ప్రభుత్వం ఇవ్వనుంది. మొదటి విడతలో రాష్ట్రం వాటా రూ.5,000.. కేంద్రం వాటా రూ.2,000 చొప్పున ఆగస్టు 2న విడుదల చేయనున్నారు. రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు 'అన్నదాత సుఖీభవ'తో లబ్ది చేకూరనుంది. ఇందుకోసం రూ.2,342.92 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో పీఎం కిసాన్ మొదటి విడత కింద కేంద్ర ప్రభుత్వం రూ.831.51 కోట్లు- రైతుల ఖాతాలో జమచేయనుంది. కాగా, రాష్ట్ర రాజధాని అమరావతి బ్యూటిఫికేషన్, గ్రీన్ -బ్లూ మాస్టర్ ప్లాన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారధి హాజరయ్యారు. అమరావతిలో ట్రంక్ రోడ్లు, ఇతర అనుబంధ రోడ్లు, ఎల్పీఎస్ రోడ్లు, బఫర్ జోన్లలో ఎ÷-లాంటేషన్, బ్యూటిఫికేషన్, అవెన్యూ ఎ÷-లాంటేషన్‌పై చర్చించారు. అమరావతిలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో పార్కులు, హరిత ప్రాంతం ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఔషధ మొక్కలను నాటడంతో పాటు- అమరావతిలో బయోడైవర్సిటీ- ఉండేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సీఎం సూచించారు. గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో దేశీయ వృక్షజాతులు ఉండేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. రివర్ ఫ్రంట్ కూడా సుందరంగా కనిపించేలా శ్రద్ధ పెట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఎమర్జెన్సీ పరిస్థితులు

ములాఖత్ అయ్యారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి మీడియాతో వైఎస్ జగన్ మాట్లాడారు. మా పార్టీ శ్రేణులు, అభిమానులు రాకుండా రోడ్లను తవ్విన అధ్వాన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రతిపక్ష నేతను చూసి చంద్రబాబు ఇంతలా ఎందుకు భయపడుతున్నారు?. ఇవాళ వేల మంది పోలీసులు.. లెక్కలేనంత మంది డీఐజీలు, డీఎస్పీలు ఉన్నారు. వీళ్లంతా నా సెక్యూరిటీ- కోసం కాకుండా.. అభిమానులను ఆపడం కోసం ఉన్నారు. సూపర్‌సిక్స్ అంటూ ప్రజలను మోసం చేశారు. నాడు నేడు ఆగిపోయింది. ఇంగ్లీష్ మీడియం ఆగిపోయింది. అన్ని పథకాలు ఆపేశారు. వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేశారు. తన పాలన చూసి చంద్రబాబే భయపడుతున్నారు. ప్రజలకు సమాధానం చెప్పుకోలేకే రెడ్‌బుక్ రాజ్యాంగం. ప్రశ్నించేవారి గొంతులను నొక్కేస్తున్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యే అయిన ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడికి ప్రయత్నించారు. ప్రసన్న ఇంటిపైకి 80 మందిని పంపి దాడి చేయించారు. మారణాయుధాలతో ఇంట్లోకి ప్రవేశించి.. ఫర్నీచర్ ధ్వంసం చేశారు. ఆ దాడితో ప్రసన్న తల్లి వణికిపోయారు. ఆ సమయంలో ప్రసన్న ఇంట్లో లేరు కాబట్టి సరిపోయింది. లేకుంటే చంపి ఉండేవారేమో. ఇళ్లపై దాడులేంటి.. మనుషుల్ని చంపాలని చూడడమేంటి?. మనిషి నచ్చకపోతే చంపేస్తారా?.. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు గతంలో చూడలేదు. మా పార్టీ మహిళా నేతలు రోజా, ఉప్పాడ హారిక, విడదల రజిని లాంటి వాళ్లను ఉద్దేశించి టీ-డీపీ నేతలు ఎంత దారుణంగా మాట్లాడారో అంతా చూశారు. రాష్ట్రంలో చంద్రబాబు విషబీజాలు నాటారు.. కాకాణి గోవర్ధన్‌పై 14 కేసులు పెట్టారు. కావలిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేశారు. దానిని ప్రశ్నించినందుకే తప్పుడు సాక్ష్యాలు సృష్టించి కాకాణిపై కేసులు పెట్టారు. ఒక రాజకీయ నాయకుడు ప్రెస్ మీట్ పెడితే.. దానిని వాట్సాప్‌లో షేర్ చేస్తే కేసులు పెడతారా?. ఒక కేసు అయిపోగానే మరో కేసు పెట్టి వేధిస్తున్నారు. ఏ తప్పు చేశాడని కాకాణిపై కేసులు పెట్టారు?. శాడిజం చంద్రబాబు నరనరాన పేరుకుపోయిందనడానికి ఇదే నిదర్శనం అని జగన్ అన్నారు. టీ-డీపీ కార్యకర్త సాక్ష్యం చెబితే కాకాణిపై కేసు పెడతారా?. మాగుంట శ్రీనివాసులు ఫోర్జరీ కేసులో చొవ్వా చంద్రబాబు కోసం కాకాణిపై కేసు పెడతారా?. టీ-డీపీ నేతల దాడుల్లో గాయపడిన బాధితులను పరామర్శించినా కేసులు పెడతారా?. పోలీసుల పక్షపాత ధోరణిని ఎత్తి చూపించినా కేసులు పెడతారా?. ఇంతకన్నా అన్యాయమైన పరిస్థితులు ఉంటాయా?.. అని జగన్ ప్రశ్నించారు. లిక్కర్ మాఫియాకు డాన్ చంద్రబాబే. కూటమి ప్రభుత్వంలో ఇల్లీగల్ పర్మిట్ రూంలో మద్యం అమ్ముతున్నారు. ఎమ్మార్పీ కంటే అధిక రేట్లకు అమ్ముతున్నారు. మద్యం కమీషన్లు చంద్రబాబు, ఎమ్మెల్యేలే పంచుకుంటు-న్నారు. సిలికా, క్వార్ట్జ్‌ను విచ్చలవిడిగా దోచేస్తున్నారు. మైన్స్ కమీషన్లు చంద్రబాబు, లోకేష్‌కే చేరుతున్నాయి. పరిశ్రమలు నడుపుకోవాలన్నా.. ముడుపులు చెల్లించాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. చంద్రబాబు పాలన ఎంత దారుణంగా ఉందో చెప్పడానికి ఈ పరిస్థితులే ఉదాహరణలు. నందిగం సురేష్‌ను జైల్లో పెట్టారు. వల్లభనేని వంశీని చిత్రహింసలు పెట్టారు. కాలేజీ రోజుల నాటి గొడవ.. పెద్దిరెడ్డితో కోపంతోనే మిథున్‌రెడ్డిపై చంద్రబాబు లిక్కర్ కేసు పెట్టారు. తన సొంత నియోజకవర్గంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎమ్మెల్యే అయ్యాడనే కోపంతోనే చంద్రబాబు కేసు పెట్టించాడు. కొడాలి నాని, పేర్ని నాని.. పేర్ని నాని భార్యను, అనిల్ కుమార్ యాదవ్‌ను వేధిస్తున్నారు. ఇలా ఎంతో మంది(పేర్లు చదివి వినిపించారు) అన్యాయాలను ప్రశ్నిస్తున్నవాళ్ల మీద తప్పుడు కేసులు పెట్టారు అని జగన్ అన్నారు. చంద్రబాబూ.. మీరు ఏదైతే విత్తుతారో అదే రేపు పండుతుంది. ఎల్లకాలం మీ ప్రభుత్వం ఉండదు. కళ్లు మూసి తెరిచేలోపే మూడేళ్లు గడుస్తుంది. అప్పుడు మా ప్రభుత్వమే వచ్చింది. అప్పుడు కచ్చితంగా చంద్రబాబుకి, చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తిన అధికారులకు లెక్క జమ తీసి చట్టం ముందు నిలబెడుతాం. తప్పు చేసిన ప్రతీ ఒక్కరికి శిక్ష తప్పదు. ఇప్పటి-కై-నా అది

# స్పీకర్‌కు సుప్రీం సూచనలు మాత్రమే చేసింది

**- గతంలో ఫిరాయింపులను మరచిన బిఆర్ఎస్**

**- మీడియా సమావేశంలో మండిపడ్డ అద్దంకి**



**హైదరాబాద్,జూలై31( వెలుతురు):**

ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ అధికారాలను సుప్రీంకోర్టు ప్రశ్నించలేదని, కేవలం సూచనలు మాత్రమే చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. దీనిపై ఎవరికి వారు వక్ర భాష్యాలు చెబుతున్నారని అన్నారు. సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సభాహక్కులు కాపాడేది కేవలం స్పీకర్ మాత్రమేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందన్నారు. తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందంటూ భారత రాష్ట్ర సమితి నాయకులు తెలివి తక్కువగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. గతంలో వారు చేసిన ఫిరాయింపుల గురించి మాట్లాడాలని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు ముందు సుప్రీంకోర్టు తీర్పును చదవాలి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలను తమ పార్టీలో విలీనం చేసుకున్న చరిత్ర కేసీఆర్‌ది. అధికారంలో ఉన్న పదేళ్లు వారు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కింది వారే. సీఎల్పీ నేతగా ఒక దళిత నేత ఉంటే సహించలేక కేసీఆర్ కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని విలీనం చేసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీల అంతం చూడాలని కేసీఆర్ ప్రయత్నించారు. మేం ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని బతికించాం అన్నారు. గతంలో అక్రమాలకు పాల్పడి సమర్థించుకోవడం బిఆర్ఎస్ నేతలకే దక్కిందని అన్నారు. ప్రతిపక్ష హోదా ఉన్నా అసెంబ్లీకి రాని కేసీఆర్‌పై మేం కోర్టుకు వెళ్లాలా? కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాంఅని అద్దంకి దయాకర్ అన్నారు. ఇలాంటి వారు చట్టాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

# దేశ ప్రయోజనాలపై రాజీపడేది లేదు

**- ట్రంప్ వాణిజ్య సుంకాలపై పీయూష్ గోయల్**

**- లోక్‌సభలో ప్రకటించిన కేంద్రమంత్రి**



**న్యూఢిల్లీ,జూలై31( వెలుతురు):**

దేశ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోనున్నట్లు- వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఆగస్టు 1 నుంచి భారత వస్తువులపై 25శాతం టారిఫ్ విధిస్తున్నట్లు- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై.. లోక్‌సభలో పీయూష్ గోయల్ మాట్లాడారు. ఈ టారిఫ్ ప్రభావాలను ప్రభుత్వం అధ్యయనం చేస్తోందన్నారు. భారత ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం అని స్పష్టం చేశారు. గత కొన్ని నెలలుగా భారత్-అమెరికా రెండు దేశాలు సమతుల్య, పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం రైతులు, చిన్న వ్యాపారులు, ఎంఎంఈలు వంటి వర్గాల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతగా భావిస్తోందని గోయల్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై అనూహ్యంగా భారీ టారిఫ్ బాంబు విసిరారు. భారత దిగుమతులపై ఏకంగా 25 శాతం సుంకాలు బాదారు. అంతేగాక వీటికి అదనంగా రష్యాతో వర్తకం చేస్తున్నందుకు భారత్‌పై ప్రత్యేకంగా జరిమానా కూడా విధించనున్నట్టు- పేర్కొన్నారు. ఆ మొత్తం ఎంతన్నది పేర్కొనలేదు. ఈ నిర్ణయాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. తన సోషల్ మీడియా హ్యాండిల్ 'ట్రూత్ సోషల్'లో బుధవారం ఈ మేరకు ఆయన పలు పోస్టులు పెట్టారు. అమెరికాతో భారత వర్తక విధానాలు, నిబంధనలను అత్యంత దారుణమైనవిగా అభివర్ణించారు. భారత్ మా మిత్ర దేశమే. కానీ వర్తక, వాణిజ్య సంబంధాల విషయంలో ఆ దేశంతో అంతా సజావుగా లేదు. అమెరికాపై ప్రపంచంలోనే అత్యధిక టారిఫ్‌లు వసూలు చేస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. అందుకే ఆ దేశంతో మేం భారీ స్థాయిలో వ్యాపారం చేయడం లేదు'అని రాసుకొచ్చారు. భారత్‌తో అమెరికాకు భారీ వర్తక లోటు- ఉందని గుర్తు చేశారు. రష్యా నుంచి భారీగా చమురు, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నందుకే అదనంగా జరిమానా విధిస్తున్నట్టు- స్పష్టం చేశారు. 'ఉక్రెయిన్‌లో జనహననం ఆగాలని ప్రపంచమంతా ఆకాంక్షిస్తోంది. ఇలాంటి సమయంలో అందుకు పాల్పడుతున్న రష్యాతో భారత్ భారీ వాణిజ్య సంబంధాలు నెరుపుతోంది'అంటూ ఆక్షేపించారు.

# మంచిరేవులలో చిక్కిన చిరుత

**హైదరాబాద్,జూలై31( వెలుతురు):**

గత 12 రోజులుగా అధికారులకు కంటి మీద కునుకులేకుండా చేసిన చిరుతపులి ఎట్టకేలకు చిక్కింది. మంచిరేవులలో ఏర్పాటు- చేసిన బోనులో చిరుత పడిందని అధికారులు ప్రకటించారు. దీనిని నల్లమల్ల అడవిలో వదిలిపెట్టనున్నట్లు- తెలిపారు. నగర శివారులో గత రెండు వారాలుగా చిరుత సంచారం జనాలను భయాందోళనకు గురి చేస్తూ వచ్చింది. మృగవని పార్క్ గ్రేహౌండ్స్ పరిధిలో చిరుత సంచారం కలకలం రేపింది. దీనిని బంధించేందుకు 8 ట్రాప్ కెమెరాలు, 4 బోనులు ఏర్పాటు- చేశారు అధికారుల. అయినా అది చిక్కకుండా అధికారులను ముప్పు తిప్పలు పెట్టింది. ఈ క్రమంలో గత అర్ధరాత్రి దాటాక మొయినాబాద్ ఎకోటిక్ పార్క్‌లో ఏర్పాటు- చేసిన బోనులో చిరుత చిక్కింది. దీనిని నల్లమల అటవీ ప్రాంతంలో వదిలి పెడతామని అధికారులు తెలిపారు.

# రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుండి తప్పుడు వాగ్దానాలు...

విమర్శలు చేశారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో గురువారం రోజున నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు మాట్లాడారు. మీడియా సమావేశానికి ముందు భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా, హైదరాబాద్, రంగారెడ్డి మరియు చుట్టుపక్కల ఉన్న ఎనిమిది జిల్లాలకు చెందిన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం యువ మోర్చా ఆఫీస్ బేరర్ సమావేశం కూడా జరిగింది. ఈ సందర్భంగా కాసం వెంకటేశ్వర్లు మాట్లాడిన విశేషాలు ఏమిటంటే... ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశం మూడు గంటల పాటు కొనసాగిన తర్వాత, ముఖ్యమంత్రి గారు తేల్చింది ఏమిటంటే ం బీసీలకు ఉన్న 42% రిజర్వేషన్లు (స్థానిక సంస్థల ఎన్నికల్లో మరియు విద్యా/ఉద్యోగాల్లో) తన పరిధిలో లేవని చెప్పి, నిస్సిగ్గుగా ఢిల్లీకి బయలుదేరారు. ఢిల్లీకి బీసీ రిజర్వేషన్లతో ఏ సంబంధముందో ఈ చదువుకున్న నిరక్షరాస్యులకు తెలియదా? రిజర్వేషన్లపై కామారెడ్డి డిక్లరేషన్ చేయవచ్చునేమో కానీ, ఆ హామీలను అమలు చేయడం మాత్రం తమ పరిధిలో లేదని చెప్పడం ప్రజల్ని అవమానించడమే. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఏ ఒక్క అంశాన్నీ అమలు చేయకుండా, బీసీలను మోసం చేస్తూ నట్టేట ముంచుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక్కడ చేయాల్సిన పనులు చేయకుండా, కేబినెట్ సమావేశంలో ఏ అంశం రాష్ట్ర పరిధిలో ఉంది, ఏది కేంద్ర పరిధిలో ఉంది, ఏది సుప్రీంకోర్టు పరిధిలో ఉందో కూడా చర్చించకుండానే బీసీలను మోసం చేస్తున్నారు. గతంలో కేసీఆర్ గారు తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టంలోని 285వ అధికరణను సవరించాలన్న ఆలోచన లేకుండా, 'యాస్ ఇట్ ఈస్'గా ఉంచి, దాంట్లో ఏముందో చదవకుండానే, కేంద్ర ప్రభుత్వం మీద, ప్రధాని నరేంద్ర మోదీ గారి మీద నెపం వేసి



మాట్లాడటం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇప్పుడు ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. ఇటువంటి కుట్రలను ఇక ప్రజలకు తెలియజేసే సమయం వచ్చింది. మరోవైపు గత 10 సంవత్సరాల పాటు అధికారంలో ఉండి, పదవులు ఏలిన కవిత గారు, ఇప్పుడు బీసీల హక్కుల కోసం మాట్లాడుతూ.. రాజకీయంగా దరి దొరికించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కవిత గారికి ఇప్పుడు దరి దొరికిందని భావించి, "మూడు రోజులు, అంటే 72 గంటలు నిరాహార దీక్ష చేస్తాను" అంటూ తాము చేసిన పాపాలను ప్రక్షాళన చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. నిజంగా బీసీల పక్షాన మాట్లాడే అర్హత ఉందా? అన్నదానిపై కవిత ఒక్కసారి ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రాష్ట్రాన్ని దోచినంత దోచుకుని, దొరికినంత దోచుకుని, ఇప్పుడు "బీసీల పక్షాన మాట్లాడతా" అంటూ ముందుకు వచ్చి, మరో నటన చేస్తున్నారు. ఈ విధంగా రేవంత్ రెడ్డి, కేసీఆర్ పార్టీ, కవిత.. వీళ్లంతా కలిసి తమ రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారు. బీసీల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం ఏం చేశారనేదానికి ఒక్క ఆధారమూ లేదు. అందుకే భారతీయ జనతా పార్టీ వీళ్ల నిజ స్వరూపాన్ని బయటపెట్టేలా.. బీసీల రిజర్వేషన్ల విషయంలో ఎందుకు రాజకీయంగా ఏమారుస్తున్నారో.. అసలు వారి రాజకీయ ఉద్దేశం ఏమిటో.. అన్నింటి గురించి స్పష్టంగా ప్రజల ముందు బహిర్గతం చేసేలా బిజెపి కార్యచరణ చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే ఆగస్టు రెండవ తేదీన ఉదయం 10 గంటల నుండి బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బీసీల హక్కుల కోసం మహాధర్నా కార్యక్రమం నిర్వహించబోతున్నాం. ఈ మహాధర్నాలో బిజెపి జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రముఖ నాయకులంతా పాల్గొంటారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో పెద్దఎత్తున బీసీ కుల సంఘాలు, బీసీ నాయకులు, మేధావులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ముఖ్యంగా 42% బీసీ రిజర్వేషన్లలో ముస్లింలను ఎలా కలుపుతారు? ముస్లింలను బీసీల జాబితాలో కలిపి ఇటు తెలంగాణతో పాటు ఆతర్వాత దేశవ్యాప్తంగా ఇదే రకంగా మతపరమైన రిజర్వేషన్లను అమలు చేసే కుట్ర చేసే ప్రయత్నం చేస్తోంది. ఆగస్టు 2వ తేదీన బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జరిగే మహాధర్నా కార్యక్రమంలో గత ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన బీసీ వ్యతిరేక కుట్రలు, ఇప్పుడు రేవంత్ రెడ్డి చేస్తున్న బీసీ వ్యతిరేక కుట్రలు, కవిత వంటి మరికొందరి నేతలు ఈ అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్న దురుద్దేశాన్ని.. అన్నింటినీ ప్రజల ముందు బయటపెట్టబోతున్నాం. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని వాగ్దానం చేయడం జరిగింది. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి బీసీని ముఖ్యమంత్రిగా చేసే దమ్ముందా? బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఆగస్టు 2న ఇందిరాపార్కులోని ధర్నా చౌక్ వద్ద బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొనాలని కోరుతున్నాం. బీసీల హక్కుల కోసం పోరాడుదాం, రాజకీయ వాటాను తేల్చుకుందాం.

# సమగ్రమైన తెలంగాణ క్రీడా విధానం

**- సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు రూపకల్పన**

**- క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**వనపర్తి,జూలై31( వెలుతురు):**

సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు సమగ్రమైన తెలంగాణ క్రీడా విధానం 2025 ను రూపొందించామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం వనపర్తి నియోజకవర్గం ఆత్మకూరు కేంద్రంలో స్పోర్ట్స్ కాంక్లేవ్ పోస్టర్ ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ- చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్ద కాలం నుండి విస్మరించబడ్డ క్రీడా రంగం సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లో వేగవంతంగా పనిచేస్తూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి జరుగు తోందని అన్నారు. తాను క్రీడల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొత్తం మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలోనే క్రీడారంగం ఆమోదింపబడటం ఒక క్రీడాకారుడిగా తనకి ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు. దీర్ఘకాలిక క్రీడల అభివృద్ధి కొరకు ఉద్దేశించబడ్డాయి ఈ నూతన క్రీడా విధానాన్ని పటిష్టంగా పకడ్బందీగా అమలు చేయడానికి దేశవ్యాప్తంగా ఉన్న వివిధ క్రీడారంగా నిష్ణాతులు వివిధ క్రీడా సమాఖ్యల ప్రతినిధుల తో కలిసి విస్తృత స్థాయిలో ఈ స్పోర్ట్స్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడా విధానం2025 తెలంగాణ




క్రీడా రంగానికి ఒక నూతన వరవడిని సాధించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడా రంగానికి క్రీడాకారులకు మంచి భవిష్యత్తును అంద జేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి, మట్టిలో మాణిక్యాల ను గుర్తించి వారిని ప్రపంచ ఛాంపియన్లుగా ఇది ఈ క్రీడా విధానం ఎంతో దోహదం చేస్తుందని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, నూతన క్రీడా విధానంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ- బాధ్యతలు మరింత విస్తరించ బోతున్నాయని వివిధ శాఖల సమన్వయంతో విస్తృతంగా క్రీడా కార్యక్రమాలను నిర్వహించడానికి, క్రీడాకారుల ను ప్రోత్సహించడానికి బహుముఖంగా తెలంగాణ స్పోర్ట్స్ తాటి సేవలు అందజేయడానికి ఈ విధానం ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గారి కృషి వల్ల తెలంగాణ క్రీడారంగ ముఖచిత్రమే మారిపోతుందని ఆయన వివరించారు. ఒక ఏడాదికాలంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరపున ఎన్నో జాతీయ అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు నిర్వహించామని, రానున్న రోజుల్లో ఈ కృషిని మరింత రెట్టింపు ఉత్సాహంతో కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ- చైర్మన్ రహమతుల్లా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక సమర్పణ

**(మొదటి పేజీ తరువాయి..)**

హరీష్ రావు, ఈటెల రాజేదర్ సహా నీటిపారుదల శాఖ అధికారులను విచారించింది. 115 మందిని విచారణ చేసి సాక్ష్యాలు నమోదు చేసింది. కమిషన్ నివేదికతో రాహుల్ బొజ్జా సచివాలయానికి బయల్దేరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు నివేదిక అందించనున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ 2023 ఆఖర్లో కుంగడం, పియర్స్ దెబ్బతినడంతో పాటు- అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. 2023 డిసెంబరులో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం... మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడం, మిగిలిన బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఏర్పడటంపై విజిలెన్స్ విచారణతోపాటు- నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ-(ఎన్డీఎస్ఏ)తో అధ్యయనం చేయించింది. లోపాలు తీవ్రంగా ఉన్నట్లు- విజిలెన్స్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అసెంబ్లీలో చర్చ సందర్భంగా న్యాయ విచారణకు ఆదేశిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతోపాటు- వెంటనే కమిషన్ ఏర్పాటు-కు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, భారతదేశ మొదటి లోక్‌పాల్‌గా 2019 నుంచి 2022 వరకు పనిచేసిన జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో కమిషన్‌ను ఏర్పాటు- చేసింది. జులై ఆఖరులోగా నివేదిక ఇవ్వాలని పేర్కొంది. అయితే కమిషన్ ఏర్పాటు- ఉత్తర్వులు జస్టిస్ ఘోష్‌కు ఏప్రిల్‌లో అందగా, మే నెల నుంచి కార్యకలాపాలు ప్రారంభించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించడంతోపాటు- ఎక్కువ మందిని విచారించాల్సి రావడం, క్రాస్ ఎగ్జామినేషన్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికల పరిశీలన.. ఇలా పలు కారణాలతో కమిషన్ గడువును ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. ఇవాళ జస్టిస్ పీసీ ఘోష్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

# ముగిసిన అమెరికా కాన్సూల్ జనరల్ పదవీకాలం

**- జెన్నిఫర్ లార్సన్‌కు శ్రీధర్ బాబు ఆత్మీయ వీడ్కోలు**

**హైదరాబాద్,జూలై31( వెలుతురు):**

హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్‌గా తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న జెన్నిఫర్ లార్సన్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే చేనేత చీరను ఆమెకు బహుకరించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ - అమెరికా మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు ఆమె విశేష కృషి చేశారని కొనియాడారు. విద్య, సాంస్కృతిక మార్పిడి, వాణిజ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరించారన్నారు. ఆమె అందించిన సహకారం,దార్శనికతకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే రోజుల్లోనూ తెలంగాణ -అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అయ్యేలా సహకారం అందించాలని కోరారు. ఆమె తదుపరి ప్రయాణంలోనూ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాక్షించారు.

# సరోగసి పేరుతో సృష్టిలో మోసాలు

**- రిమాండ్ రిపోర్టులో వెల్లడించిన పోలీసులు**

**హైదరాబాద్,జూలై31( వెలుతురు):**

సృష్టి యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్ ముసుగులో దారుణాలు సాగించిన డాక్టర్ నమ్రత కేసులో అనేక అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఐవిఎఫ్ కోసం వచ్చిన వారిని సరోగసీ వైపు దారిమళ్లించి లక్షలు దండుకున్నట్లు గుర్తించారు. నమ్రతను 5 రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన కీలక అంశాలను పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. సరోగసీ చేయకపోయినా చేసినట్లు నమ్మించి పలువురు దంపతులను మోసం చేశారని.. ఈ విషయాన్ని డాక్టర్ నమ్రత అంగీకరించారని పేర్కొన్నారు. రాజస్థాన్ దంపతులనూ సరోగసీ విషయంలోనూ నమ్రత మోసం చేశారు. వాళ్లు డీఎన్ఏ పరీక్షల నివేదికలు కావాలని అడగడంతో.. విషయం బయట పడుతుందని తప్పించుకున్నారు. కొన్ని రోజుల సమయం ఇస్తే తప్పును సరిదిద్దుతామని వారికి చెప్పారు. వినకపోవడంతో తన కుమారుడితో రాజస్థాన్ దంపతుల్ని బెదిరించారు. సరోగసీ పేరుతో 'సృష్టి'సెంటర్ చాలా మోసాలు చేసింది. ఐవీఎఫ్ కోసం వచ్చే వారిని సరోగసీ వైపు మళ్లించి డబ్బులు దోచుకున్నారు. ఏపీలో కొంతమంది ఏఎన్ఎంల సహాయం కూడా తీసుకున్నారు. గాంధీ ఆస్పత్రి అనస్థీషియన్ డాక్టర్ సదానందం వీరికి పూర్తిస్థాయిలో సహకరించారని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

# సంపాదకీయం..

## ప్రధాన సమస్యలపైనా చర్చలు ఏవీ ?

పార్లమెంటులో ఎంపిలకు ప్రజల సమస్యలు పట్టడంలేదు. ఆపరేషన్ సింధూర్‌పై ఎట్టకేలకు చర్చ సాగింది. దీనిపైనా ఈకలు పీకాలని చూశారు. దేశ సార్వభౌమత్వానికి, దేశ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయాల్లో కూడా విపక్షాలు ఐక్యత ప్రదర్శించలేక పోయారు. అన్నింటికి మించి సిందూర్ పేరు పెట్టడంపై జయాబచ్చన్ అభ్యంతరం తెలపడం ఆమె అజ్ఞానానికి నిదర్శనంగా చూడాలి. పేరు ఏది పెట్టాలి.... ఉగ్రవాదులను ఎప్పుడు చంపాలి... ఉగ్రవాదులు పాక్‌కు చెందిన వారేనా...కాశ్మీర్‌లోకి వారెలా వచ్చారు... ఎందుకు యుద్ధం ఆపారు.. వంటి సమస్యలు తప్ప ఉగ్రమూకలను ఉసిగొల్పిన పాక్‌ను పీచమణిచామా లేదా అన్నది ఎవ్వరూ మాట్లాడలేదు. ఏం మాట్లాడితే రాజకీయంగా లబ్ధి కలుగుతుందో అదే మాట్లాడాలని విపక్ష సభ్యులు నిర్ణయించారు. వారు కాలం గడిపితే చాలని అధికార బిజెపి పక్షం కూడా ఆశిస్తోంది. అసలు సమస్యలు ప్రస్తావించడం బిజెపికి కూడా ఇష్టం లేదు. బీహార్ ఓట్ల సవరణ కూడా ఇలాంటిదే. దీనిపై రచ్చ చేయడం ద్వారా లబ్ధిపొందాలన్న లక్ష్యం తప్ప ప్రజలపై వీరికి ప్రేమ లేదు. ప్రజలు ఏమైతే మాకేంటన్న ధోరణితో మన ఎంపిలు పార్లమెంటును ఉపయోగించుకుంటున్నారు. ధర్మస్థలిలో ఆక్రందనలు వినిపించడం లేదు. అక్కడ అధికారంలో కాంగ్రెస్ న్యాయబద్ధమైన తక్షణ విచారణకు పూనుకోలేదు. కేవలం సిట్ వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుంది. దీనిని అత్యవసర కేసుగా గుర్తించి, అక్కడ నిజంగానే అమ్మాయిలన మానప్రాణాలు పోయాయా అని తర్కించడం లేదు. మహిళా ఎంపిలకు కూడా ధర్మస్థలి గురించి చర్చించాలన్న ఆలోచన రాకపోవడం దుర్మార్గం.

సిందూర్ పేరెందుకు పెట్టారన్న జయాబచ్చన్ కనీసం ధర్మస్థలి ఘోరాలపై దృష్టి పెట్టివుంటే ఆమెను అభినందించేవారు. ఇకపోతే పార్లమెంటులో ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క సమస్య చర్చకు రావడం లేదు. ప్రజలు ఉద్యోగాలు లేక, ఉపాధి లేక నానా అవస్థలు పడుతున్నారు. దీనిని ఎలా అధిగమిద్దామనే విషయంలో చర్చ లేదు. ఒక్కొక్క ఎంపి లక్షల్లో జీత భత్యాలు తీసుకుంటున్నారు. వారికి ప్రజల ఈతిబాధలు పట్టడం లేదు. ఎందుకంటే.. ఇటీవలి కాలంలో సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పలు ప్రముఖ కంపెనీలు రాత్రికిరాత్రే ఉద్యోగులను తొలగించేస్తున్నాయి. వీరంతా రోడ్డున పడుతున్నారు. కేవలం ఖర్చులు తగ్గించుకునే క్రమంలో ఇలా చేస్తున్నారు. వీరి ఉద్యోగాలు పోవడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఉద్యోగభద్రత లేకుండా చేస్తున్న కంనెనీలపై చర్యలు లేవు. కోటి ఆశలతో ఐటి రంగాన్ని ఎంచుకున్న యువతరంలో కలవరాన్ని సృష్టిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అంటే భవిష్యత్తుకు ఎటువంటి ఢోకా లేదన్న ఒకప్పటి పరిస్థితి ఇప్పుడు మారిపోతోంది. ఏ రోజు ఉద్యోగం ఉంటుందో, ఏ రోజు ఊడుతుందో తెలియని దుస్థితి నెలకొంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్),ఇన్ఫోసిస్ లాంటి సంస్థలు ఎడాపెడా



ఉద్యోగులను తొలగించేస్తున్నాయి. టిసిఎస్ తన ఉద్యోగుల్లో రెండు శాతం మందిని తొలగిస్తున్నట్లు- కొద్దిరోజుల క్రితం ప్రకటన చేసింది. టిసిఎస్ ఒక్కటే 12 వేల మందిని ఇంటికి పంపనుందని సమాచారం. పిడుగుపాటు లాంటి ఈ ప్రకటనతో టిసిఎస్ ఉద్యోగుల్లో కలకలం రేగింది. ఒక్క టిసిఎస్సే కాదు, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్, విప్రోల వంటి సంస్థలదీ ఇదే బాట. ఉద్యోగులను తొలగించడంలో ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ఇలా ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో మిడ్‌లెవల్, సీనియర్ మేనేజర్లే అత్యధికులు. మన దేశంలో కొంతకాలంగా టెక్‌రంగం ఒత్తిడిలో కొనసాగుతోంది. సంస్థలు నష్టాల్లో లేనప్పటికీ, గతంతో పోలిస్తే లాభాలు ఆశించినట్లు లేవని చెబుతున్నారు. ఫలితంగా ఐటి సేవల్లో మందగమనం చోటుచేసుకుందన్న అభిప్రాయం వ్యక్తమవు తోంది.

గ్లోబల్ క్లయింట్లకు తక్కువ ఖర్చుతో సేవలందించడమన్నది భారత టెకీ రంగం ప్రధాన వ్యూహంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే.సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా 40 అంతకన్నా ఎక్కువ వయసున్న వారు ఉద్యోగాలను కోల్పోతే తిరిగి సంపాదించుకోవడం చాలా కష్టంగా మారుతోంది. చేస్తున్న ఉద్యోగాలపై ఉన్న నమ్మకంతో చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న దుస్థితి అక్కడక్కడా కనపడుతోంది. ఈ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని సంస్థలు ఉద్యోగులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచుతున్నాయి. అనధికారికంగా పనిగంటలు పెంచడం, పని ఇవ్వకుండా బెంచ్‌పై ఉంచి బెదిరింపులకు పాల్పడటం వంటి సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో తీవ్ర అభద్రతా భావం సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో చోటుచేసుకుంటోంది. మరోవైపు ఈ రంగంలో తగ్గుతున్న ఉద్యోగాల ప్రభావం హైదరాబాద్, బెంగళూరు వంటి చోట్ల అనుబంధ రంగాలపై కూడా పడుతున్నట్లు- పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! కంపెనీల లాభనష్టాల లెక్కలు ఎలా ఉన్నప్పటికీ కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. విధి నిర్వహణకు అవసరమైన నైపుణ్యాల పెంపు బాధ్యతను సంస్థలే స్వీకరించాలి. ఆ సాకుతో ఉద్యోగాలను తొలగించడం మానుకోవాలి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా తమ బతుకులలో పెరుగుతున్న సంక్షోభంపై ఉద్యమించాల్సి ఉంది. దేశీయ సంస్థలే కాదు, గ్లోబల్ టెక్ కంపెనీగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మైక్రోసాఫ్ట్ కూడా భారీ సంఖ్యలో ఉద్యోగులపై వేటు వేస్తోంది. ఈ ఏడాదిలోనే ఆ సంస్థ 15వేల మంది ఉద్యోగులను ఇళ్లకు పంపింది. మే నెలలో ఆరువేల మందిని, జులైలో 9వేల మందిని ఆ సంస్థ తొలగించినట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. మైక్రోసాఫ్ట్ మొత్తం ఉద్యోగుల్లో ఇది నాలుగు శాతం! క్లౌడ్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ ఉద్యోగులను ఆ సంస్థ తొలగిస్తోంది. వాల్‌స్ట్రీట్ జర్నల్ అధ్యయనం ప్రకారం ఈ ఏడాది జూన్ నాటికి ప్రపంచవ్యాప్తంగా 61వేల మందికిపైగా టెక్ రంగంలో ఉద్యోగాలు కోల్పోయారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ తదితర అంతర్జాతీయ సంస్థల ఉద్యోగులు ఈ జాబితాలో ఉన్నారు. 2019 తరువాత నుండి ఎంట్రీ లెవల్ ఉద్యోగుల నియామకం దాదాపు సగానికి పైగా తగ్గిపోయింది. రానున్న రోజుల్లోనూ ఈ పరిణామం కొనసాగనుంది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ప్రభావం రోజురోజుకి పెరుగుతుండటంతో సాధారణ కోడింగ్, టెస్టింగ్ వంటి ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. 'ఎఐ ఫస్ట్' సంస్కరణల్లో భాగంగా ఈ పరిణామాలు చోటుచేసుకుం టున్నాయంటూ సత్య నాదెళ్ల చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గమనార్హం. భారీ లాభాలు వస్తున్నప్పటికి ఉద్యోగులపై వేటు- వేయడాన్ని మైక్రోసాఫ్ట్ కొనసాగిస్తోంది. దీనికి ఎప్పటికప్పుడు ఏదో ఒక కారణాలను చెబుతూ తప్పించుకుంటున్నాయి. వీటిపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడం కూడా కారణంగా చూడాలి. ఈ సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావించాల్సి ఉంది. ప్రభుత్వం కూడా సమాధానం ఇవ్వాల్సి ఉంది.

# గ్రామాన్ని మరిచిన గవర్నెన్స్ -పల్లె సమస్యల పట్ల అధికారుల చలనం ఎక్కడ?

ప్రజాపాలన అనేది ప్రజల పట్ల సేవా ధర్మాన్ని కలిగిన వ్యవస్థ. ప్రజలు ఎన్నికల ద్వారా ప్రతినిధులను ఎన్నుకుంటారు. పాలనను అమలు చేసే ప్రభుత్వ వ్యవస్థలో ఉన్న అధికారులు ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని తీర్చడమే వారి ప్రధాన బాధ్యత. కానీ నేడు పెద్ద సంఖ్యలో అధికారులు ప్రజల దగ్గరకు వెళ్లే పరిస్థితి లేదు. ప్రజల సమస్యలను వినడం, వాటిని పరిష్కరించడం లాంటి పనుల్లో వారు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందనే అంశంపై లోతుగా ఆలోచించాలి. ఇప్పటి పాలనలో అధికార వ్యవస్థ మరింత ఒత్తిళ్ల మధ్య పనిచేస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రజల క్షేమం కోసం పని చేయాల్సిన పాలనా యంత్రాంగం, కొంతమేర రాజకీయాలకి బానిసగా మారిపోతోంది. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో, ప్రజల సంక్షేమం కంటే ఓట్లే ప్రధానంగా మారుతున్నాయి. పాలక రాజకీయ నాయకులు తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా, అనేక వాగ్దానాలు చేస్తూ, అధికారులను ఒత్తిళ్లకు గురి చేస్తుంటారు. ఫలితంగా పాలనాత్మక పరంగా తీసుకోవాల్సిన కీలక నిర్ణయాలు వాయిదా పడతాయి, లేదా పూర్తిగా నిర్లక్ష్యం చేయబడతాయి. ఈ పరిస్థితిలో అధికారులు ఇద్దరింటి మధ్య ఇరుక్కుపోతున్నారు. ఒకవైపు రాజకీయ నాయకుల నుంచి వచ్చే ఒత్తిళ్లు, మరోవైపు ప్రజల ఆశలు. నిజంగా ఒక అధికారి బాధ్యత అయిన ప్రజల సమస్యల్ని న్యాయంగా పరిష్కరించడం అనే లక్ష్యం వీణవుతోంది. రాజకీయ బాస్‌కి నచ్చే విధంగా వ్యవహరించకపోతే, తన స్థానం ప్రమాదంలో పడుతుందన్న భయం అధికారులను సంకోచానికి గురిచేస్తోంది. కొంతమంది అధికారులు ఈ ఒత్తిళ్లను జయించి నిజాయితీగా పనిచేస్తే, మరికొంతమంది తమ పదవుల్ని సురక్షితంగా కాపాడుకునేందుకు రాజీ పడుతున్నారు.ఇక కొంతమంది అధికారులు స్వార్థపరంగా వ్యవహరిస్తూ, ప్రజల అవసరాలను విస్మరిస్తున్నారు. స్థానిక ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకునే బదులు, ఏసీ గదుల్లో కూర్చొని కేవలం ఫైళ్లే తిప్పుతూ ఉంటారు. దీనివల్ల ప్రజలతో ఉన్న సంబంధం తొలగిపోతోంది. అధికార విధులను నిర్వర్తించే సమయంలో ప్రామాణికత, సమర్థత కంటే "ఎవరు సిఫార్సు చేస్తారు?" అనే కోణం అధిక ప్రాధాన్యం పొందుతోంది.అంతేకాదు, రాజకీయంగా మద్దతున్న అధికారుల వ్యవహారశైలి మరింత దౌర్భాగ్యకరంగా ఉంది. మద్యం మాఫియాలు, రియల్టీ లాబీలు, మైనింగ్ మాఫియాలకు అనుకూలంగా పనిచేస్తూ, ప్రజల జీవన ప్రమాణాలను పాతాళానికి నెట్టేస్తున్నారు. తమ పదవుల్ని డబ్బు సంపాదన యంత్రాలుగా మార్చేసి, రాజ్యాంగం చెప్పే సేవా తత్వాన్ని పక్కన పెడుతున్నారు. అధికార పరమైన తీర్పులు, పనుల వేగం, అందుబాటువంతుల మీద ఆధారపడి ఉంటే, సామాన్యులకు న్యాయం ఎక్కడ దొరుకుతుంది? ఈ తప్పుడు ధోరణుల వల్ల ప్రజలలో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం తగ్గుతోంది. ఉద్యోగుల అనైతిక వ్యవహారాలపై ప్రజలు ప్రశ్నించడం ప్రారంభించారు. సోషల్ మీడియా వంటి వేదికల ద్వారా ఈ వ్యవస్థల అవినీతి బహిరంగమవుతోంది. అయినప్పటికీ, అధికారులపై తీవ్ర చర్యలు తీసుకోవడంలో పాలకవర్గాలు అనేక సందర్భాల్లో వెనుకడుగేస్తున్నాయి. ఎందుకంటే వారి స్వార్థాలు కూడా ఇందులో భాగమే.ప్రస్తుతం అవసరం: ఒక సమర్థవంతమైన, నైతిక విలువలతో కూడిన పాలన. పాలకులు రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే పరిమితమవకూడదు. అధికారులు కూడా తమ బాధ్యతను గుర్తించి, ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజాస్వామ్యంలో అధికారుల కర్తవ్యము, సామాన్యుని నమ్మకాన్ని నిలబెట్టడం. ఈ సూత్రాన్ని మరచిపోతే, ప్రజల ఆక్రోశం ఒక్కరోజు లేవనెత్తుతుంది. అలాంటి దశ రాకముందే ఈ వ్యవస్థలో ఉన్న తొందరలు, స్వార్థాలను తొలగించాల్సిన అవసరం ఉంది.పరిష్కారం కార్యాలయాల్లో ఉండదని, ప్రజల సమస్యల పరిష్కారం వారికి దగ్గరగా ఉండే సమయంలోనే సాధ్యమవుతుందని పాలకులకు, అధికారులకు తెలుసు. కానీ తెలిసిన మాటను పునరుక్తి చేయడమే తప్ప, ఆ జ్ఞానాన్ని కార్యరూపంలోకి తేవడం మాత్రం జరగడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే, అత్యవసరమైన పర్యటనలు, వార్డు స్థాయిలోని ప్రజలతో ప్రత్యక్ష సంభాషణలు, బస్తీ ప్రజల బాధలు నేరుగా వినే ప్రయత్నాలు చాలా తక్కువగా జరుగుతున్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు పడిగాపులు వేస్తున్నా, పాలక యంత్రాంగం మాత్రం AC గదుల్లో నివేదికల చదువుతోనే పరిమితమవుతోంది.ఒకప్పుడు "గ్రామదర్శనం" కార్యక్రమాలు అధికారుల బాధ్యతగా పరిగణించబడేవి. కానీ ఇప్పుడు అవి ఒక యాంత్రిక కార్యక్రమాల్లా మారిపోయాయి. పాఠశాల కార్యక్రమాల్లా ముందు నుంచే సిద్ధంచేసిన స్క్రిప్ట్ ప్రకారం పదివేలు చెప్పడం, ఆల్రెడీ శుభ్రం చేసిన వీధుల్లోనడకలు వేయడం, స్థానిక నాయకుల చేత హారతులు పుచ్చుకుని తిరిగి వచ్చేయడం – ఇదే "పాదయాత్ర" అనిపిస్తుంది. ఈ ప్రదర్శనల వెనక ప్రజల వాస్తవ జీవితం ఎక్కడ ఉంది? ఎవరు విన్నారు వారి సమస్యలు? ఎవరు చూశారు తాగునీటి సమస్యను, వీధుల్లో గుంతల బీభత్సాన్ని? వాస్తవంగా ఓ అధికారిణి లేదా అధికారుడు ప్రజల మధ్యకి వెళ్లినప్పుడు, వాళ్ల ముఖాలు చూసినప్పుడు, వాళ్ల కళ్లలోని నిస్సహాయతను అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. సమస్యల పుట్టుక ఎలా ఉందో తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఒక పెనుబూచిన రిపోర్టు కన్నా, ఒక పేద మహిళ చెప్పే చిన్న మాటే ఎక్కువ విషయాలు చెప్పగలదు. కానీ ఇప్పుడు ఆ అవకాశాన్ని అధికారులు గణనీయంగా దూరం చేసుకుంటున్నారు. "ఫీల్డ్ వర్క్" అనే మాట కేవలం ఫార్మల్ రికార్డులకి పరిమితమైపోయింది. నిజానికి, ఇది ఓ ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణి. ఇంతకీ ఎందుకు జరుగుతోంది ఈ మార్పు? దీనికి మూడు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిది – అధికార వ్యవస్థలోని బాధ్యతా శూన్యత. ఎవరు ఎక్కడికి వెళ్లలేకపోయినా, ఎవరూ ప్రశ్నించరు. రెండవది – డిజిటల్ పాలన అనే పేరుతో "ప్రజల వద్దకే వెళ్లే అవసరం లేదన్న" మాయ. మూడవది – ప్రభుత్వాల నిగ్రహ రాహిత్యం. పాలకులు కూడా అధికారులను ప్రోత్సహించకుండా, బలహీనమైన వ్యవస్థను కొనసాగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల సమస్యలు ఎవరు పరిష్కరిస్తారు? బస్తీలో విషపూరిత మట్టి తాగుతున్న చిన్నారుల జీవితాలు ఎవరు గమనిస్తారు? పేదలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు, రేషన్ సమస్యలు, స్థానిక నాయకుల వేధింపులు – ఇవన్నీ ఏ రిపోర్టులో వస్తాయి? పదే పదే చెప్పినట్లుగా, పరిష్కారం కార్యాలయంలో కాదు. అది ప్రజల వద్దే ఉంటుంది. సమస్యను నేరుగా చూసే కన్నే పరిష్కార మార్గాన్ని కనిపెడుతుంది. కానీ కళ్లపై AC గదుల అద్దాలు పెట్టుకుంటే, ప్రజలు ఎప్పటికీ దూరంగానే మిగిలిపోతారు. డిజిటల్ పాలన వలన అధికారులు ప్రత్యక్షంగా ప్రజలను కలవాల్సిన అవసరం తగ్గిందన్న మానసిక భావన ఏర్పడింది. అప్లికేషన్లు, పోర్టళ్లు, హెల్ప్‌లైన్ నంబర్లు అన్నీ ఉన్నా... ప్రతి పౌరుడికి ఈ సౌకర్యాలను వినియోగించగల సామర్థ్యం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం వల్ల ప్రజలు ఫిర్యాదులు చేయలేక నిస్సహాయులవుతున్నారు.ప్రభుత్వ ఉద్యోగం అనేది ప్రజలకు నిత్యం సేవ చేయాలనే లక్ష్యంతో ఏర్పడిన వ్యవస్థ. ఈ ఉద్యోగాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు దేశ సర్వసాధారణ ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు నిబద్ధంగా ఉండాలి. కానీ ఈనాటి వాస్తవ పరిస్థితులు చూస్తే, కొన్ని చోట్ల అది పూర్తిగా భిన్నంగా మారుతోంది. కొంతమంది అధికారులు తమ పదవిని సేవకు ఉపయోగించుకోవడం కంటే, అధికారాన్ని ప్రదర్శించేందుకు, స్వార్థ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు.వారు చేసే పనికి గౌరవం ఇవ్వడం తప్పు కాదు. కానీ, ప్రజల సమస్యల పట్ల ఉదాసీనత, సేవా దృక్పథానికి దూరంగా ఉండటం, విధులకు సంబంధించిన నిర్లక్ష్యం మాత్రం సమాజానికి తీవ్రంగా నష్టం కలిగిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగం అంటే నెలాఖరున జీతం వచ్చే స్థిరమైన ఉద్యోగం అనే దృష్టికోణం పెరిగిపోతుంది. ఇది ఒక ప్రమాదకరమైన ధోరణి.ఇంటికి వచ్చిన విద్యుత్ బిల్లు తప్పుగా వచ్చినా, లేదా రేషన్ సరఫరాలో లోపం ఉన్నా, పంచాయతీ కార్యాలయం పని చేయకపోయినా – సాధారణ పౌరుడు ఎదుర్కొనే ప్రతీ సమస్య వెనక ఒక ప్రభుత్వ శాఖ ఉంటుంది. కానీ, అక్కడ ఉన్న ఉద్యోగి బాధ్యతగా స్పందించకపోతే ఆ సమస్య మరింత పెద్దదవుతుంది. అధికారుల మానసిక దృక్పథం మారకపోతే, ప్రజల విశ్వాసం ప్రభుత్వ యంత్రాంగంపై తగ్గిపోతుంది.అందుకే, ప్రభుత్వ ఉద్యోగులు తమ ఉద్యోగాన్ని జీతం కోసం మాత్రమే కాకుండా, సేవా బాధ్యతగా చూడాల్సిన అవసరం ఉంది. ప్రజల సమస్యలు, ఫిర్యాదులను ఉదారంగా స్వీకరించి, అవి పరిష్కారానికి కృషి చేయాలి. అధికార మర్యాదల కన్నా ప్రజల అవసరాలు, సమస్యలు ముఖ్యమైనవి. ఉద్యోగం కేవలం అధికారానికి గుర్తుగా కాకుండా, బాధ్యతకు, నిబద్ధతకు గుర్తుగా నిలవాలి.అధికారుల పనితీరుపై సమగ్ర పర్యవేక్షణ లేకపోవడం, వారి బాధ్యతారాహిత్యానికి ముఖ్య కారణంగా మారింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి నివేదించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, చాలా మంది అధికారులు ప్రజల వద్దకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రజల సమస్యలు పెండింగ్‌లో పడిపోయినా, వాటి పరిష్కారానికి కార్యాచరణ చేపట్టకపోయినా, వారిపై ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది. ఇది పాలనా వ్యవస్థలో గంభీర లోపంగా భావించాలి.ఈ నిర్లక్ష్యానికి కారణంగా ప్రజల నమ్మకం ప్రభుత్వంపై తగ్గిపోతోంది. అధికార యంత్రాంగం ప్రజలకు సేవ చేయాల్సిన ఓ సంకల్పంతో ముందుకు రావాల్సిన సమయంలో, తగిన పర్యవేక్షణ లేకపోవడం వల్ల వారి పనితీరులో నిస్తుత్వ చోటుచేసుకుంటోంది. పాలకులు నిర్ణయాలు తీసుకోవడంలో మినహాయింపులు చూపడం, విధులకు ఆటంకాలు కలిగించిన అధికారులపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శించడం వల్ల, మిగిలిన అధికారుల్లోనూ బాధ్యతారాహిత్యం పెరుగుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ముఖ్య ఆధారం. వారి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమై ఉండాలి. కానీ ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించాల్సిన అధికారులు, ప్రజల కష్టాలు అర్థం చేసుకోకుండా, కార్యాలయాల్లో కాలం తిప్పుతూ ఉండటం దురదృష్టకరం. ఇది ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. అధికారుల పనితీరుపై ఎలాంటి బాధ్యతా పద్ధతులు లేని పరిస్థితుల్లో, ప్రజలకు సేవ చేసే ప్రేరణ కూడా వారి లోపల మసకబారిపోతోంది.కావున, అధికారి స్థాయిలో నిర్లక్ష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం నిర్దిష్ట వ్యవస్థను తీసుకురావాలి. ప్రతి స్థాయి అధికారిపై కఠినమైన పనితీరు మానిటరింగ్ విధానం ఉండాలి. పని తీరు పట్ల నిర్లక్ష్యం చూపించిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా నిబంధనలు రూపొందించాలి. అప్పుడే ప్రజాసేవ అన్న గౌరవం తిరిగి ఏర్పడుతుంది. ప్రభుత్వాలు కొన్ని వేళ్ల ప్రజల కంటే తమ రాజకీయ లబ్ధికే అధిక ప్రాముఖ్యత ఇస్తున్నాయి. ఫలితంగా ప్రజల సమస్యలు పక్కకు తొలగిపోతున్నాయి. పాలక శ్రేణి నుంచి సరైన మార్గదర్శకాలు అందకపోవడంతో, అధికారులు తాము చేయాల్సిన బాధ్యతలపట్ల అలసత్వంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి అధికారి ప్రజల మధ్యకు వెళ్లే విధానాన్ని విధిగా పాటించాల్సిన అవసరం ఉంది. వార్డుల, గ్రామాల స్థాయిలో ప్రజలతో ప్రత్యక్ష సమావేశాలు నెలకు కనీసం ఒక్కసారైనా నిర్వహించాలి. ప్రజా ఫిర్యాదులపై ఆధారంగా వార్షిక రివ్యూలు చేసి, పనితీరును అంచనా వేయాలి. అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే వ్యవస్థను బలపడాలి.పాలనలో సామాజిక సమగ్రత కోసం అధికారులు సామాన్య ప్రజల జీవన పరిస్థితులను అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. ప్రజల దగ్గరకు వెళ్లకపోవడం వల్ల ప్రజా పాలనకు నమ్మకం తగ్గిపోతుంది. ఇది ప్రజాస్వామ్యానికి హానికరం. అందుకే అధికారులు తమ ధర్మాన్ని గుర్తుంచుకొని, ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను ప్రత్యక్షంగా చూసి పరిష్కరించాల్సిన బాధ్యతను స్వీకరించాలి. ప్రజలే పాలకులు అన్న భావనతో పని చేస్తే మాత్రమే నిజమైన ప్రజాపాలన సాధ్యమవుతుంది. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు, ఐఏఎస్ నుండి మండలాధికారుల వరకు ప్రజలను కలవడానికి నా మూసి ఎందుకు..? ప్రజాస్వామ్యంలో అధికారులంతా ప్రజల సేవకులే. ప్రభుత్వ పరిపాలన వ్యవస్థలో ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యతా రేఖ ప్రజల దిశగా సాగాలి. కానీ నేటి పరిస్థితుల్లో ౹ ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు, పై నుంచి పల్లె స్థాయిలో పనిచేసే మండలాధికారుల వరకు ౹ ప్రజలతో ప్రత్యక్షంగా కలవడానికి నిరాకరించే ధోరణి పెరిగిపోతోంది. ప్రజలను కలవాలంటే "నామూసి" అవుతుందా? ఇలా జరగడం వాస్తవంగా అన్యాయమే కాకుండా, రాజ్యాంగ పరమైన బాధ్యతలకు వ్యతిరేకం కూడా. వాళ్ల ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చినవారే అయినా, అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల నుండి దూరమవడం గమనించదగ్గ విషయం. ముఖ్యమంత్రి ప్రజల బాధలు స్వయంగా వినడం లేని స్థితి ఏర్పడితే, మంత్రులు 'ప్రోటోకాల్' పేరుతో దూరంగా ఉంటే, కింద స్థాయి అధికారులు 'టైమ్ లేదు', 'ఫైల్ పని ఎక్కువ' అనేఅనే విధంగా చెబితే, ప్రజలు తమ సమస్యలు ఎవరికి చెప్పాలి? ప్రజల మద్దతుతో అధికారం లోకి వచ్చిన నేతలు, ప్రజల హక్కులకే ద్రోహం చేస్తూ వారిని చూడడం నేనంటే ఓ నామూసిగా భావించడం బాధాకరం. ప్రజలను కలవడం ఒక అభిమానం కావాలి, బాధ్యతగా భావించాలి. అదే ప్రజాస్వామ్యానికి అసలైన గౌరవం.ఇలా చూడకపోతే ప్రజల సమస్యలు ఎవరి చెవిలో పడతాయి? నెరవేరని హామీలు, పరిష్కారంకాని సమస్యలు, అందని అధికారులు ౹ ఇవన్నీ కలిసే ప్రజలలో నమ్మకం కోల్పోయే పరిస్థితిని తేవచ్చు. ఇది ప్రభుత్వ వ్యవస్థ మీద ఉన్న నమ్మకాన్ని చెదరగొడుతుంది. ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా వినడంలో ఎటువంటి నామూసి లేదు, అది నాయకత్వ ధర్మం., ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ప్రజల మధ్య ఉండాలి. ప్రజల మధ్యకి రావడాన్ని "నామూసి" అనడం సిగ్గుగా మారాలి. ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజలదే ౹ వారిని కలవడమే నిజమైన సేవ.ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటూ, ప్రజలనే నిర్లక్ష్యం చేసే పాలకులు – ఒక ప్రజాస్వామ్యంలో ఇది ఎంత వరకు సమంజసం? ప్రజాస్వామ్యం అంటే ప్రజలే ప్రభువులైన పాలన. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించి అధికారంలోకి తీసుకొచ్చే ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అలాగే నియమిత ప్రభుత్వ ఉద్యోగులు(all these individuals receive their salaries from the taxes paid by the people.)ఈ వ్యక్తులందరూ ప్రజలు చెల్లించే పన్నుల నుండి జీతాలు పొందుతారు. అందువల్ల వారి ప్రాథమిక బాధ్యత ప్రజలకు సేవ చేయడమే. కానీ వాస్తవంగా చూస్తే, అధికారంలోకి వచ్చిన తరువాత వీరి వైఖరి పూర్తిగా మారిపోతుంది.ముఖ్యమంత్రి స్థాయిలోనే కొందరు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అధికారపు అహంకారంతో వ్యవహరించడం చూస్తున్నాం. ప్రజా సమస్యలపై స్పందించాల్సిన ఎమ్మెల్యేలు ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించి, తరువాత గల్లంతవుతున్నారు. ఎంపీలు పార్లమెంటులో ప్రజల గొంతుకగా వ్యవహరించాల్సిన బాధ్యతను మర్చిపోతున్నారు. ఇటు అధికారులు కూడా అదే ధోరణి. ప్రజల వినతులు, ఫిర్యాదులు లెక్కచేయకుండా, అధికారపు గద్దెలను భద్రంగా కాపాడుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కదలకుండా అలాగే నిర్లక్ష్యం చేయడం పరిపాటయింది, ఆమోదాలు ఆలస్యంగా ఇవ్వడం ఇవన్నీ సాధారణం అయిపోయాయి. పన్నులు చెల్లించే సామాన్యులు మాత్రం అవినీతి, నిర్లక్ష్యం వల్ల నలుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. పేదలకు సంక్షేమ పథకాలు అందకపోవడం, రైతులకు సబ్సిడీలు ఆలస్యంగా రావడం, ఉపాధి హామీ పనులు నత్తనడకన సాగడం ఇవన్నీ వ్యవస్థ వైఫల్యాన్ని చూపిస్తున్నాయి .ప్రజాస్వామ్యంలో, ప్రజలే ప్రభుత్వం. అందులో పనిచేసే నేతలు, అధికారులు ప్రజల సేవకులుగా ఉండాలి కానీ పాలకుల్లా కాకూడదు. ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటున్న వారు తిరిగి అదే ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే, అది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం.ప్రజల పన్నుతో నడిచే ప్రభుత్వంలో, ప్రతీ అధికారి, ప్రతీ నేత ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. ఆ బాధ్యతను తేలికగా తీసుకుంటే, అది ప్రజల పట్ల అవమానం. పాలనా వ్యవస్థ గ్రామాలను పూర్తిగా పట్టించుకోవడం తగ్గించింది. గ్రామీణ ప్రాంతాలు ఎన్నో మౌలిక వసతుల కోసం ఎదురు చూస్తున్నాయి. తాగునీరు, రహదారులు, ఆరోగ్య కేంద్రాలు, స్కూళ్లు, వ్యవసాయానికి అనుకూలమైన మద్దతు ధరలు వంటి ప్రాథమిక అవసరాలు ఇంకా చాలాచోట్ల అందుబాటులో లేవు. కానీ అధికారుల దృష్టి పట్టణ అభివృద్ధిపైనే కేంద్రీకృతమైంది. పల్లె సమస్యలను పరిష్కరించేందుకు పాలక వ్యవస్థలో స్పష్టమైన చలనం కనిపించడం లేదు.గ్రామ సర్వేలు, సమస్యలపై నివేదికలు, పల్లె పర్యటనలు కేవలం ప్రదర్శనకే పరిమితమవుతున్నాయి. నిధులు మంజూరైనా వాటి వినియోగంపై పర్యవేక్షణ సరిగా లేకపోవడం, పనుల ప్రామాణికత తగ్గిపోవడం చూస్తున్నాం. ఎంపీడీవోలు, గ్రామ అధికారులు గ్రామస్థాయిలో సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడంలో విఫలమవుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు కావడం లేదు. ఒక్కోసారి స్థానిక ప్రజాప్రతినిధులే తమ స్వార్థపూరిత రాజకీయాల కోసం గ్రామ అభివృద్ధిని పక్కన పెడుతున్నారు. పల్లె సమస్యలు దశాబ్దాలుగా ఎలానే కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితులు మారాలంటే గ్రామాల పట్ల ప్రభుత్వ బాధ్యత పెరగాలి. పాలనా యంత్రాంగం పల్లె సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉంది. గ్రామాభివృద్ధే దేశాభివృద్ధికి మెట్టు అనే నిజాన్ని పాలకులు గుర్తించాలి.



మన్నారం నాగరాజు

## మంచాల జూనియర్ కళాశాలను సందర్శించిన తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



**మంచాల జులై 31వెలుతురు:**
మంచాల మండలం కేంద్రానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి గ ముందుగా మంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సందర్శించిన మంచాల ప్రైమరీ పాఠశాలను అలాగే మంచాల జూనియర్, కళాశాలను సందర్శించడం జరిగింది ఈసందర్భంగా ఈసందర్భంగా విద్య కమిషన్ చైర్మన్ మురళి మాట్లాడుతూ నాలుగు సంస్థలను ఒకేగొడుగు కిందికి తీసుకొనివచ్చి తెలంగాణ ప్రభుత్వంచే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మంచాల తెలంగాణ పబ్లిక్ స్కూల్, అభివృద్ధి చేయుటకు టీఎస్పీఎస్సీ మంచాలమేనేజ్మెంట్అండ్,డెవలప్మెంట్ కమిటీ సమావేశమఅయ్యారు దశదిశను నిర్దేశించడం జరిగింది నాలుగు విద్యాసంస్థలలో అవసరమయ్యే తరగతిగదులు మౌలిక వసతులను పునరుద్ధరించడానికి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో విద్యా కమిషన్ సభ్యులు జోష్ణ, పద్మజ నోడల్ ఆఫీసర్ కిషన్ఆ ర్కిటెక్చర్ ఇంజనీర్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, తిరుపతయ్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డిఝాన్సీ, రుబియానా మరియు విద్యాకమిటీ సభ్యులు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆరుట్ల గ్రామంలో అంగరంగ వైభవంగా పోచమ్మతల్లి బోనాల ఉత్సవాలు

**- పోచమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఆరుట్ల మాజీసర్పంచ్ సుంకరి పాండరి నాథ్ గౌడ్**





**మంచాల వెలుతురు జులై 31:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో పోచమ్మ తల్లి ఉర బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఘనంగా జరిగాయి ముందుగా పోచమ్మతల్లి దేవాలయంలో గుడి నిర్మాణ దాత వేదిరె పాండురంగారెడ్డి కుటుంబ సభ్యులుఆరుట్ల మాజీసర్పంచ్ సుంకరి పాండరినాథ్ గౌడ్ కుటుంబసభ్యులు గ్రామ పెద్దలు మాజీ ప్రజాప్రతినిధులు పోచమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు ఈకార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు కావలి బుగ్గ రాములు ముదిరాజ్ దసరా మోని మరయ్య ముదిరాజ్ నుకం సత్తయ్య ముదిరాజ్ దాసరమోని రమేష్ ముదిరాజ్ తలారి కృష్ణ బుట్టి జంగయ్య ముదిరాజ్ బుట్టి కృష్ణ కావాలి నరసింహ నూకం కృష్ణ గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు

## ఢిల్లీ లో జరగనున్న నిరసనలకు సంపూర్ణ మద్దతు

**- బిసి రిజర్వేషన్ల సాధనకు వేలాదిగా పాల్గొన్ని విజయవంతం చేస్తాం**

**- ఉద్యోగ, ఉపాధ్యాయ విద్యార్థి విద్యావంతుల ఐక్యవేదిక**



**హైదరాబాద్ వెలుతురు జూలై 31:**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషికి తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఉద్యోగ ఉపాధ్యాయ విద్యార్థి విద్యావంతుల జేఏసీ పేర్కొంది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ నేతలు దేవరకొండ సైదులు, కిరణ్ కుమార్, సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు న్యాయం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. రిజర్వేషన్ల సాధనకు చివరి అడుగులు వేస్తున్న వేళ తామంతా ప్రభుత్వానికి అండగా ఉండాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఢిల్లీలో ఈనెల 5 6 7 తేదీలలో జరగనున్న వివిధ నిరసన కార్యక్రమాల్లో తాము సైతం పాల్గొంటున్నట్లు చెప్పారు. బీసీల స్థితిగతులను అధ్యయనం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ఇక్కడి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తూ ఉండడం హర్షనీయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్ ను తక్షణమే నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్న రాములు, కోల జనార్ధన్, డాక్టర్ శివ ముదిరాజ్, మహేష్ గౌడ్, ప్రశాంత్, యాద నాగేశ్వరరావు లతోపాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ఓబిసి విద్యార్థులకు అన్యాయం చేస్తుంది

**- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు జూలై 31:**
న్యూఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్యూషన్ ఫీజుల కింద కేంద్ర ప్రభుత్వం ఓబిసి విద్యార్థులకు రూ.55,000,ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వారికి (అగ్రకులాల వారికి) మాత్రం ఉచితంగా విద్యను అందిస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ వారికి ఉచితంగా ఇస్తే ఇచ్చారు గాని ఓబీసీ విద్యార్థులు ఏం పాపం చేశారని ట్యూషన్ ఫీజులను రూ.55,000గా ఎందుకు నిర్ధారించారు.ఇప్పటికే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం ఓబీసీ లను దగా చేసిందని ఎస్సీ,ఎస్టీ,బీసీలకు ఉచితంగా విద్యను అందించాల్సింది పోయి ఫీజులను కట్టాలనడం బడుగు బలహీన వర్గాలను విద్యకు దూరం చేయడమేనని అన్నారు. ఓబీసీల కూడా ఎలాంటి ఫీజు లేకుండా ఉచిత విద్యను అందించాలని లింగంగౌడ్ డిమాండ్ చేశారు.

# ఆరుట్ల వెంకటేశ్వరకాలనిలో నిర్మించిన బస్టాండ్ పార్కింగ్ స్థలంగా మారింది

### వేంకటేశ్వర కాలనికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి కాలని వాసులు ఆగ్రహం






**మంచాల వెలుతురు ప్రతినిధి జులై 31:**
ఆరుట్ల గ్రామంలోని వేంకటేశ్వరనగర్ కాలని ఎన్టిఆర్ నగర్, కాలనికి బస్, సౌకర్యం ఉండాలని ఆలోచనతో గత ప్రజాప్రతి నిధులు ప్రధానమంత్రి సించార్ యోజన వాటర్,షెడ్ అబివృద్ధి కార్యక్రమం ద్వారా బస్టాండ్,మరియు కాలనివాసుల వివిధ అవసరాల కోసం షెడ్ నిర్మాణం పూర్తిచేసి గత ప్రజాప్రతినిధులు బస్టాండ్ ప్రారంభోత్సవంచేసి ఇరవై నెలలు గడుస్తున్న ఆర్టీసీబస్సులు మాత్రం రావటంలేదు ఎన్నోసార్లు కాలనివాసులు అందరూ కలిసి ఆరుట్ల గ్రామానికి రాకపోకలు చేసే ప్రతి బస్సు మావెకటేశ్వర కాలనికి ఎన్ టి ఆర్, కాలని రావాలని ఇబ్రహీంపట్నం బస్ డిపోమేనేజరుకు విన్నవించుకూన్నారు అయినలాభం లేదు ప్రజా ప్రతినిధులు నాయకుల దృష్టికి తీసుకుపోయిన నాయకులు పట్టించుకోలేదు అన్నారుబస్టాండ్, నిర్మాణం చేసే టప్పుడు వేంకటేశ్వర నగర్ కాలని ఎన్ ఆర్ కాలనికి బస్సు లు రాకపోకలు జరిగేలా అధికారులతో డిపో మేనేజర్ తో మాట్లాడతాంఅని గొప్ప మాటలు చెప్పిన నాయకులు ఇప్పుడు కాలని వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు అన్నారు వేంకటేశ్వరకాలనిల నుండి కాలనివాసులు ఎంతో మంది వివిధ పనులు చేసుకోవటానికిహైదారాబాద్ నగరానికి బస్సులో వెళ్ళుతూ ఉంటారు ఆరుట్ల బస్టాండ్, దగ్గరకు వెళ్లాలి అంటే కిలో మీటరు దూరం నడవాలి అలాగే విద్యార్థులుకూడా ఇబ్రహీంపట్నం వివిధ ప్రాంతాలకు వెళ్లుతారు మంచాల మండలం ఆరుట్ల గ్రామం చాలా పెద్ద గ్రామం వేంకటేశ్వర కాలని ఎన్ టి ఆర్ కాలని ప్రక్కనే మోడల్ స్కూల్ జిల్లా పరిషత్ స్కూల్ అలాగే నూతనంగా తెలంగాణ రాష్ట్రంలోనేముందుగా ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల నిర్మాణం జరుగుతుంది ఆరుట్ల గ్రామంలో చదువు కోవటానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పలుగ్రామాల నుండి విద్యార్థులు వస్తూ ఉంటారు పుస్తకాల బ్యాగులబరువుతో విద్యార్థులు నడుచుకుంటు చాలా దూరం నడవాలి విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఆరుట్ల గ్రామానికి వచ్చే ప్రతిబస్సు వేంకటేశ్వర కాలని నుండి రాకపోకలు జరుగుతే అందరికి ప్రయాణం సులభంగా ఉంటుంది వెంటనే స్థానిక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి



స్పందించి వేంకటేశ్వరనగర్ కాలని మీదుగా ఆరుట్ల గ్రామానికి వచ్చే ప్రతిబస్ రాకపోకలు జరిగేలా ఇబ్రహీంపట్నం డిపోమేనేజర్ కు చెప్పిమాకాలనికి బస్ లు రాకపోకలు జరిగేలా చూడాలని కోరుతున్నాం

# కె లక్ష్మణ్ పదవీ విరమణకు ఘన సన్మానం

### తెలంగాణ నాన్ గెజెటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్‌లో ఘన కార్యక్రమం





**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 31:**
ఉమ్మడి రంగారెడ్డి (మేడ్చల్ - రంగారెడ్డి - వికారాబాద్) జిల్లా నాన్ గెజెటెడ్ ఉద్యోగుల సంఘానికి నాలుగు దశాబ్దాలుగా విశిష్ట సేవలందించిన కె. లక్ష్మణ్ 43 సంవత్సరాలు 6 నెలల పాటు ప్రభుత్వ విధుల్లో అత్యంత నిబద్ధతతో, సమర్పణతో పని చేసి నేడు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా తెలంగాణ నాన్ గెజెటెడ్ ఆఫీసర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా భవన్‌లో ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, అనేక జిల్లా యూనిట్ ప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం భావోద్వేగాలతో నిండినది. పదవీ విరమణ అనేది ఒక ఉద్యోగ జీవితం ముగింపు మాత్రమే కాక, ఒక బాధ్యతాయుతమైన ప్రయాణానికి గౌరవప్రదమైన నిలుపు కావడం విశేషం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామ్ మోహన్ మాట్లాడుతూ, కె.లక్ష్మణ్ తన ఉద్యోగ జీవితాన్ని ప్రభుత్వ సేవలకే అంకితం చేశారు. ఆయన పనిచేసిన శాఖల్లో మార్గదర్శకుడిగా, సమన్వయకర్తగా, నాయకుడిగా ఎంతో సమర్థంగా పనిచేశారు. సహచర ఉద్యోగులకు ప్రోత్సాహం ఇచ్చిన విధానం, సమస్యలను పరిష్కరించే శైలి ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచేలా ఉంది. ప్రభుత్వ సేవలను విశ్వాసంతో ముందుకు తీసుకెళ్లిన ఆయన వంటి అధికారిని కలగడం శాఖకు అదృష్టం. ఆయన పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను అంటూ హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు బి. రవి ప్రకాష్ మాట్లాడుతూ కె. లక్ష్మణ్ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖలో ఎన్నో మార్గదర్శకమైన సేవలందించారు. తెలంగాణ నాన్ గెజెటెడ్ ఆఫీసర్స్ యూనియన్ పునాదులు బలపడేలా ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది. ఆయన నిబద్ధత, శ్రమ, త్యాగం ప్రతి ఉద్యోగికి స్ఫూర్తిగా నిలుస్తుంది. ఆయనకు శాలువా, గజమాలతో ఘనంగా సన్మానం చేయడం మాకు గౌరవంగా భావిస్తున్నాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ (సెంట్రల్ ఈసీ సభ్యుడు, టీఎన్జీఓ) శశికాంత్ రెడ్డి (సెంట్రల్ ఈసీ సభ్యుడు, టీఎన్జీఓ) విజయ్ కుమార్ (కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా) శివ కుమార్ (అధ్యక్షుడు, వికారాబాద్ జిల్లా) రవి చంద్రన్ (ఉపాధ్యక్షుడు, మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా) భరత్ కుమార్ (కార్యదర్శి, మేడ్చల్–మల్కాజ్గిరి) శేష సాయి గిరికాంత్ (కోశాధికారి, మేడ్చల్–మల్కాజ్గిరి) కార్తీక్ (కోశాధికారి, కలెక్టరేట్ యూనిట్) నసీమా (అధ్యక్షురాలు, కలెక్టరేట్ యూనిట్) సత్య జ్యోతి (అధ్యక్షురాలు, కుత్బుల్లాపూర్ యూనిట్) అరుణ (కార్యదర్శి, మల్కాజ్గిరి యూనిట్) శ్రీనివాస్ (అధ్యక్షుడు, మేడ్చల్ యూనిట్) అంజనన్న (మేడ్చల్ యూనిట్) సంజయ్ సింగ్, జేమ్స్ దాస్, ప్రభాకర్ పాల్గొన్నారు




# నీరాకేఫ్ ని రీ టెండర్ వేయాలి

### మేకపోతుల వెంకటరమణ కేజీకేఏస్ రాష్ట్ర అధ్యక్షులు





**హైదరాబాద్ వెలుతురు జూలై 31:**
టాడి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉన్న నీరా కేఫ్ కు మే 21 వ తేదీన టెండర్ కు ప్రకటన ఇవ్వగా 2 టెండర్లు వేశారు. సాంకేతిక బిడ్ లో వివరాలు వేయకుండా ఆర్థిక బిడ్ లోనే వేయడంతో మే 28 వ తేదీన కార్య నిర్వాహక కమిటీ రిజెక్ట్ చేసింది. అందుకని వారికి డీడీలు వాపస్ ఇచ్చి రీ టెండర్ కు ప్రకటన ఇవ్వాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతుంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన నీరా కేఫ్ టూరిజం శాఖ పరిధిలో ఉంది. కల్లుగీత కార్మికులకు కేటాయించిన బడ్జెట్ తో నిర్మించిన నీరా కేఫ్ ను టాడి కార్పొరేషన్ కు అప్పగించాలని కల్లుగీత కార్మిక సంఘంతో పాటు పలు సంఘాలు ఆందోళన చేపట్టాయి. బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ గారి చొరవతో టాడి కార్పొరేషన్ కు అప్పగించారు. ఈ కేఫ్ లో 6 కమర్షియల్ షాపులు, ఒక బాంకెట్ హాల్ ,నీరా స్టాల్ మరియు ప్రాసెసింగ్ యూనిట్ ఉన్నాయి. వీటిని టెండర్ వేయడం ద్వారా టాడి కార్పొరేషన్ కు సంవత్సరానికి సుమారు కోటి రూపాయలకు పైగా ఆదాయం వస్తుంది. వీటిని గీత కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయవచ్చు. అందుకని ప్రభుత్వం వెంటనే టెండర్ కు ప్రకటన ఇవ్వాల్సిందిగా కోరుతున్నాం.

## ఆదిభట్ల సీఐగా రవికుమార్ బాధ్యతలు స్వీకరణ



**వెలుతురు, తుక్కుగూడ జులై 31 :**
ఆదిభట్ల పోలీస్ స్టేషన్ నూత న సీఐగా రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. చర్లపల్లి సీఐగా పనిచేసిన ఆయన ఆదిభట్ల కు బదిలీపై వచ్చారు. ఇప్పటి వర కు ఇక్కడ సీఐగా పని చేసిన ఎస్. రాఘవేందర్ రెడ్డి పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు. నూతన సీఐగా బాధ్యతలు చేప ట్టిన రవికుమార్ కు పోలీస్ స్టేషన్ సిబ్బంది, పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. వివిధ పార్టీల నాయకులు ఆయనను కలిసి సత్క రించి శుభాకాంక్షలు తెలిపారు.

## బీసీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ని కలిసిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు



**హైదరాబాద్ వెలుతురు జూలై 31:**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను కామారెడ్డి డిక్లరేషన్లు పొందుపరిచిన బీసీల అంశాల గురించి గురువారం రోజున ప్రజాభవన్లో డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క గారిని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ గారి ఆధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులు కలిసినట్లు రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్ తెలిపారు. పెండింగ్లో ఉన్న బీసీ విద్యార్థుల స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని మహాత్మ జ్యోతిబాపూలే ఓవర్సీస్ స్కాలర్షిప్స్ 5 వేల మందికి ఇవ్వాలని., ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో కోర్సు పూర్తి అయిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు ఒరిజినల్ ధృవపత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాయన్నారు డిప్యూటీ సీఎం గెలిచిన వారిలో బీసీ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి మహిళా సంఘం అధ్యక్షురాలు మని మంజరి తదితరులు ఉన్నారు

## ఆదర్శ బస్తీలో ఎలక్ట్రిసిటీ పోలు ఏర్పాటు చేసిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూలై 31:**
గురువారం రోజున హిమాయత్ నగర్ డివిజన్లోని స్ట్రీట్ నెంబర్ 14 లో ఉన్న ఆదర్శ బస్తీలో ఒక ఎలక్ట్రిసిటీ పోలు ఒంగి ఉండడంతో స్థానికులు హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ గారి దృష్టికి తేవడంతో వారు వెంటనే ఇంద్ర పార్క్ గోపాలకృష్ణ సంప్రదించి కొత్త పోలు ఏర్పాటుకి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు దీన్ని సంబంధించి గురువారం రోజున ఆదర్శ బస్తీకి విచ్చేసి అక్కడ పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేష్ అజర్ శ్రీహరి మరియు బస్తీ వాసులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## గుండ్రెడ్డిపల్లిలో సి.ఎం.ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం




**గుండ్రెడ్డిపల్లి, తూప్రాన్, వెలుతురు జులై, 31:**
మెదక్ జిల్లా తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో సి.ఎం.ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరంలో అనేక మంది ప్రజలు పాల్గొని తమ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన వైద్య సలహాలు పొందారు. ప్రత్యేకించి అనేక విభాగాలలో నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందించారు. గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని ఎంతో ఆదరణతో స్వీకరించారు. ఈ వైద్య శిబిరం గ్రామ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంలో, మరియు ప్రాథమిక వైద్యం అందించడంలో కండ్లకోయ లోని సి.ఎం.అర్ హాస్పిటల్ వైద్యులు ముఖ్యపాత్ర పోషించారు. ఈ వైద్య శిబిరం లో సి.ఎం.అర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సాయిశ్రీ, డాక్టర్ శివ, మార్కెటింగ్ మేనేజర్ దుర్గ ప్రసాద్ రెడ్డి, మార్కెటింగ్ కో ఆర్డినేటర్ రాజ్ నారాయణ, అప్తాల్ అసిస్టెంట్ అనూష , గుండ్రెడ్డిపల్లి గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్ ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన సతీష్



**తూప్రాన్ వెలుతురు న్యూస్ జూలై-31 :-**
మెదక్ జిల్లా తూప్రాన్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సతీష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఈసందర్భంగా నూతనంగా పూర్తి స్థాయిలో బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో ను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అలాగే కార్యదర్శులు సన్మానించారు.

## శివోహం..నెల్లికుదురు భక్తజన సందోహం.

- భక్తి శ్రద్ధలతో శివాలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన..
- హాజరైన ఎమ్మెల్యే..పాకశాలకు 3 లక్షల వితరణ.





**నెల్లికుదురు వెలుతురు జులై 31:**
మానుకోట జిల్లా నెల్లికుదురు మండల కేంద్రం హర హర మహాదేవ,శంభో శంకర, ఓం నమశివాయ శివనామ స్మరణ ల ప్రతిధ్వనులతో గురువారం మారు మ్రోగింది.చారిత్రక శ్రీరామ లింగేశ్వర స్వామి దేవస్థానం పునరుద్ధరణలో భాగంగా వెలుకూచి సోమశేఖర శర్మ, నాగయ్య శాస్త్రి ల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్టాపన యంత్ర ప్రతిష్ట,నవగ్రహ,సుబ్రహ్మణ్య స్వామి,వాసవి మాత ప్రతిష్ఠ,దేవాలయ సంప్రోక్షణ ప్రత్యేక పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. దీనికి ఎమ్మెల్యే డా.భూక్య మురళి నాయక్ తో పాటు, నెల్లికుదురు పట్టణ ప్రముఖులు,భక్త జన సందోహం తరలివచ్చింది.ఎమ్మెల్యే మురళి నాయక్ రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలలో భక్తి భావం పెరిగి ప్రశాంత జీవనానికి దేవాలయాలు కారణమన్నారు.ఆలయ పునరుద్ధరణ చేపట్టడం అభినందనీయమన్నారు. పాకశాల నిర్మాణానికి తాను రూ.3,00000 లక్షలు ఇస్తానని ప్రకటించారు.కార్య క్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ, భక్తుల తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల అంతంపేట విద్యార్థులకు టై మరియు బెల్టు షూలు ఇప్పించిన కంచుకట్ల సంపత్ ను ఘనంగా సన్మానించిన ఉపాధ్యాయులు.

**గట్టుప్పల్ వెలుతురు జూలై 31:**
నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండలం అంతంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న విద్యార్థులు ఆర్థికంగా వెనుకబడిన వారు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. మునుగోడు నియోజకవర్గం శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని





ఆదర్శంగా తీసుకొని నావంతు కృషిగా ప్రభుత్వ పాఠశాలకు ఏవిధంగా సహాయం చేయగలను విషయాలను ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు తెలపడంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంతంపేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. జయప్రద మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంచుకట్ల సంపత్ గారి దృష్టికి తేవడం జరిగింది. మా పాఠశాలలో విద్యార్థులకు టై ,బెల్టు మరియు షూ లకు సపోర్ట్ చేయమని అడిగినారు. అడిగిన వెంటనే స్పందించిన కంచుకట్ల సంపత్ ఈరోజు పాఠశాలకు వెళ్లి 30000 వేల రూపాయలను నగదు ప్రధానోపాధ్యాయుల చేతికి అందజేశారు. విద్యార్థులు గ్రామస్తులు ఉపాధ్యాయులు కంచుకట్ల సంపత్ ను అనేక విధి విధాలుగా కొనియాడారు. మీరు అందించిన ఈ సహాయం పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంచుకట్ల సంపత్ ను ఘనంగా సన్మానించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. జయప్రద ఈ కార్యక్రమంలో గట్టుప్పల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నామం జగన్నాథం విద్యార్థులు గ్రామస్తులు అంతంపేట గ్రామశాఖ అధ్యక్షులు ఐలయ్య మాజీ సర్పంచ్ శేఖర్ చందా వెంకటేశం మోతిలాల్ చెరుకు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ డిసీజ్ పై జిల్లా వైద్యాధికారి ఆరా..



**నెల్లికుదురు వెలుతురు జులై 31:**
మానుకోట జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గురువారం మెడికల్ ఆఫీసర్ శారద అధ్యక్షతన జరిగిన ఎఎన్ఎం ల సెక్టార్ మీటింగ్ కు జిల్లా ఆరోగ్య వైద్యాధికారి రవి రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని డి ఎం హెచ్ ఓ సూచించారు. అవసరమగు మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు డెంగ్యూ,మలేరియా తదితర డిసీజ్ పై రవి రాథోడ్ ఆరా తీశారు.కార్యక్రమంలో సిహెచ్ఓ శాంతమ్మ, సూపర్వైజర్ వసంతకుమారి,షహీన్ సుల్తాన,ఏఎన్ఎం లు పాల్గొన్నారు.

## ఇనుగుర్తిలో రేషన్ కార్డు పత్రాల పంపిణీ..

- రేషన్ కార్డులు పేదల ఆత్మగౌరవం..కాంగ్రెస్.



**ఇనుగుర్తి వెలుతురు జూలై 31:**
మానుకోట జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గంజి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రేషన్ కార్డు పత్రాలు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షులు కూరెల్లి సతీష్, జిల్లా మండల నాయకులతో కలిసి లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రేషన్ కార్డులు కేవలం ఆహార భద్రత కోసమే కాదని,పేదవారి ఆత్మగౌరవం అన్నారు. గత దశాబ్ద కాలంగా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకపోవడంతో పేదలు అవస్థలు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త కార్డులతో పాటు,సన్న బియ్యం పంపిణీ చేస్తోందని ఇది గొప్ప వరమన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బైరు అశోక్ గౌడ్, గుజ్జునూరి బాబురావు,చిన్నాల కట్టయ్య,రామ్ రెడ్డి,తిరుపతి రెడ్డి,రేషన్ డీలర్లు సురేష్,భారతమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ స్పాట్ అడ్మిషన్స్ నేటి వరకు..



**ఇనుగుర్తి వెలుతురు జూలై 31:**
మానుకోట జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం లో ఇంటర్ ఫస్టియర్ కోసం స్పాట్ అడ్మిషన్స్ నేటి(శుక్రవారం)వరకు కొనసాగిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.సిఇసి గ్రూపులో 06 సీట్లు హెచ్ ఇ సి లో 22 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి కలిగిన వారు ఈ నెల 01న ఉదయం 9 గం.కు ఎస్ఎస్సి మెమో,ఆదాయం,కులం,డేట్ అఫ్ బర్త్ తదితర ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటు ఒక సెట్ జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## భారత నగర్ లో షాహేజాద్ మెడికల్ ప్రారంభోత్సవం





**జహీరాబాద్ వెలుతురు జూలై 31:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని భారత్ నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన షాహేజాద్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులగా జహీరాబాద్ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివలింగం, టౌన్ ఎస్ఐ వినయ్ కుమార్, జాహీరాబాద్ రురల్ ఎస్ ఐ కాశినాథ్, చిరాగ్ పల్లి ఎస్ఐ కె. రాజేందర్ రెడ్డి లు హాజరై రిబ్బన్ కట్ చేసి మెడికల్ స్టోర్ ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ శివలింగం మాట్లాడుతూ భారత్ నగర్ ప్రజలకు అందుబాటులో ఉండేలా పెట్టడం వలన కాలని వాసుల తరుపున పోర్పొరేటర్ కీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటూ అభినందించారు. స్థానిక ప్రజలు పెద్దఎత్తున హాజరై ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు. అద్భుతమైన సేవలతో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందిస్తామని ఈ సందర్భంగా యజమాని షాహేజాద్ తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా స్థానికులకు కొంతమేరకు ఉచిత మందులను కూడా మెడికల్ యజమానులు అందించారు. సీపీఐ కార్యదర్శి రామచంద్ర. ఈ కార్యక్రమంలో అబ్జల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగరీత్యా ప్రతి ఒక్కరికి పదవి విరమణ సహజం

### ఉపాధ్యాయురాలు శ్రీ సూక్తి సేవలను కొనయాడిన సహచరులు, మండల విద్యాధికారి జాకీర్ హుసేన్





**జహీరాబాద్ వెలుతురు జూలై 31:**
ఉద్యోగరీత్యా ప్రతి ఒక్కరికి పదవి విరమణ సహజమని, విధినిర్వహణలో తాము చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని, అంకితభావం, క్రమశిక్షణతో సేవలు అందించిన వారు చరిత్రలో నిలిచిపోతారని కోహిర్ మండల విద్యాధికారి జాకీర్ హుసేన్ అన్నారు. గురువారం నాడు జిల్లా పరిషత్ బాలికల ఎంపీపీఎస్ పాఠశాల, మాచిరెడ్డిపల్లి ఉపాధ్యాయురాలు శ్రీ సూక్తి ఉద్యోగ విరమణ అభినందన సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మండల విద్యాధికారి మొహమ్మద్ జాకీర్ హుసేన్ హాజరయ్యారు. పదవి విరమణ పొందుతున్న ఉపాధ్యాయురాలు శ్రీ సూక్తి, ప్రొఫెసర్ డాక్టర్ చంద్రమోహన్, జేఎన్టీయూ) దంపతులకు సహచర ఉపాధ్యాయ బృందం గజమాల, శాలువకప్పి స్వీయ చిత్రపటంతో సత్కరించారు. 2002 నాటి నుంచి విద్యారంగానికి చేసిన ఎనలేని సేవలు, వారి అంకితభావం, మంచితనం, సేవాగుణం, నిరాండాంబ రమైన జీవితం గురించి అతిథులు ప్రసంగించి భావోద్వేగానికి లోనయ్యారు. మండల విద్యాధికారి జాకిర్ హుస్సేన్ మాట్లాడుతూ శ్రీ సూక్తి సేవలను కొనియాడి వారు అందరికీ ఆదర్శం అని తెలిపారు. భవిష్యత్తులో వారు ఆయు ఆరోగ్యాలతో ఉండి కుటుంబ సభ్యులతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గురుజువడా కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఏ ప్రభు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుభాష్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కి వచ్చిన విద్య చంద్రబాబు నాయుడు ని తిట్టడం

### రాపోలు నరసింహ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు



**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 31**
తెలుగుదేశం పార్టీ మీద విష ప్రచారం చేయడం. సెంటిమెంటు రగిలించడం. అధికారంలోకి రావడం..తన కుటుంబం దోచుకోవడం. తెలంగాణను అప్పులపాలు చేయడం..మరల బనకచర్లపై తెలుగుదేశం పార్టీపై విష ప్రచారం తగదు.ధర్మారెడ్డి పిల్లి కాలువ పిల్లాయిపల్లి కాలువల విషయంలో ప్రత్యేక చొరవ చూపించి కాలువల పనులు చేయిస్తున్న నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంకి కృతజ్ఞతలు. పిల్లాయిపల్లి కాలువ నుండి ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేస్తే దాని ద్వారా సిరిపురం బోగారం నిదానపల్లి గ్రామాల్లో ఉన్న కుంటలు చెరువులు నిండి వందల ఎకరాలు సాగయ్యే అవకాశం ఉన్నది పరిశీలించాలి.పెద్ద కాపర్తి నుండి సిరిపురం వరకు వెలిమినేడు నుండి సిరిపురం మీదుగా తుమ్మల గూడెం వరకు బి.టి రోడ్లు మంజూరు చేయించాలి. రాపోలు నరసింహా తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కెసిఆర్ కి వచ్చిన విద్య చంద్రబాబు నాయుడు ని తిట్టాలి. తెలుగుదేశం పార్టీ మీద దుమ్మెత్తి పోయాలి.తెలంగాణలో తెలుగుదేశం పార్టీ మీద విష ప్రచారం చేయాలి.దానిద్వారా సెంటిమెంటుతో అధికారం లోకి రావాలి. తన కుటుంబం మటుకు బాగుపడాలి. తెలంగాణను అప్పుల పాలు చేయాలి.ఇదే కేసిఆర్,కేటీఆర్,హరీష్ రావుల పని,అధికారం పోయిన తర్వాత మరల బనకచర్ల విషయంలో సెంటిమెంటు రగిలించి లబ్ధి పొందాలని చూస్తున్న కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుల విష ప్రచారం విషయంలో తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారని, తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు రాపోలు నరసింహా అన్నారు. పది సంవత్సరాలు మీకు అవకాశం ఇస్తే పచ్చటి తెలంగాణని అప్పుల పాలు చేసి,కోలుకోని విధంగా నాశనం చేసి,మీ కుటుంబం మాత్రం తరతరాలకు సరిపడా ఆస్తులు సంపాదించుకున్నారని,ఈ విషయం ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడుకి మీకు అసలు పోలికే లేదని అన్నారు.చంద్రబాబు నాయుడు ముందు చూపుతో భావితరాలకు భవిష్యత్తు ఇచ్చే నేత తమరు మీ కుటుంబ భావితరాలకు ఆస్తులు కూడా పెట్టే నేతవు, బనకచర్ల విషయంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చుని మాట్లాడుకుంటున్నారని.వృధాగా సముద్రంలోకి పోయే నీటి విషయంలో కేంద్ర ప్రభుత్వం వద్ద చర్చలు నడుస్తున్నాయని.ఇరు ప్రభుత్వాల నిర్ణయాలు రాకముందే మీ బాగోతం ఏమిటని అన్నారు. తెలంగాణ ప్రజలు ఇక నీ మాయ మాటలు నమ్మరని తెలుగుదేశం పార్టీ మీద మీ విష ప్రచారం మానుకోవాలని అన్నారు.ధర్మారెడ్డి పల్లి కాలువ పిల్లాయిపల్లి కాలువ విషయంలో నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ప్రత్యేకమైన చొరవ చూపి కాల్వ పనులు వేగంగా చేయిస్తున్నందుకు వారికి మా కృతజ్ఞతలు అన్నారు. అదేవిధంగా పిల్లాయిపల్లి కాలువ నుండి కేవలం 3 లేదా 4 ఎకరాల భూసేకరణ చేసి ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేస్తే సిరిపురం బోగారం నిదానపల్లి గ్రామాల్లోని కుంటలు చెరువులు నిండి వందల ఎకరాలు సాగులోకి వస్తాయని, ఈ గ్రామాల రైతులకు మేలు జరుగుతున్నదని ఇట్టి విషయాన్ని మీరు పరిశీలన చేయాలని అన్నారు. అదేవిధంగా ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నటువంటి పెద్ద కాపర్తి నుండి సిరిపురం మరియు వెలిమినేడు నుండి వయా సిరిపురం మీదుగా తుమ్మలగూడెం వరకు బి.టి రోడ్లు వేయించాలని.గతంలో ఎన్నిసార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న ప్రభుత్వాలు మారాయి. కానీ రోడ్లు మాత్రం మంజూరు కాలేదని ఇట్టి విషయంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఈ రోడ్లు మంజూరు,చేయించాలని,అలాగే గుండ్రంపల్లి నుండి వెల్లంకి వరకు మంజూరు అయిన రోడ్డు పనులు మొదలు కావడం లేదు.ఇట్టి విషయములో కూడా ఎమ్మెల్యే చొరవ చూపి అతి త్వరగా రోడ్డు పనులు మొదలుపెట్టించాలని అన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో రామన్నపేట తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మీర్జా ఫజల్ బేగ్, తెలుగుదేశం పార్టీ టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు నకిరేకంటి గణేష్, తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులు పున్న వెంకటేశం, చేనేత జిల్లా నాయకులు గోశిక చక్రపాణి, మండల ఉపాధ్యక్షులు బత్తుల సత్యం, మండల నాయకులు పోచబోయిన మల్లేశం, సిరిపురం గ్రామపంచాయతీ వార్డు మాజీ సభ్యులు సాయిని శేఖర్, గాదె జానీ, నాయకులు కట్ట మహేందర్ తదితరులు పాల్గొన్నారు. నమస్సులతో,మీర్జా ఫజల్ బేగ్ రామన్నపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు.

# పచ్చిగడ్డి వేయకూడదు కానీ.. ఇక్కడ పచ్చిగడ్డి చుట్టూ మంటలు.!

1. వీళ్లు ఇద్దరూ బీఆర్ఎస్‌లోనే కానీ బల్లెం మాత్రం ఇద్దరికి వేరు.!
2. పార్టీకి ఓటు వేయాలా.? లేక వర్గాలకు చప్పట్లు కొట్టాలా.?
3. ఒక్క పార్టీ, రెండు ధృక్పథాలు భూపాలపల్లిలో మంటలు.!
4. ఉద్యమకారుడికి ఉసురు లేకుండా చేసిన వలస నేతల రాక.!
5. ఆద్యంగా వచ్చినవాడు... చివర్లో నిలవలేడు.?
6. భూపాలపల్లిలో నాయకత్వం కోసం నోరు మూసిన యుద్ధం.!
7. అడవిలో ఒక పులి చాలు.. కానీ పార్టీలో ఇద్దరూ పులులైతే.?
8. పచ్చి గడ్డి వేస్తే కాదు, పక్కన ఉండగానే మంటలు.!
9. మాటల మధ్య మౌనం చప్పట్లు వేస్తోంది.!
10. భవిష్యత్తు గురించి కాదు, బలా బలాల గురించి సాగుతున్న పోరు.!
11. పార్టీకీ బానిసలెవరు కావాలి.? పాలకులా.? పాలనాపై పోరాటమా.? ప్రామాణికతపైన.?
12. ముందుగా రోడ్డు వేసినవాళ్లను తొక్కేస్తే, గమ్యం ఎవరిది.?
13. విభేదాలు కనిపించకపోవచ్చు.. కానీ కార్యకర్తల్లో కలహాలు వినిపిస్తున్నాయి.!
14. ముందు వచ్చిన నేత పక్కకు, మధ్యలో వచ్చిన నేత ముస్తాబవుతుంటే, ఉద్యమం ఎవరిది.?
15. హైకమాండ్ గట్టి నిర్ణయం తీసుకోకపోతే, పాత కథలాగే కొంప ముంచుతుంది.!
16. వంతెనపై ఇద్దరు రాజులు. తలదించుకుని చూస్తున్న ప్రజలు.!
17. ఒక సీన్: ఒక చిన్న వంతెనపై రెండు పెద్ద పెద్ద రాజులతో పోలిక ఉన్న నేతలు, ఒకవైపు సిరికొండ మధుసూదన చారి రాజు వేషంలో
18. మరోవైపు గండ్ర వెంకట రమణారెడ్డి మెరిసే ఆకట్టులో, కొత్త ఆకృతి అయిన రాజవేషంతో, చేతిలో టికెట్, మొబైల్, హైకమాండ్ ఫోన్ తీసుకుని నిలబడి ఉన్నట్టు.
19. కింద ప్రజలు ఒకటే పార్టీని చూస్తూ గందరగోళంగా:
20. ఈ నాయకులు.. ఎవరి కోసమో.? ఎవరు గెలుస్తారో తెలీదు గానీ, జనం మాత్రం ముట్టడి మధ్యే. రాజకీయ పరిశోధనా పాత్రికేయులు పర్కాల సమ్మయ్య గౌడ్.



**భూపాలపల్లి వెలుతురు జూలై 31:**
పార్టీ ఒకటే పయనం ఇద్దరికీ తక్కుబాటు కాదు.!ఒక్క వంతెనపై ఇద్దరు రాజులు. భూపాలపల్లి బీఆర్ఎస్ లోపలి రాజకీయ నాటకం.!భూపాలపల్లి రాజకీయంగా మళ్లీ వేడెక్కుతోంది. కానీ నిప్పులు పొలిటికల్ కాంప్లైంట్ నుంచి కాకుండా. ఒక్క గద్ద మీద ఇద్దరు నాయకుల మధ్య నుంచి వస్తున్నాయి.
ఒకవైపు ఉద్యమశీలి, పార్టీకి ప్రాణంగా నిలిచిన సిరికొండ మధుసూదన చారి. ఆయన పోరాటాల వల్లే పార్టీకి భూమి దొరికింది. కానీ ఇప్పుడు ఆయనకు నేల కనిపించడం లేదు.
మరోవైపు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి. ఒకప్పుడు కాంగ్రెస్ గద్ద మీద, ఇప్పుడు బీఆర్ఎస్ తోటలోనే పూవయ్యారు. ఆయన హైకమాండ్‌తో టచ్‌లో...ఈ ఇద్దరూ ఒకే పార్టీకి చెందినవాళ్లు. కానీ వారి మధ్య సంబంధం చూస్తే ఒప్పందం కాదు, ఒడిదుడుకులు కనిపిస్తున్నాయి.ప్రజలు మాత్రం ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఎవరు ఎవరిలో పెరుగుతున్నారు.? నాయకత్వం ఎవరి చేతిలో సేఫ్.? చివరికి టికెట్ పోటీ వలేనా.? అని అనుమానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఇవన్నీ కలిపి చూస్తే ఒక విషయం మాత్రం స్పష్టంగా తెలుస్తోంది.పార్టీ నాయకత్వం స్పందించకపోతే ఇది ఎన్నికల్లో స్వీయమరణ గుడిసె.! అవుతుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.
సిరికొండ మధుసూదన చారి ఉద్యమ చరిత్ర గర్వకారణం. పార్టీ తలపెట్టే ముందు నుంచి పనిచేసినవాడు. కానీ ఇప్పుడు ఛాన్స్ కోసం చూస్తూ పార్టీ గోడల మధ్య నలుగుతున్నాడు.!
గండ్ర వెంకట రమణారెడ్డి వలస రాజకీయానికి ప్రతిరూపం. కాంగ్రెస్ వేదికన గెలిచి ఇప్పుడు బీఆర్ఎస్‌లో నాయకత్వం చూపిస్తామంటూ తిరుగుతున్న నేత.
వీరిద్దరూ ఒకే కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొంటున్నారు కానీ వేర్వేరు బలబలాలు చాటుతున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీని మళ్లీ ఢీకొనే ఛాన్సులు స్వల్పంగా కనిపిస్తున్నాయి. పార్టీ కార్యకర్తలు అసమాధానంగా ఉన్నారు. హైకమాండ్‌కి స్పష్టత అవసరం. లేకపోతే ఈ వర్గ పోరు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తలనొప్పిగా మారే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.
ఒక్క వంతెనపై ఇద్దరు రాజులు ఉండలేరు.! ప్రజలు అయోమయంగా గతంలో చూశారు మళ్లీ కూడా అదే దారి మళ్లింపు ధోరణినిలు కనిపిస్తున్నాయి,

### ఒక డ్రామా మూడో అంకంగా అనిపించొచ్చు.!?

భూపాలపల్లి బీఆర్ఎస్ రాజకీయాలు చూసిన వారికి ఇవి పార్టీ అంతర్గత వ్యవహారాలు అనిపించకపోవచ్చు%?% ఒక డ్రామా మూడో అంకంగా అనిపించొచ్చు.
ఇక్కడ ఇద్దరు నేతలు ఇద్దరి లక్ష్యం ఒకటే నియోజకవర్గాన్ని తన సొంతంగా మలచుకోవడం.కానీ ప్రయాణం మాత్రం వ్యత్యాసంగా సాగుతోంది.

### ఒక్కో డైలాగ్, ఒక్కో పంచ్.!

ఒకవైపు ఉద్యమ గద్ద మీద పుట్టిన, పార్టీకి జీవం పోసిన సిరికొండ మధుసూదన చారి, ఆంధ్రాలో తలదాచుకున్నవాళ్లు తెలంగాణకి స్వాములెందుకు.? అంటూ వాణ్ణి పదునుగా చేసుకున్నారు. మరోవైపు కాంగ్రెస్ వేదికపైనే సారథ్యం చేపట్టి, ఇప్పుడు బీఆర్ఎస్‌లో "నవవిలాసాల"తో వెలుగులు నింపుతున్న గండ్ర వెంకట రమణారెడ్డి
"నాయకత్వమంటే డిక్లరేషన్ కాదు, ఫాలోయింగ్ కావాలి అంటూ తన దూకుడును చూపిస్తున్నారు.

### పార్టీలోకి రావటమే పాపమా.? లేక ఉద్యమంలో ఉండడమే శాపమా.?

ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ గద్ద, కానీ ఎవరికి ఇక్కడ అడ్డ ఇవ్వాలో అనే విషయంలోనే గొడవ.!మొదటి నుండి వెన్నుదన్నుగా పార్టీకి తోడుగా నిలిచిన మధుసూదనాచారి. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యలపై ఉద్యమ శైలిలో పనిచేయాలని భావిస్తే ఇప్పుడే కొత్తగా వచ్చిన గండ్ర తన అనుభవంతో, నియంత్రణతో, హైకమాండ్‌లో సంపర్కంతో ఆధిపత్యాన్ని కలుపుకోవాలని చూస్తున్నారు.ముందు వచ్చినవారు వెనక పడిపోతున్నాడా.? లేక కొత్తగా వచ్చినవారు అధికారం అటకెక్కించాలనుకుంటున్నారా.? ఈ ప్రశ్నలు ఆ పార్టీ కార్యకర్తల్లోనే కాకుండా, ప్రజల్లోనూ మార్మోగుతున్నాయ్.

### పార్టీ ఒకటే కానీ పరుసపు తన్నులు రెండు.!

ఏ వైపు చూసినా నేతలు మాత్రం మనం ఒక్కటే అనే నటన చేస్తున్నారా.!? అనే అనుమానాలకు తావిస్తోంది. కానీ వారి సోషల్ మీడియా పోస్టులు, కార్యాలయాల నుండి వచ్చే వార్తలు, కార్యకర్తల మధ్య చీలికలు చూస్తే బీఆర్ఎస్ భవిష్యత్తు కోసం కాదు, బీఆర్ఎస్ టికెట్ కోసం సాగుతున్న చరిత్రే ఇది.! అనే అనుమానాలు బలపడుతున్నాయి.

### హైకమాండ్‌కు చివరికి ప్రశ్న ఇదే:

ఒక్క నాయకుని వెనుక నిలవాలో.? లేదా ఉద్యమయోధుని పక్కన నిలవాలో.? కాదంటే ఇద్దరికీ నోచుకోలేక పార్టీనే భూపాలపల్లి నియోజకవర్గంలో క్షీణించే విధంగా చేస్తున్నారా.? ఇలా అయితే రానున్న రోజుల్లో భూపాలపల్లి నియోజకవర్గంలో వీరి పోరు వల్ల తిరిగి కాంగ్రెస్ పార్టీకి క్లీన్ షిట్ మరింత భారీ మెజారిటీతో ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఇక్కడ ప్రత్యక్షంగా పరోక్షంగా బీఆర్ఎస్ పార్టీ హై కమాండ్ భూపాలపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాలుగు పాదాలపై నిలబడే విధంగా చేస్తుంది అనడంలో సందేహం లేదు.

### పిట్టకోడి కూసే వేళ, తిట్టుకునే నేతల కథ అంతేనా.?

ఇది జనం చూసే నాటకం కాదు, జనాలు అనుభవించే పాలన కావాలి.
పార్టీ మేనిఫెస్టో కంటే నాయకుల వ్యక్తిగత హక్కుల గణాంకాల మీదే చర్చ సాగితే, అది పార్టీకి కాకుండా ప్రత్యర్థులకు వరంగా మారే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.భూపాలపల్లి అంటే ఉద్యమగడ్డ. ఉద్యమయోధుడిని ఉద్దేశించకుండా వలస నాయకుడి చుట్టూ బతుకు తిరగబెట్టాలంటే మట్టిలోంచే మంటలు చెలరేగతాయ్. ఇప్పుడు వేసే నిర్ణయం పార్టీకి దిక్సూచి అవుతుంది. లేక దారితప్పిన దీపం అవుతుంది.ఒక్క వంతెనపై ఇద్దరు రాజులు నిలవలేరు ఇదే భూపాలపల్లి తాత్విక రాజకీయం.

### భూపాలపల్లి నియోజకవర్గంలో సాగుతున్న తాజా రాజకీయ "వర్మధ్వని"

### పచ్చిగడ్డి వేయకూడదు. కానీ ఇక్కడ పచ్చిగడ్డి చుట్టూ మంటలు.!

భూపాలపల్లిలో బిఆర్ఎస్ అంతర్గత రాజకీయం మళ్లీ వేడెక్కుతోంది. రాజకీయాలలో పార్టీ మార్పులు, నేతల తారతమ్యం కొత్తేమీ కాదు. కానీ, ఒక్కోసారి ఒకే గద్ద మీద నాటిన రెండు మొక్కలు ఎదగలేక ఒకదానిపై మరొకటి నీడపెడితే.? అదే ఇప్పుడు భూపాలపల్లి రాజకీయ రంగస్థలంలో జరుగుతోంది. ఒకవైపు సిరికొండ మధుసూదన చారి టీఆర్ఎస్ సృష్టిలో ఒక శక్తిగా, విప్లవాత్మకంగా ముందుకు వచ్చిన వ్యక్తి. పార్టీలో మట్టికరిపించినవాడు, ఉద్యమ వేళ అగ్రగామి అయినవాడు.
మరోవైపు గండ్ర వెంకట రమణారెడ్డి
ఒకప్పుడు కాంగ్రెస్ వేదికపై, ఇప్పుడు టీఆర్ఎస్ తంబూరంతో రాజకీయ సంగీతాన్ని చక్కగా మార్చుకున్న మాజీ శాసనసభ్యుడు.ఇద్దరూ ఇప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్నా కలిసినట్టు కనిపించడం లేదు. వీరిద్దరూ భూపాలపల్లి గద్దమీద ఉన్నా గాని గడ్డి మాత్రం పచ్చిగా ఉండదు.! అదీ పాతవాడు, కొత్తవాడికీ తేడా వస్తే.? నాయకత్వం కోసం ఈ రెండు గొడ్డుగడ్డల మధ్య నిప్పులే మిగిలాయి.!

### స్వామ్యం కోసం శాంతియుత పోరాటమా.?

నిజం చెప్పాలి అంటే అసలు శాంతి ఎక్కడ.? ఎవరెవరికి విలువ ఇవ్వాలి.? బలమేమిటి.? కసివెంత అనేది బయటకే వస్తోంది.? మేధావులు, రాజకీయ అనుభవజ్ఞులు, సీనియర్ పాత్రికేయులు. సీనియర్ రాజకీయ నాయకులు, మధుసూదన్ చారి అంటారు. వీరి అభిప్రాయం ప్రకారం,
మొద్దుబడినవాళ్లకంటే ఉద్యమకారులే శ్రేష్ఠులు.! ఇది కరెక్టే కానీ, దారి మళ్ళీ దరిదాపుల్లోకి వస్తున్న తరుణంలో అడ్డుకట్ట వేయలేని సిరికొండ మధుసూదన చారి ఇప్పుడు అడ్డుకట్ట వేయాలని చూస్తే ఆయన తరం అవుతుందా.? గండ్ర వెంకట రమణారెడ్డి నిశ్శబ్దంగా ఉంటూ పార్టీ 'ట్రెండింగ్ లీడర్' అన్న ట్యాగ్‌తో ముందుకు సాగుతున్నట్టు చూపిస్తున్నారు. ఇద్దరి మధ్య మాటలు చెప్పుకునే దాకా కాదు. కానీ మౌనానికీ అర్థాలుంటాయి కదా.?
జనాన్ని కాదు జట్టు వీడుతోందనీ.
భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలు ఆందోళనలో ఉన్నారు. ఈ ఆందోళన మాకు ఎందుకు.? అంటూ కొందరు స్తబ్దంగా ఉంటున్నారు. మరి కొందరు సిరికొండ మధుసూదనాచారి వైపు ఉంటున్నారు. మరికొందరు గండ్ర వెంకటరమణారెడ్డి వైపు ఉంటున్నారు. ఎవరు ఎప్పుడు ఎవరి వైపు ఉంటారో తెలియలేని పరిస్థితి నెలకొంది. పార్టీ అంతర్గతంగా వర్గపోరులు ఎలా ఉరకల్తుస్తున్నాయో. పార్టీ అభివృద్ధిపై కాకుండా అభిప్రాయాలపై పోరు సాగుతోంది. అలా సాగితే ఎన్నికలకే ముప్పు. నాయకులు తమకు తామే గోళ్లు గీయుకుంటే ప్రజలు మళ్లీ ఆ గోళ్లకే ఓటేయాలా.? అందుకే ప్రజలు అనుకుంటున్నారు. గతంలో లాగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మరో మూడేళ్లకు వచ్చే శాసనసభ ఎన్నికల్లో కూడా భూపాలపల్లి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ పార్టీదే పై చేయి అవుతుందని సమాచారం బహిరంగంగా వినిపిస్తుంది.

### ఇది పార్టీగా వృద్ధి కాకుండా వర్గాలుగా విస్తరిస్తున్న సంకేతం.!

పార్టీ పెద్దలు ఈ వర్గరాజకీయ అగ్నికుండంను వెంటనే చల్లార్చకపోతే, వచ్చే ఎన్నికల్లో పార్టీకి ఒక్కపూట వంటకి కూడా పొయ్యిలేని పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉంది.
విపక్షం ముందు పోరాడలేకపోతే పర్వాలేదు. కానీ,ఒకే గూటికి చెందినవాళ్లు ఒకరిపై ఒకరు కుట్రలు చేస్తూ, లోపల నుంచి తవ్వకుంటే అది రాజకీయాలే కాదు, ప్రజాస్వామ్యానికి కూడా చేటు.పచ్చిగడ్డి వేస్తే బగ్గు మంటుంది అనేది సామెతే కానీ భూపాలపల్లిలో ఆ సామెత సజీవంగా కనిపిస్తోంది.!

## మహిళలపట్ల, బాలికల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు

**- సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవిత దేవి...**




**జహీరాబాద్ వెలుతురు జూలై 31:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారి ఆధ్వర్యంలో కోహీర్ మునిసిపల్ కార్యాలయ ఆవరణలో మండల ప్రజలకు చట్టాలపై అవగాహన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవిత దేవి నిర్వహించి మండల ప్రజలకు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రామిసరీ నోట్ లో తీసుకోవలసిన జాగ్రత్తలు, వివాహాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, భూ తగాదాల నివారణ, గృహహింస, డోమెస్టిక్ వైయలెన్స్ యాక్ట్, మోటార్ వాహనాల చట్టం, బాలకార్మిక నిర్మూలన చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, జువైనైల్ జస్టిస్ యాక్ట్, ఉచిత న్యాయసేవా సహాయంపై వివరించారు. నిత్యజీవితంలో చిన్న చిన్న సమస్యలు ఎదుర్కోకుండ ఉండడానికి, ఒకవేళ సమస్యలు ఎదురైతే వాటిని అధిగమించడానికి చట్టాలు తోడ్పాడుతాయని సూచించారు. మహిళలపట్ల, బాలికల పట్ల ఎవరైనా దురుసుగా ప్రవర్తించిన, వారు కఠిన శిక్షలకు లోనవుతారనితెలియ జేశారు. మండల ప్రజలందరూ చట్టాలను గౌరవిస్తూ, అవసరమైతే తోటివారికి తెలియజెప్పాలని సూచించారు. మీ చుట్టు బాల్య వివాహా బాధితులు, బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నట్లు గుర్తిస్తే 1098 కి ఫోన్ ద్వారా తెలుపవచ్చని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సోమశేఖర్, జగన్, తుల్జారాం, జనార్దన్, శివ కుమార్, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్, మండల ప్రజలు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసమే ఫిరాయించా: తెల్లం

**భద్రాచలం,జూలై31( వెలుతురు):**
భారత రాష్ట్ర సమితినుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటుపై సుప్రీంకోర్టు తీర్పును శిరసా వహిస్తానని భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకటరావు అన్నారు.కోర్టు తీర్పులపై తమకు గౌరవం ఉందన్నారు. ప్రజాప్రతినిధిగా భద్రాచలం అభివృద్ధి కోసమే అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లోకి వెళ్లానని స్పష్టంచేశారు. నియోజకవర్గంలో తనకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందన్న ఆయన.. ఒకవేళ ఉపఎన్నికలు వచ్చినా మళ్లీ గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ప్రజల సంక్షేమం, ఈ ప్రాంత అభివృద్ధి తనకు ముఖ్యమని అన్నారు. వెనకబడ్డ భద్రాచలం విషయంలో తాను నిరంతరం కృషి చేస్తున్నానని అన్నారు.

## మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాడుదాం

**- డాక్టర్ బండి సాయన్న, అధ్యక్షులు, స్కోప్ సంస్థ**

**- బాలల పరిరక్షణ కోసం అన్ని శాఖల సమన్వయంతో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించిన స్కోప్ సంస్థ**







**సంగారెడ్డి వెలుతురు జూలై 31:**
ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని, స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) సంస్థ తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లో ప్రభుత్వ , ప్రభుత్వేతర శాఖల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో బాలల హక్కులు మరియు రక్షణ వ్యవస్థలో కీలక పాత్రధారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాలలో రైల్వే రక్షణ దళం (ఆర్ పి ఎఫ్), ఆంటి-హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు (ఏ హెచ్ టి యు), జిల్లా న్యాయ సేవా సంస్థ (డి ఎల్ స్ ఎ), అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ (ఎ వి ఎ), జిల్లా బాల సంరక్షణ శాఖ (డి సి పి యు), కార్మిక శాఖ, చైల్డ్ లైన్ 1098, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, మహిళా భద్రతా విభాగం (పోలీసు), బాలల సంక్షేమ కమిటీలు (సి డబ్ల్యూ సి), భరోసా కేంద్రం, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. పాల్గొన్న వారందరూ ఏక కంఠంతో బాలల అక్రమ రవాణా సమస్య తీవ్రంగా పెరుగుతుండటంతో శాఖల మధ్య సమన్వయం, కమ్యూనిటీ చైతన్యం అత్యంత అవసరం అని పేర్కొన్నారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి)అనే సంస్థ దేశవ్యాప్తంగా ఉన్న అతి పెద్ద బాలల రక్షణ నెట్వర్క్ (418 జిల్లాల్లో 250కి పైగా ఎన్జీఓలు) లో భాగమైన స్కోప్ సంస్థ, గత సంవత్సరం మొత్తం 447 మందికి పైగా బాలలను బాల కార్మికత్వం, అక్రమ రవాణా, బాల్యవివాహాలు, లైంగిక దుర్వినియోగం నుండి రక్షించింది. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న అధికారులు, అక్రమ రవాణా అనేది లేబర్ లేదా లైంగిక దుర్వినియోగంతో మాత్రమే పరిమితం కాదు. ముఖ్యంగా బాలికలను బలవంతపు వివాహాల కోసం కూడా అక్రమ రవాణా చేస్తున్నారు, ఇది ఇప్పటికీ తక్కువగా వెలుగులోకి వచ్చిన అంశం అని పేర్కొన్నారు. జూలై 1 నుండి జూలై 30 వరకు సాగిన నెల రోజులు అవగాహన ప్రచారంలో, స్కోప్ సంస్థ, రైల్వే రక్షణ దళం సంయుక్తంగా సంగారెడ్డి జిల్లా ( జహీరాబాద్), జనగామ జిల్లా (జనగామ, రఘునాథపల్లి, ఘన్పూర్), యాదాద్రి భువనగిరి జిల్లా (భువనగిరి, ఆలేరు, బిబినగర్) స్టేషన్లలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి.రైళ్ల ద్వారా బాలలను రాష్ట్రాల మధ్య అక్రమంగా తరలించే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, ప్రయాణికులు, రైల్వే సిబ్బంది, వాణిజ్య వ్యాపారులు, కూలీలు మొదలైనవారిని బాలల అక్రమ రవాణాను గుర్తించే ప్రక్రియపై అవగాహన చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. స్కోప్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ బండి సాయన్న మాట్లాడుతూ:
"బాలల అక్రమ రవాణాను అరికట్టాలంటే తప్పనిసరిగా నేరస్థులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి. అది మాత్రమే నిజమైన భయం కలిగించి, నిరోధక శక్తిగా మారుతుంది. బాలలను రక్షించడంలో రక్షణ చర్యలు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పాటు, వేగవంతమైన న్యాయప్రక్రియతో సాగాలి. అప్పుడే అక్రమ రవాణా మాఫియాను ధ్వంసం చేయగలుగుతాం." జూలై 30న ముగింపు కార్యక్రమాలలో, జిల్లా స్థాయి అవగాహన ర్యాలీలు, అధికారులతో ఇంటరాక్టివ్ సెషన్లు, ప్రత్యేక పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మానవ అక్రమ రవాణా నిర్మూలన ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాకుండా, ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాలి అన్నారు. ముఖ్యంగా రైల్వే మార్గాలలో అధిక అవగాహన, నిఘా అవసరం అని వివరించారు. అన్ని భాగస్వామ్య శాఖల సమన్వయ కార్యక్రమాలు బాలల రక్షణపై అవగాహన పెంపుతో పాటు, అన్ని భాగస్వామ్య శాఖలు కలిసి కట్టుబాటును చాటాయి ం ఒక శిశురక్షిత, ట్రాఫికింగ్-రహిత సమాజ నిర్మాణ దిశగా ప్రయాణం చేయాలని నిర్ణయంతీసుకున్నాయి.



## కోహీర్ మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టల్ ఆకస్మిక తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి





**జహీరాబాద్ వెలుతురు జూలై 31:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారి ఆధ్వర్యంలో కోహీర్ మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టల్ ను సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవిత దేవి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో ఇంటరక్ట్ అయ్యి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో కనీసవసతులు లేవని హాస్టల్ సిబ్బందిపై మండిపడ్డారు. హాస్టల్ లో చీకటి గదులు, అధిక స్ట్రెంత్, వేంటిలేషన్ లేకపోవడంతో ఆ ప్రాంగణం అంతా దుర్వాసనతో ఉండడాన్ని గమనించారు. ఇటీవల హాస్టల్ లో విద్యార్థిని మృతి చెందినదని జడ్జి దృష్టికి రావడంతో ఈ ఆకస్మిక తనిఖీ నిర్వహించడం జరిగిందని అన్నారు. సమస్యలపై అధికారులతో మాట్లాడి వీలయినంత త్వరలో సమస్యలపై తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. న్యాయమూర్తితో పాటు న్యాయవాదులు సోమశేఖర్, జగన్, తుల్జరాం, జనార్ధన్, శివ కుమార్, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్ పాల్గొన్నారు.

## తూప్రాన్ పురపాలక పరిధిలో పారిశుద్ధ్య పనులు




**మెదక్ తూప్రాన్ జూలై 31వెలుతురు న్యూస్:**
మెదక్ జిల్లా తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలో 100 రోజుల ప్రత్యేక పారిశుద్ధ్య మరియు వివిధ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా గురువారం తూప్రాన్ పరిధిలోని 5వ వార్డులో డబుల్ బెడ్ రూమ్ లలో ఊర కుక్కలను,పిచ్చి కుక్కలను బ్లూ క్రాస్ హైదరాబాద్ వారిచే పట్టడం జరిగింది. 1వ వార్డు వార్డులో తడి పొడి చెత్త వేరు చేయు విధానంపై అవగాహన కల్పించడం జరిగింది.వర్షా కాలం దృశ్య అంటువ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పడం జరిగింది.ప్లాస్టిక్ వాడకాన్నినిషేదించాలని ప్లాస్టిక్ వాడడం వలన కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించడం జరిగింది అలాగే మురికి కాలువలు శుభ్రం చేయడం జరిగింది. 1వ వార్డులో మురికి కాలువలో చెత్త చెదారం ప్లాస్టిక్ బాటిల్స్ మొదలగునవి చెరువు లోకి వెళ్ళకుండా జాలీలు వేయడం జరిగింది.రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించడం జరిగింది. 7వ వార్డులోవాటర్ లో క్లోరినేషన్ టెస్టు నిర్వహించడం జరిగింది,వాటర్ ట్యాంక్ లను శుభ్రం చేయడం జరిగింది.పట్టణంలో డోర్ టు డోర్ ట్యాప్ కనెక్షన్ సర్వే మరియు ఆన్లైన్ చేయడం మొదలగు కార్యక్రమాలు మున్సిపల్ కమీషనర్ గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 31**
2025-26 విద్యా సంవత్సరానికి గాను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో మొదటి తరగతిలో ప్రవేశం కొరకు షెడ్యూల్డ్ కులములకు చెందిన విద్యార్థినీ, విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్- బేగంపేట నందు జిల్లాకు 2 సీట్లు కేటాయించడం జరిగిందని, అభ్యర్థులు జిల్లా వాసులై జూన్ 1, 2018 నుండి మే 31, 2019 మధ్య జన్మించి ఉండాలని, జనన ధృవీకరణ పత్రం తప్పనిసరిగా మీ-సేవ / మున్సిపల్ - కార్పొరేషన్ / తహశిల్దార్ ద్వారా జారీ చేయబడి ఉండాలని, కుల ధృవీకరణ పత్రం తప్పనిసరిగా విద్యార్థి పేరిట జారీ చేయబడినదై ఉండాలని తెలిపారు. వార్షిక



ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1 లక్షా 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థులు కుల, ఆదాయ, జనన ధృవీకరణ పత్రాలు, ఆధార్కార్డు, రేషన్కార్డు ఇతర ధృవపత్రాలతో ఆగస్టు 8వ తేదీ సాయంత్రం 5 గం?ల లోగా దరఖాస్తు సమర్పించాలని, ఆగస్టు 10వ తేదీన నియామక కమిటీ ద్వారా లాటరీ పద్ధతిన అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## జగన్ పర్యటనలో తోపులాట

- చేయివిరిగిన కానిస్టేబుల్

**నెల్లూరు,జూలై31( వెలుతురు):**
వైకాపా అధ్యక్షుడు జగన్ నెల్లూరు పర్యటనలో తోపులాట జరిగింది. జైలులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించిన తర్వాత మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి వెళ్తున్న సమయంలో వైకాపా కార్యకర్తలు ఆంక్షలు ఉల్లంఘించి భారీగా ప్రధాన రహదారిపైకి చేరుకున్నారు. నగరంలోకి ప్రవేశించినప్పటి నుంచే జగన్ రెచ్చగొడుతూ తన వెనుకే రావాలని కాన్వాయ్ నుంచి కార్యకర్తలకు పిలుపునివ్వడంతో వారు పరుగులు తీశారు. పోలీసులు వారిస్తున్నా జగన్ మాత్రం రండి.. రండి.. అని పిలవడంతో తోపులాట చోటు-చేసుకుంది. ప్రసన్న కుమార్‌రెడ్డి ఇంటికి చేరే రోడ్డుపై పోలీసులు పెట్టిన బారికేడ్లను కార్యకర్తలు పక్కకు నెట్టి ఒక్కసారిగా ముందుకెళ్లారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. ఈ ఘటనలో కావలి స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ మాలకొండయ్యకు గాయాలయ్యాయి. ఓ సీఐ కిందపడిపోయారు. తోపులాటలో కానిస్టేబుల్‌పై వైకాపా కార్యకర్తలు పడిపోవడంతో ఆయన చేయి విరిగింది. దీంతో మాలకొండయ్యను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలి

- **జిల్లా అధ్యక్షులు ఎం సురేష్ ఆధ్వర్యంలో కదం తొక్కిన విద్యార్థి లోకం...**
- **జిల్లా అధ్యక్షులు ఎం సురేష్ ఆధ్వర్యంలో కదం తొక్కిన విద్యార్థి లోకం...**



**జహీరాబాద్ వెలుతురు జూలై 31:**
గత ఆర్ఎస్ ప్రభుత్వం 7 లక్షల కోట్లు అప్పు చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి లోకానికి మోసం చేసి నిట్ట నిలువునా ముంచాలని కుట్ర చేస్తుందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం సురేష్ ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాల నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి



సంఘం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెండింగ్స్ స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని 2 వేల వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి స్థానిక ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు ఎం సురేష్ మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని గతంలో కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిందని అన్నారు. దాదాపు 13 సంవత్సరాల తర్వాత నేడు అదే కాంగ్రెస్ సర్కార్ అధికారంలో ఉంది. ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి ఉన్నత విద్యను అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న నేటి రేవంత్ రెడ్డి సర్కార్ విద్యార్థుల బకాయిలను విడుదల చేయడంలో మాత్రం తీవ్రమైన నిర్లక్ష్యాన్ని వహిస్తుందని ఆరోపించారు. 2024-25 విద్యాసంవత్సరానికి రావాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు సుమారు 7,200 కోట్లు ఉందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పాటై దాదాపు 19 నెలలు గడుస్తున్న అరకొరా నిధులు కేటాయించడం మాత్రమే కానీ వాటిని పూర్తిస్థాయిలో విద్యార్థులకు ఇవ్వడంలో విఫలమైందని ఆరోపించారు. గత సంవత్సరం కరీంనగర్ గ్రాడ్యుయేట్స్, ఆధ్యాపక ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా స్వల్ప నిధులను మాత్రమే విడుదల చేసిందని అన్నారు. అది కూడా ఆ ఎన్నికల్లో గెలవడానికి మాత్రమే కాంగ్రెస్ సర్కార్ పథకం ప్రకారం స్వల్ప నిధులను విడుదల చేసిందన్నారు. దానికి మించి ఒక రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను విడుదల చేస్తామని, రెగ్యులర్ గా రియంబర్స్మెంట్ ను ఇస్తామని వాగ్దానం చేసిందని, కానీ నేటికీ దానిని అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని వహిస్తుందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యేలకు మంత్రులకు ప్రజాప్రతినిధులకు ప్రతినెల లక్షల్లో జీతాలను ఇస్తుందన్నారు. తమ పార్టీ నాయకుల విగ్రహాలను నెలకొల్పడానికి కోట్లాది రూపాయలను వెచ్చిస్తుందన్నారు. ప్రపంచ అందాల పోటీలకు దాదాపు 200 కోట్ల రూపాయల ఖర్చు చేసిందన్నారు. అయ్యా మేము చదువుకుంటాం అంటే



డబ్బులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పథకాన్ని ఆసరా చేసుకుని చదువుతున్న పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల ఫీజులు మాత్రం విడుదల చేయడంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఘోరంగా విఫలమైంది అన్నారు. ఇప్పటికైనా విడుదల చేయకపోతే రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు సన్నిద్ధం అవుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు సందీప్ జిల్లా సహాయ కార్యదర్శి అనిల్. జిల్లా నాయకులు శ్రీకాంత్. దినేష్. డివిజన్ నాయకులు ఎండి ఇస్మాల్.గోపాల్, రాకేష్, సుస్మిత, స్వాతి, రాణి, మల్లేశ్వరి స్వప్న ,తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలి

- జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు.

**మెదక్ వెలుతురు న్యూస్ జూలై 31:**
సుదీర్ఘకాలం పోలీసు వ్యవస్థకు సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఎస్సై మహ్మద్ గౌస్ ను మెదక్ జిల్లా ఎస్పీ బీవీ శ్రీనివాసరావు జిల్లా పోలీసు కార్యాలయానికి ఆహ్వానించి పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మహ్మద్ గౌస్ ను జిల్లా ఎస్పీ పూలమాల శాలువా తో సత్కరించి బహుమతి ప్రధానం చేసి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి రీమార్కులు లేకుండా సర్వీసును పూర్తి చేసి పదవీ విరమణ పొందడం అభినందనీయమని తెలిపారు.పోలీసు వ్యవస్థకు చేసిన సేవలు మరువలేనివని,పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సంతోషంగా జీవించాలని తెలియజేశారు.ఉమ్మడి మెదక్ జిల్లాలో 1983వ సంవత్సరంలో మహ్మద్ గౌస్ పోలీసు కానిస్టేబుల్ గా జిల్లా పోలీసు




వ్యవస్థలోకి అడుగుపెట్టి 42 సంవత్సరాల పాటు పోలీసు వ్యవస్థకు సేవలు అందించారు.మహ్మద్ గౌస్ 2014లో ఎస్సై గా ప్రమోషన్ పొందడం జరిగింది.ఉమ్మడి జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఎస్హెచ్వో గా బాధ్యతలు నిర్వహించడం జరిగింది.ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సేవలందించి ప్రజల మన్ననలను పొందారు. గురువారం రోజున ఎస్సై గా పదవి విరమణ పొందడం జరిగింది.శాంతి భద్రతల పరిరక్షణలో తన వంతు పాత్రను పోషించడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా తన సర్వీసు మొత్తాన్ని ఎలాంటి రిమార్కులు లేకుండా పూర్తి చేసినందుకుగాను ప్రభుత్వం గుర్తించిఉత్తమ సేవా పథకాలతో గౌరవించింది.ఎస్సై మహ్మద్ గౌస్ ను చివరగా జిల్లా ఎస్పీ గారు మరియు సిబ్బంది కరతాల ధ్వనులతో అభినందనలు తెలియజేసి వీడ్కోలు పలకడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీ ఎస్ మహేందర్, మెదక్ డియస్పి శ్రీ. ప్రసన్న కుమార్, తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్, సైబర్ క్రైమ్ డియస్పి సుభాష్ చంద్ర బోస్, ఏఆర్ డియస్పి రంగానాయక్ లతో పాటు జిల్లా పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 31**
ప్రజా ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సతీష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో స్థానిక ప్రజలకు మరింత వేగవంతమైన మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని చేపట్టిందని తెలిపారు. అధికారులు నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎస్.ఐ. శ్వేతతో కలిసి సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతి గదులు, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, శుద్ధమైన త్రాగునీటిని ఇవ్వాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వర్షాకాలం





దృష్ట్యా వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రపరచుకోవడం వంటి అంశాలను విద్యార్థులకు వివరించాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలో కొనసాగుతున్న మూత్రశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, విద్యార్థులకు మంజూరైన స్పోర్ట్స్ కిట్లను అందించి క్రీడారంగంలో రాణించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, సమయం పాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి ఫెర్టిలైజర్ దుకాణాన్ని సందర్శించి స్టాకు నిల్వలు, ధరల పట్టిక, రశీదు పుస్తకాలను పరిశీలించారు. రైతులకు విక్రయించిన వాటికి సంబంధించి రశీదు జారీ చేయాలని, దుకాణం ఎదుట ధరల పట్టిక, స్టాకు నిల్వల వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. నకిలీ, నిషేధిత విత్తనాలు, ఎరువుల విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. డి.సి.ఎం.ఎస్. రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని బూరుగుపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా అంశాలను పరిశీలించారు. వర్షాకాలం అయినందున పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు నీటి నిల్వలను తొలగించడంతో పాటు ఆయిల్ బాల్స్, బయోటెక్ స్ప్రే పిచికారి చేయాలని తెలిపారు. ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిరుపేదల కొరకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ది పొందిన లబ్దిదారులు తమ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని, నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. అనంతరం, జిల్లా వ్యవసాయ అధికారి భుక్య ఛత్రు, తహసిల్దార్ సదానందంతో కలిసి మండలంలోని దాంపూర్ గ్రామంలో గల అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పరిసరాలు, ఆహార నాణ్యత, రిజిస్టర్లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా చర్యలు తీసుకుంటుందని, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమయానుసారంగా పిల్లల ఎత్తు, బరువు పరిశీలించి ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన మందులు, పోషకాహారం అందించి సాధారణ స్థితికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గర్భిణులకు గర్భస్థ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వైద్య పరీక్షలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని గుర్తించేందుకు స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వైద్య చికిత్స కోసం, ఆర్థిక సహాయం అందించిన జనహిత సేవాసమితి.




**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 31**

అన్నదాన కార్యక్రమాలు చేస్తూ, అందరి మన్ననలు పొందుతున్న బెల్లంపల్లి పట్టణంలోని జనహిత సేవాసమితి, ఆర్థిక పరిస్థితి బాగోలేక, ఆపదలో ఉండి వైద్య సహాయం కోసం ఎదురుచూస్తున్న పలువురికి, తామున్నామంటూ, ఆర్థిక సహాయం అందిస్తూ, ఆదుకుంటున్న జనహిత సేవాసమితి కి, బెల్లంపల్లి పట్టణ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా, జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం దాతల సహకారంతో బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన మేడి వినయ్, అనే యువకుడి కుటుంబ సభ్యులకు 24 వేల రూపాయల చెక్ ని, జనహిత సేవా సమితి ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు, ఆడెపు సతీష్ మాట్లాడుతూ, బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన మేడి వినయ్,(21) స్థానిక సాయి బాబా గుడి దగ్గర ట్రాక్టర్, బైక్ ఢీకొని తీవ్ర గాయలై ప్రాణాపాయ స్థితిలో మంచిర్యాల మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, రోజువారి కూలి పని చేస్తూ, జీవనం సాగిస్తున్న ఆ కుటుంబానికి వైద్య ఖర్చులు భారం కావడంతో, విషయం తెలుసుకున్న జనహిత సేవా సమితి, సభ్యులు దాతల నుండి విరాళాలు సేకరించిన 24 వేల రూపాయల చెక్ ని, వారి కుటుంబ సభ్యులకు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద మనసుతో ఆర్థిక సహకారం అందించిన దాతలు ప్రతి ఒక్కరికి పేరు పేరున జనహిత సేవా సమితి తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంపెల్లి విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు కొట్టే రమేష్, సలహాదారులు పూదరి నగేష్ గౌడ్, కార్యదర్శులు గుమ్ముల చందు, ఆడే సురేందర్, సభ్యులు గాజుల కైలాష్, మోటపలుకుల అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డినెన్స్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నాటకం

**- బిజెపి, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు బురద జల్లే ప్రయత్నం చేస్తూ బీసీలకు మోసం :**

**- ఎమ్మెల్సీ కవిత 72 గంటల నిరాహా ర దీక్ష పోస్టర్ ఆవిష్కరణలో తెలంగాణ జాగృతి నాగర్ కర్నూల్ జిల్లా అధ్య క్షుడు దారమోని గణేష్ తదితరులు...**





**వెలుతురు, కల్వకుర్తి 31 జులై :**

కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ మరిచి, బీసీలను మోసం చేస్తు..ఆర్డినెన్స్ పేరుతో కొత్త నాటకానికి కాంగ్రెస్ ప్రభు త్వం తెరలేపిందని తెలంగాణ జాగృతి నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్ అన్నారు. కేంద్రం లో ఉన్న బిజెపి సర్కారు మౌనం పాటిస్తూ బీసీలకు అన్యాయం చేసే విధంగా ఒకరిపై ఒకరు బురదల్లే ప్రయత్నం చేస్తూ తెలంగా ణ రాష్ట్రం లోని బీసీలను మోసం చేస్తు న్నారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పట్టణంలోని వైఆర్ఆర్ కాంప్లెక్స్ నందు బీసీ బిల్లుల సాకారం కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేపట్టబోయే 72 గంటల నిరాహారదీక్షకు మద్దతుగా నాగర్ కర్నూల్ జిల్లా తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ , నాగర్ కర్నూల్ జిల్లాలోని అన్ని నియోజ కవర్గంలోని మేధావులు, కవులు, బిసి సంఘాలు కలుపుకొని పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ జాగృతి నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దారమో ని గణేష్ , యునైటెడ్ పూలే ఫ్రెంట్ సమ న్వయకర్త విజయేందర్ సాగర్, తె లంగా ణ బిసి మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ జాగృతి జిల్లా మహిళా కన్వీనర్ చిలుక మంజుల రెడ్డి, తె లంగాణ జాగృతి జిల్లా ఉపాధ్య క్షురాలు మేకల మంజుల శ్రీనివా స్ తదితరులతో కలిసి హైదరాబాద్ లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్న 72 గంటల నిరహార దీక్షకు సంబంధించిన పోస్టర్ ను వారు ఆవిష్కరించి మాట్లాడా రు. తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బీసీల రిజర్వేషన్లు ఉద్యోగంలో విద్యలో ఉపాధిలో రాజకీయంలో సాధించే వరకు కల్వకుంట్ల కవితక్క నాయకత్వం లో ఈ నెల 4, 5, 6,7 తేదీలలో 72 గంటల పాటు కవితక్క చేసేటటు వంటి నిరాహారదీక్షకు సంఘీభావంగా నాగర్ కర్నూల్ జిల్లా జా గృతి పూర్తి మద్దతు ప్రకటించినట్లు చెప్పా రు. 72 గంటల పాటు నిరాహార దీక్షకు తెలంగాణ బీసీ మహా సభ రాష్ట్ర అధ్య క్షుడు కొ మ్ము శ్రీనివాస్ యాదవ్ పూర్తి మద్దతును ప్రకటించడం జరిగింది. కవిత అక్క దీక్ష కోసం నడుం బిగించి తన ప్రాణత్యాగా నికైనా సిద్ధమవుతూ బీసీల కు 42 శాతం రిజర్వేషన్లు లక్ష్యంగా నిరా హార దీక్ష హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టడం జరుగుతుందని ఈ దీక్షకు అన్ని కుల సంఘాల వారు మద్దతు కూడ గట్టడం కోసం నేడు నాగర్ కర్నూల్ జిల్లా లోని కల్వ కుర్తికి రావడం జరిగిందని తెలి పారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా నాయకురాలు సుశీల ఈశ్వరయ్య, అని ల్,శేఖర్ గౌడ్ శ్రీరాములు సాది క్, పార్వతి సాగర్, అనీషా,మంజుల తదితరులు పాల్గొన్నారు.

## సిగాచి ప్రమాదంపై హైకోర్టులో పిల్

**- ప్రభుత్వానికి నోటీసులు జారీ**

**హైదరాబాద్,జూలై31( వెలుతురు):**



సంగారెడ్డి సిగాచి పరిశ్రమ ప్రమాదంపై హైకోర్టులో పిల్ దాఖలైంది. సిగాచి పరిశ్రమ ప్రమాదంపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సిగాచిపై న్యాయవాది కె.బాబూరావు పిల్ దాఖలు చేశారు. పరిశ్రమలో భద్రతా చర్యలు తీసుకోలేదని పిటిషనర్ పేర్కొన్నారు. పేలుడు ఘటనలో ఇంకా 8 మంది ఆచూకీ దొరకలేదని హైకోర్టుకు తెలియజేశారు. బాధితులకు ప్రకటించిన పరిహారం ప్రభుత్వం ఇంకా చెల్లించలేదని, సిగాచి పరిశ్రమ యజమానిని ఇప్పటివరకు అరెస్టు చేయలేదని.. ప్రమాదంపై ఏర్పాటు- చేసిన కమిటీ- నివేదిక బయటపెట్టాలని పిటిషనర్ కోరారు.ఇదిలా ఉండగా.. ఫ్యాక్టరీలలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ఇకపై అన్ని జిల్లాల్లో కెమికల్, ఫార్మా, హై-రిస్క్ పరిశ్రమలన్నింటికీ చెక్ లిస్ట్‌ను ప్రకటిస్తామన్నారు. నిబంధనలను ఉల్లంఘించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిగాచి ఫ్యాక్టరీ ఘటనలో ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన సాధారణ సూచనలను పాటించి ఉంటే, కంపెనీకి రూ. 20 నుంచి రూ. 25 లక్షలకు మించి ఖర్చు అయ్యేది కాదన్నారు. ఇప్పుడు ప్రమాదం జరగడం వల్ల రూ. 50 కోట్ల పరిహారం చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.

## వన మహోత్సవం లక్ష్యాలను పూర్తిగా సాధించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 31**

భవిష్యత్తు తరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం-2025 కార్యక్రమంలో



జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో గీత కార్మికుల సంక్షేమంలో భాగంగా 400 తాటి మొక్కలు నాటడంతో పాటు గీత కార్మికులకు మొక్కలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తు తరాలకు సహజ సిద్ధమైన, సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటే లక్ష్యాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని, ప్రజలు తమ ఇండ్లలో మొక్కలు నాటి పరిరక్షించాలని తెలిపారు. మండలంలోని పొక్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా 200 మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల పరిధిలో కూరగాయల మొక్కలను అభివృద్ధి చేసి తాజా కూరగాయలు పొందేందుకు ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్ను ప్రారంభించారు. పాఠశాలలోని వంటశాల, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో నాణ్యమైన, పోషక విలువలు గల ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులను వివిధ సబ్జెకులలో పలు ప్రశ్నలు అడిగి వారి పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే దిశగా ఏకాగ్రతతో చదవాలని, ఉన్నత స్థానాలలో నిలువాలని అన్నారు. గ్రామంలో ఆరోగ్య ఉ ప కేంద్రం ఏర్పాటులో భాగంగా అనువైన ప్రదేశం కొరకు స్థల పరిశీలన చేశారు. పల్లెదవాఖానా ఆయుష్ భారత్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. మండలంలోని అంగ్రాజ్పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని,



సమయానుసారంగా చేసుకోవలసిన పరీక్షలు, తీసుకోవలసిన మందులు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిల్లల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, వ్యాక్సినేషన్ కొరకు దూర ప్రాంతాలకు వెళ్ళవలసిన అవసరం లేదని, ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. చెన్నూర్ మండల కేంద్రంలోని తహశిల్దార్ కార్యాలయాన్ని తహశిల్దార్ మల్లిఖార్జున్తో కలిసి సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా నిర్వహించి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, వివిధ రకాల ధృవపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకం పనులను మున్సిపల్ కమీషనర్ మురలీకృష్ణతో కలిసి పరిశీలించి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మిషన్ భగీరథతో పాటు అమృత్ 2.0 ద్వారా ప్రజలందరికీ నిరంతరం త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన అధికారులను సన్మానించి, జ్ఞాపికలు అంద చేసిన డిసిపి

**- శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలి**

**- మంచిర్యాల డిసిపి భాస్కర్ ఐపిఎస్.**

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 31**





పోలీస్ శాఖ నందు సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను ఈరోజు రామగుండం పోలీస్ కమీషనర్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి భాస్కర్ ఐపిఎస్ పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ముగ్గురు పోలీసు అధికారులు, కుటుంబ సభ్యులతో కలిసి శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపిక అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈరోజు పదవీ విరమణ పొందిన అదనపు డిసిపి అడ్మిన్ సి.రాజు, 1991 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్ లోకి ఆర్ ఎస్ఐ గా ఎంపికై అంచలంచలుగా పదోన్నతి పొంది కుటుంబ సభ్యుల సహకారంతో ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా సంఘవిద్రవశక్తులతో పోరాడి యాంటి ఎక్స్ట్రిస్ట్ ఆపరేషన్ నందు విధులను నిర్వర్తించి, ప్రస్తుత పోలీసు వ్యవస్థ ప్రశాంతంగా కొనసాగడానికి కీలకపాత్రను పోషించి విజయవంతంగా పదవి విరమణ పొందడం జరిగింది. ఎన్.నరేష్ బాబు ఇన్స్పెక్టర్, 1983 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్ లోకి కానిస్టేబుల్ గా వచ్చి అంచలంచలుగా సర్వీసులోని 42 సంవత్సరముల 2 నెలలు విధులను నిర్వర్తించడం జరిగింది. జే . సమ్మయ్య ఆర్ఎస్ఐ ఇన్స్పెక్టర్ 1984 సంవత్సరంలో పోలీసు డిపార్ట్మెంట్ లోకి కానిస్టేబుల్ గా వచ్చి అంచలంచలుగా సర్వీసులోని 41 సంవత్సరముల 6 నెలలు విధులను నిర్వర్తించడం జరిగింది. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ...... గతంలో పోలీసు వ్యవస్థ అత్యంత క్లిష్ట పరిస్థితుల నందు సంఘవిద్రోహశక్తులతో పోరాడి కీలకంగా విధులను నిర్వర్తించి ప్రస్తుతం పోలీసు వ్యవస్థ ప్రశాంతంగా ఉండడానికి గల కారణమైన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. సుదీర్ఘ కాలం పాటు పోలీసు వ్యవస్థను సేవలందించి పదవీ విరమణ పొందుతున్నందుకు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలను పోలీసులు సక్రమంగా విధులను నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని వారి తోడ్పాటు వల్లనే విధులను నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదగగలరని తెలియజేశారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని సూచించారు. తమ ఆరోగ్యాల పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు. ఎటువంటి అవసరం ఉన్న కమీషనరేట్ పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. పదవి విరమణ పొందిన అధికారులను ప్రభుత్వ వాహనంలో ఇంటి వరకు సాగనంపడం జరిగింది. ఈ కార్యక్రమంలో 13 బెటాలియన్ కమాండెంట్ మూర్తి , స్పెషల్ బ్రాంచ్ ఎసిపి మల్లారెడ్డి , ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాస్ , ఎఆర్ ఎసిపి ప్రతాప్, ఏఓ శ్రీనివాస్ , రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు దామోదర్, మల్లేషం, శ్రీనివాస్, వామన మూర్తి , సూపరింటెండెంట్ లు ఇంద్ర సేనా రెడ్డి, సంధ్య, మనోజ్ కుమార్, సిసి హరీష్, రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లా కుంట పోచలింగం, స్వామి, పదవి విరమణ అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పోలా లక్ష్మమ్మ, పాపి శెట్టి లింగమ్మ ల జ్ఞాపకార్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగదు బహుమతులు, గోల్డ్ మెడల్స్ ప్రదానం







**వెలుతురు న్యూస్, అచ్చంపేట జూలై 31:**

నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీస్తు శేషులు పోల లక్ష్మమ్మ, పాపిశెట్టి లింగమ్మ జ్ఞాపకార్థంగా క్లాస్ మెట్ ఫౌండర్ వాస రాఘవెందర్ సహకారంతో వారి మనవడు రిటైర్డ్ ఎస్పీ పోల విజయకుమార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర అమ్రాబాద్ నందు మండల స్థాయిలో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు గోల్డ్ మెడల్స్ ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం ఏ. బాలకిషన్ అధ్యక్షత వహించారు. క్లాస్మేట్ క్లబ్ జిల్లా అధ్యక్షులు కె.పి. ప్రసాద్, మండల అధ్యక్ష కార్యదర్శులు కామిశెట్టి శ్రీనివాస్, రాఘవేందర్, హరీష్, విశ్వహిందూ పరిషత్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సంబు వెంకటరమణ, జూలూరు సత్యనారాయణ, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకటనల ప్రకారం ఉత్తమంగా ఎంపికైన విద్యార్థులు: మొదటి బహుమతి: జెడ్పిహెచ్ఎస్ వంకేశ్వరం – ఏ. రాకేష్ రెండవ బహుమతి: జెడ్పిహెచ్ఎస్ భద్ర – సిహెచ్. శ్రీనివాస్ మూడవ బహుమతి: జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ అమ్రాబాద్ – డి. శివాని అదేవిధంగా గర్ల్స్ రెసిడెన్షియల్ మననూర్, కేజీబీవీ అమ్రాబాద్, కేజీబీవీ పదర పాఠశాలల విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు రాచూరి సంతోష్ అందించారు. అదేవిధంగా ఈరోజు పాఠశాల ఆవరణంలో ఎఫ్ఆర్ఓ వీరేష్ వారి ఆధ్వర్యంలో ఔషధ సంబంధ మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో సైఫుద్దీన్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం రిటైర్డ్ ఎస్పి పోల విజయకుమార్ మాట్లాడుతూ, “విద్యతోనే సమాజ మార్పు సాధ్యమవుతుందని మేలు చేస్తున్న విద్యార్థులకు ఈ చిన్న ప్రోత్సాహం వారి భవిష్యత్తులో పెద్ద మార్పును తీసుకురావాలి” అని ఆయన విద్యార్థుల కు సూచించారు.



# విజయ్ దేవరకొండ కేసు విచారణ

**- తీర్పును వాయిదా వేసిన హైకోర్టు**




**హైదరాబాద్,జూలై31( వెలుతురు):**
సినీ హీరో విజయ్ దేవరకొండ దాఖలు చేసిన ఫిటిషన్‌పై గురువారం తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్ పై తీర్పు వాయిదా వేసింది. గతంలో విజయ్ దేవరకొండ ఓ మూవీ ఈవెంట్‌లో గిరిజనులను కించపరిచేలా, వారి ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారంటూ గిరిజన సంఘాల నాయకులు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని విజయ్ దేవరకొండ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు విజయ్ తరఫు న్యాయవాది కోర్టులో ఇవాళ తన వాదనలు వినిపించారు. విజయ్ వ్యాఖ్యలు చేసిన రెండు నెలలు తరువాత గిరిజన నాయకులు ఫిర్యాదు చేశారని, ఇందులో దురుద్దేశం ఉందని ఆయన కోర్టుకు తెలిపారు. విజయ్ దేవరకొండ సామాజిక మాధ్యమాల్లో క్షమాపణ కూడా చెప్పారని హైకోర్టుకు వివరించారు. అయితే సోషల్ మీడియాలో చెప్పిన క్షమాపణలు పరిగణలోకి తీసుకోకూడదని ప్రతివాదుల తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇరువురి వాదనలు ముగియడంతో హైకోర్ట్ తీర్పును వాయిదా వేసింది.

# భారత ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యం

**- కేంద్రంపై రాహుల్ విమర్శలు**



**న్యూఢిల్లీ,జూలై31( వెలుతురు):**
భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్జీవ స్థితిలో ఉందని ప్రధాని మోడీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మినహా అందరికీ తెలుసునని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థను బిజెపి నాశనం చేసిందని ధ్వజమెత్తారు. భారత ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ విమర్శ గురించి పార్లమెంట్ ఎదుట గురువారం మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. అవును, ట్రంప్ చెప్పింది వాస్తవమేనని, ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ ఈవిషయం తెలుసునని అన్నారు. ట్రంప్ వాస్తవాన్ని వెల్లడించినందుకు సంతోషిస్తున్నానని అన్నారు. ఇందులో ఆశ్చర్యం లేదని, అదానీకి సహాయం అందించడం కోసం బిజెపి ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని అన్నారు. అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటుందని, ఆవిషయాన్ని ట్రంప్ స్పష్టం చేస్తారని, ట్రంప్ చెప్పినట్లు ప్రధాని మోడీ చేస్తారని అన్నారు. భారతదేశ దిగుమతులపై 25శాతం సుంకం విధిస్తున్నట్లు- ప్రకటించిన తర్వాత, భారత్,రష్యాల ఆర్థిక వ్యవస్థలు నిర్జీవమైనవని అమెరికా అధ్యక్షులు ప్రకటించిన సంగతి తెలిసిందే.

# ఎమ్మెల్యేల అనర్థ పిటిషన్‌పై తీర్పు

**- స్వాగతించిన తెలంగాణ బిజెపి**



**హైదరాబాద్,జూలై31( వెలుతురు):**
పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బిజెపి స్వాగతించింది. ఈ తీర్పును తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు స్పందించారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలన్న తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు- చెప్పారు. ఈ తీర్పు మంచి పరిణామమన్నారు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్‌లు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించాయని విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టనున్న జనహిత పాదయాత్రపై రామచందర్‌రావు స్పందిస్తూ.. ఆ పార్టీ జనహిత పాదయాత్ర చేస్తోందో? జనాల్ని మోసం చేసే పాదయాత్ర చేస్తుందో చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీ-లు, డిక్లరేషన్లు, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో తెలుపుతూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్వేతపత్రం విడుదల చేస్తేనే కాంగ్రెస్‌కు పాదయాత్ర చేసే నైతిక హక్కు ఉంటు-ందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేస్తోందని విమర్శించారు.

# ఎన్డీఏకు పన్నీర్ సెల్వం గుడ్‌బై

**చెన్నై,జూలై31( వెలుతురు):**



తమిళ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. దివంగత నేత జయలలితకు అత్యంత నమ్మకస్థుడుగా ఉన్నమాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం ఎన్డీయే నుంచి వైదొలగారు. ఈ మేరకు మాజీ మంత్రి, సెల్వంకు నమ్మినబంటు రామచంద్రన్ ప్రకటించారు. ఆయన ప్రకటిస్తున్న సమయంలో సెల్వం కూడా అక్కడే ఉన్నారు. మార్నింగ్ వాక్ సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పన్నీర్ సెల్వం కలిశారు. పలు విషయాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎన్డీయే నుంచి వైదొలగుతున్నట్లు- ప్రకటించడం గమనార్హం. ఎన్డీయే కూటమితో పూర్తిగా సంబంధాలు తెంచుకున్నట్లు- ఆ ప్రకటనలో తెలిపారు. 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పన్నీర్ సెల్వం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నట్లు- పేర్కొన్నారు. పొత్తుల గురించి ఇప్పుడు ప్రస్తావించాల్సిన సమయం కాదని, ఎన్నికల ముంగిట ఆ అంశం గురించి మాట్లాడతామని అన్నారు. మరోవైపు ఇటీవల సినీనటు-డు విజయ్ ప్రారంభించిన తమిళ వెట్రి కళగ (టీవీకే)తో ఓపీఎస్ చేతులు కలిపే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది. పన్నీర్ సెల్వాన్ని విలేకరులు పొత్తుల అంశం గురించి ప్రస్తావించగా.. కాలమే చెబుతుంది అంటూ.. సమాధానం దాటవేశారు. పన్నీర్ సెల్వం ఒకానొక సమయంలో ఏఐఏడీఎంకేలో కీలకంగా వ్యవహరించారు. ఎన్డీయే కూటమిలోనూ ముఖ్యపాత్ర పోషించారు. అయితే, పార్టీలో ఏర్పడిన అంతర్గత కలహాలతో బహిష్కరణకు గురైన ఆయన.. సొంతంగా తన వర్గాన్ని విస్తరించుకున్నారు. తాజాగా ఎన్డీయే నుంచి కూడా బయటకు రావడం.. 2026 అసెంబ్లీ ఎన్నికల ముంగిట తమిళ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

## ట్రంప్ టారిఫ్ ఒత్తిళ్లకు

# తలొగ్గొద్దు

- కేంద్రానికి శశిథరూర్ సూచన



**న్యూఢిల్లీ,జూలై31( వెలుతురు):**
ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గదన్ని కాంగ్రెస్ సీనియర్ నేత,ఎంపి శశిథరూర్ అన్నారు. ఇఇ మన వాణిజ్యంపై తీవ్రప్రభావం చూపుతుందని అన్నారు. భారత దిగుమతులపై 25శాతం సుంకంతో పాటు అదనంగా జరిమానాలు విధిస్తున్నట్లు- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ స్పందించారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్న తరుణంలో ఇలాంటి ప్రకటన సరికాదన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత వాణిజ్యానికి అమెరికా అతి పెద్ద మార్కెట్. మన ఎగుమతులే 87-90 బిలియన్ డాలర్ల వరకు ఉంటాయి. రష్యా నుంచి దిగుమతులు చేస్తున్నందుకు సుంకాలు, జరిమానా విధిస్తున్నట్లు- ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య చర్చల్లో బేరసారాల కోసం ఇది హెచ్చరిక కావొచ్చు. టారీఫ్‌ల నేపథ్యంలో ఎగుమతులు తగ్గితే అది మనకు నష్టం కలుగుతుంది. ఇది మన జీడీపీపై కూడా ప్రభావం చూపించొచ్చు. అమెరికా డిమాండ్లు పూర్తిగా అర్థం లేనివిగా ఉన్నాయి. వాటిని ప్రతిఘటించే హక్కు భారత్‌కు ఉంది. వారిని సంతోషపెట్టడానికి మన జీవనోపాధిని పణంగా పెట్టలేం. మన అవసరాలను కూడా అగ్రరాజ్యం అర్థం చేసుకోవాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ టారిఫ్‌ల విషయంలో మన దేశ విధానంపై నమ్మకం ఉందని థరూర్ పేర్కొన్నారు. తర్వాత ఎం జరుగుతుందనేది కొనసాగుతున్న చర్చలపై ఆధారపడి ఉంటు-ందన్నారు. అమెరికా ఒత్తిడికి లొంగి పోకుండా.. న్యూదిల్లీ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తుందనే కారణం చూపుతూ.. భారత దిగుమతులపై ట్రంప్ 25శాతం సుంకాలతో పాటు- పెనాల్టీలు విధించారు. ఆగస్టు 1 నుంచి ఇది అమల్లోకి రానున్నట్లు- తెలిపారు. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో న్యూదిల్లీ ఒకటని ఈ సందర్భంగా మళ్లీ ఆరోపించారు. ఈ క్రమంలోనే రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా తమకు సంబంధం లేదని ఆయన మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారి ఆర్థికవ్యవస్థను మరింత పతనం చేసుకుంటు-న్నాయని వ్యాఖ్యానించారు.

# పార్లమెంటు ఆవరణలో బాలకృష్ణ సందడి

**- స్పీకర్ ఓంబిర్లతో మర్యాదపూర్వక భేటీ**

**- సమస్యలపై మనోహర్ లాల్ ఖట్టర్‌కు వినతులు**

**న్యూఢిల్లీ,జూలై31( వెలుతురు):**



పార్లమెంటు ఆవరణలో నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సందడి చేశారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పార్టీ ఎంపీలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ- అయ్యారు. తన నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు వినతులు సమర్పించారు. అంతకుముందు బాలకృష్ణకు తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తాను రోజూ పార్లమెంటుకు వచ్చేందుకు ఉపయోగించే సైకిల్‌ను చూపించారు. దీంతో బాలయ్య అక్కడ సరదాగా కాసేపు సైకిల్ నడిపారు. అనంతరం టీడీపీ ఎంపీలతో కలిసి స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. స్పీకర్‌ను ఘనంగా సన్మానించి పలు రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఆ తరువాత కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ- అయ్యారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు వినతులను ఆయనకు సమర్పించారు. తెలుగు దేశం పార్టీ ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తున్న పార్టీ అని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ పాటుపడుతోందని బాలకృష్ణ ఈ సందర్భంగా అన్నారు. ప్రస్తుతం డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో బాలకృష్ణ అఖండ-2 మూవీలో నటిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సింహా, లెజెండ్, అఖండ బ్లాక్ బస్టర్ చిత్రాల తర్వాత బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబోలోని 4వ చిత్రమిది. అఖండ-2 బ్లాక్ బస్టర్ మూవీ అఖండకు సీక్వెల్. కాగా, ఈ సినిమా సెప్టెంబర్ 25న విడుదల కానున్నట్లు- సమాచారం.

# రైల్వేలపై సమాచారహక్కు చట్టం కింద ఆరా

**- విభజన చట్టం ప్రకారం కాజీపేట రైల్వే కోచ్**

**- ఏపికి విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు**

**హైదరాబాద్,జూలై31( వెలుతురు):**




సమాచార హక్కు కింద అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి సమాధానం వచ్చింది. ఏపీ తెలంగాణ రెండు రాష్ట్రాలుగా విడిపోయి దాదాపు దశాబ్ధకాలం దాటేసింది. ఈ క్రమంలో రెండు రాష్ట్రాలకు ఏం దక్కింది అనే ప్రశ్నకు రైల్వేల నుంచి వివరణ వచ్చింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలులో భాగంగా.. రైల్వే మంత్రిత్వ శాఖ విశాఖపట్నంలో రైల్వే జోన్ ఏర్పాటు- చేస్తోందని వెల్లడించింది. ఇదే క్రమంలో తెలంగాణలోని కాజీపేటలో రైల్వే కేచ్ ఫ్యాక్టరీని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు- బదులిచ్చింది. దీనికి తోడు ఏపీ రాజధాని అమరావతిని ఇతర ప్రాంతాలతో కలిపేందుకు రైల్వే స్టేషన్లను నిర్మించనున్నట్లు- ప్రకటించింది. ఈ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు స్టార్ట్ అయినట్లు- రైల్వే శాఖ వెల్లడించింది. రైల్వే బోర్డు జాయింట్ డైరెక్టర్ సునీల్ ప్రభాత్ వివరాలను అందిస్తూ.. చట్టంలోని మౌలిక సదుపాయాలకు సంబంధించిన షెడ్యూల్ 13లోని 8, 10 ,11 అంశాలు మంత్రిత్వ శాఖకు సంబంధించినవని.. ఈ ప్రాజెక్టుల అమలు ప్రస్తుతం వివిధ దశల్లో ఉందని స్పష్టం చేశారు. షెడ్యూల్ లోని 8వ అంశం కింద కొత్తగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రధాని మోదీ జనవరి 8న శంకుస్థాపన చేశారు. భవనాల నిర్మాణానికి టెండర్లు కూడా పిలవబడ్డాయి. షెడ్యూల్ లోని 10వ అంశం కింద వివిధ రకాల ఆధునిక రైల్వే స్టాక్‌లను తయారు చేసి నిర్వహించగల సామర్థం గల రైలు తయారీ యూనిట్‌ను తెలంగాణలోని కాజీపేటలో అభివృద్ధి చేయాలని భారతీయ రైల్వే ఎ÷-లాన్ చేసింది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ అనుమతి మంజూరై రైల్ వికాస్ నిగమన్ లిమి-టె-డ్ కి అప్పగించబడింది. ఇక షెడ్యూల్ లోని 11వ అంశం కింద ఏపీ కొత్త రాజధాని అమరావతికి ప్రత్యక్ష రైలు కనెక్టివిటీ-ని అందించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఎర్రుపాలెం-నంబూరు వయా అమరావతి అనే 56.53 కిలోమీటర్ల కొత్త లైన్ మంజూరు చేయబడింది.

# జగన్ నెల్లూరు పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత

**- ఆంక్షలు ఉల్లంఘించిన వైకాపాశ్రేణులు**

**- లాఠీఛార్జ్ చేశారంటూ రోడ్డుపై ప్రసన్న బైఠాయింపు**

**నెల్లూరు,జూలై31( వెలుతురు):**
వైఎస్ జగన్ నెల్లూరు పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. వందల మందితో తన నివాసానికి వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి ప్రయత్నించారు. పరిస్థితి అదుపుతప్పే అవకాశం ఉండటంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. వైసీపీ శ్రేణులను నిలువరించే ప్రయత్నం చేశారు. అయితే, పోలీసులతో వాగ్వాదానికి దిగారు ప్రసన్న కుమార్ రెడ్డి. మహిళా డీఎస్పీ సింధుపై సైతం దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు.. లాఠీలు చుపుతూ వైసీపీ మూకలను తరిమేశారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రసన్నకుమార్ రెడ్డి.. ఆర్ అండ్ బీ బంగ్లా దగ్గర రోడ్డుపై బైఠాయించారు. తమ అనుచరులందరినీ రమ్మంటూ ఫోన్లలో సందేశాలు పంపించారు. భారీగా చేరుకున్న వైసీపీ శ్రేణులు.. రప్పా రప్పా అంటూ భయానకంగా నినాదాలు చేశారు. దీంతో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద గందరగోళం, ఉద్రిక్తత నెలకొంది. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద ట్రాఫిక్‌కి ఆటంకం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో అలర్ట్ అయిన పోలీసులు.. పలు చోట్ల ట్రాఫిక్‌ను మళ్లించారు. మరోవైపు రోడ్డు ప్రయాణంలో జగన్ ఎక్కడంటే అక్కడే కాన్వాయ్ ఆపుతూ అభివాదాలు చేసుకుంటూ వెళ్లారు. శ్రీనివాసులరెడ్డి బొమ్మ సెంటర్ వద్ద జగన్‌ను చూసేందుకు వైసీపీ శ్రేణులు పోలీసులను నెట్టుకుంటూ వెళ్లారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత నెలకొంది. కాగా, పలు కేసుల్లో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో వైఎస్ జగన్ గురువారం నాడు ములాఖత్ అయ్యారు. జైలు నుంచి మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి నివాసానికి వెళ్లారు. మహిళా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై తీవ్రస్థాయిలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నిందితుడైన ప్రసన్నకుమార్ రెడ్డిని జగన్ పరామర్శించారు. ఇదిలాఉంటే.. జగన్ రాక సందర్భంగా భారీగా జనసమీకరణ చేశారు వైసీపీ నేతలు.



# తిరుమలలో రీల్స్ చేస్తే కఠిన చర్యలు

**- హెచ్చరించిన టీటీడీ అధికారులు**



**తిరుమల,జూలై31( వెలుతురు):**
రీల్స్ పిచ్చిలో కొందరు తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తున్నారు. అలాగే స్వామికి అపచారం చేస్తున్నారు. దీనిపై టిటిడి తీవ్రంగా స్పందించింది. ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తిరుమల శ్రీవారి ఆలయం ముందు, మాడ వీధుల్లో కొంతమంది వెకిలి చేష్టలు, డ్యాన్సలతో సోషల్ మీడియా రీల్స్ చేస్తుండటంపై తిరుమల తిరుపతి దేవస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి వీడియోలు చిత్రీకరించేవారిని తితిదే విజిలెన్స్ సిబ్బంది గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఈ తరహా చర్యలు ఆధ్యాత్మిక వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నాయని తితిదే పేర్కొంది. పవిత్రమైన క్షేత్రంలో ఇలాంటి అభ్యంతరకర, అసభ్యకర చర్యలు అనుచితమని.. ఇక్కడ కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కావాలని సూచించింది. తిరుమల క్షేత్రం భక్తి, ఆరాధనలకు నిలయమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొంది. శ్రీవారి దర్శనార్థం వచ్చే లక్షలాది మంది భక్తుల మనోభావాల పట్ల గౌరవం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. క్షేత్ర పవిత్రతకు భంగం కలిగేలా వ్యవహరించే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని తితిదే తెలిపింది.

# జగన్ ఓ అవినీతి శాస్త్రవేత్త

- మాణిగం ఠాకూర్



**అమరావతి,జూలై31( వెలుతురు):**
మాజీ సీఎం, వైకాపా అధినేత జగన్ ఓ అవినీతి శాస్త్రవేత్త అని ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మాణికం ఠాగూర్ వ్యాఖ్యానించారు. మద్యం ముడుపుల కేసులో రూ.11 కోట్లు దొరకటంపై ఆయన స్పందించారు. 'తొలి విడతలో రూ.11 కోట్ల మద్యం ముడుపులు పట్టు-బడ్డాయి. జగన్ చేసిన దోపిడీ నగదు ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉంది. మొత్తం రూ. 3,500 కోట్ల స్కామ్ జరిగింది. మద్యం ముడుపులతోనే సినిమాలు, ఆస్పత్రులు నిర్మించారు. ఆ డబ్బుతోనే షెల్ కంపెనీలు ఏర్పాటు- చేశారు. ఈ కుంభకోణంలో మనీలాండరింగ్ జరిగింది. జగన్ పరిపాలన చేయలేదు.. అవినీతి ముఠాను నడిపారని విమర్శలు గుప్పించారు.

## సింహాద్రిలో వైభవంగా స్వర్ణ పుష్పార్చన

**సింహాచలం, జూలై31( వెలుతురు):**
శ్రీ వరాహాలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో గురువరం నాడు శాస్త్రోక్తముగా శ్రీ స్వామివారికి 108 బంగారు పుష్పాలతో అత్యంత వైభవంగా స్వర్ణ పుష్పార్చన స్వర్ణ పుష్పార్చన లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వర్ణపుష్పార్చన అత్యంత వైభవంగా జరిగింది సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంక రించి ఆలయ కల్యాణ మండ పములో వేదికపై అధీష్టింప జేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణ పుష్పార్చన సేవ వైభవంగా నిర్వహించారు ప్రత్యక్షంగా భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు.

https://epaper.velthuru.com

# వెలుతురు

cinema




# ప్రేక్షకులను ఆకట్టుకునేలా కింగ్డమ్ మూవీ

## విజయ్ అభిమానులకు పండగలాంటి సినిమా

విజయ్ దేవరకొండ సినిమా వస్తుందంటే యువతలో అమితాసక్తి నెలకొంటుంది. వరుస సినిమాలు చేస్తున్నా, బాక్సాఫీస్ వద్ద మేజిక్ క్రియేట్ చేయడంలో తడబడుతున్నారు. ఈ నేపథ్యంలో గౌతమ్ తిన్ననూరితో కలిసి ఆయన చేసిన తాజా చిత్రం 'కింగ్డమ్' గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక కథలోకి వెళితే...సూరి (విజయ్ దేవరకొండ) ఓ కానిస్టేబుల్. చిన్న వయసులోనే కుటుంబానికి దూరమైన తన అన్న శివ (సత్యదేవ్) జాడ కోసం వెతుకుతుంటాడు. ఆ ప్రయత్నంలో ఉండగానే పోలీస్ అధికారులకీ సూరికి మధ్య గొడవ జరుగుతుంది. అది తన పై అధికారుల వరకూ వెళ్తుంది. అందుకు సంబంధించి విచారణ జరుగుతున్నప్పుడు ఊహించని రీతిలో సూరికి ఓ మిషన్ బాధ్యతల్ని అప్పజెబుతారు. సూరి వెతుకుతున్న తన అన్న శివ ఆచూకీ శ్రీలంక సమీపంలోని దివి అనే ఓ ద్వీపంలో ఉందని, గూఢచారిగా అక్కడ పనిచేయాలని చెబుతారు. తన అన్న కోసం ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధమైన సూరి... పై అధికారి చెప్పినట్టే శ్రీలంకలో అడుగు పెడతాడు. అత్యంత ప్రమాదకరమైన స్మగ్లింగ్ కార్టెల్ అదుపాజ్ఞల్లో ఉన్న దివిలోకి సూరి ఎలా అడుగు పెట్టాడు?ఇంతకీ శివ ఆ దివికి ఎందుకు వెళ్లాడు? ఆ ద్వీపంలో ఉన్న తెగకీ, శివకీ సంబంధం ఏమిటి? అక్కడి తెగ 70ఏళ్లుగా ఎవరి రాకకోసం ఎదురు చూస్తూ ఉంటుంది? తన అన్నతో కలిసి సూరి తిరిగొచ్చాడా?అన్నది చిత్ర కథ.

అన్నదమ్ముల చుట్టూ తిరిగే గ్యాంగ్‌స్టర్ డ్రామా ఇది. తెలుగులో ఇలాంటి కథలు కొత్తేమీ కాదు కానీ, మిగతావాటితో పోలిస్తే దీనిలో అన్నదమ్ముల బంధం, ద్వీపంలో చిక్కుకుపోయిన ఓ తెగ నేపథ్యమే 'కింగ్డమ్'ను భిన్నంగా నిలుపుతుంది. గ్యాంగ్‌స్టర్ కథలకి డ్రామా కీలకం. ఆ విషయంలో దర్శకుడు గౌతమ్ తిన్ననూరి రచన బలమైన ప్రభావమే చూపిస్తుంది.



డ్రామాతోపాటు కథా ప్రపంచంలో లీనం చేసే విజువల్స్, వాటికి మరింత బలాన్నిచ్చే సంగీతం, తెరపైన పాత్రలు తప్ప నటులే కనిపించని అభినయాలు... ఇలా అన్నీ ఉన్నా ఆ స్థాయిలో భావోద్వేగాలు బలంగా పండించలేకపోయారు. 1920ల నాటి నేపథ్యాన్ని తెరపై ఆవిష్కరిస్తూ కథని ఆసక్తికరంగా మొదలు పెట్టాడు దర్శకుడు. తొలి సన్నివేశంతోనే 'కింగ్డమ్' ప్రపంచంలో లీనమయ్యేలా చేశారు. ఆ తర్వాత కానిస్టేబుల్‌గా సూరి జీవితం, అన్న జాడ కోసం అతను చేసే ప్రయత్నాలు, ఆ తర్వాత మిషన్ బాధ్యతల్ని భుజాన వేసుకునే సన్నివేశాలతో సినిమా వేగంగానే పరుగులు పెడుతుంది. కథ శ్రీలంకకి మారాక జాఫ్నా జైలు నేపథ్యంతో పాటు, సూరి, శివ... తాము అన్నదమ్ములమనే విషయం ఇద్దరికీ ఎప్పుడు తెలుస్తుందనే అంశాలు ప్రేక్షకుల్లో ఆత్రుతని, ఆసక్తిని రేకెత్తిస్తాయి. అడుగడుగునా నాటకీయతతో సన్నివేశాల్ని మలిచినా, కథకు ప్రధానంగా అవసరమైన భావోద్వేగాల్ని ఆవిష్కరించలేకపోయారు. కథ నుంచి పక్కకు వెళ్లకుండా సన్నివేశాల్ని తీర్చిదిద్దడం సినిమాకు కలిసొచ్చింది. పతాక సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. 'కింగ్డమ్' ప్రపంచాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు, సాంకేతిక బృందం పడిన శ్రమతో తెరపై స్పష్టంగా కనిపిస్తుంది. విజయ్ దేవరకొండలో ఎంత మంచి నటు-డు ఉన్నాడో మరోసారి రుజువు చేసే చిత్రమిది. సూరి పాత్రలో ఒదిగిపోయాడు. తెరపైన ఎక్కడా విజయ్ కనిపించలేదు. ఆరంభ సన్నివేశాలతో కలుపుకొంటే, తెరపైన మూడు కోణాల్లో కనిపిస్తారు. ప్రతి కోణంపైనా తనదైన ముద్రవేశారు. ముఖ్యంగా స్పై పాత్ర కోసం ఆయన మారిపోయిన విధానం, శ్రీలంక నేపథ్యంలో సాగే ఆ సన్నివేశాలపై బలమైన ప్రభావం చూపించారు. శివ పాత్రలో సత్యదేవ్ నటన మరో ప్రధాన ఆకర్షణ. ఈ ఇద్దరి తర్వాత సినిమాలో కనిపించే మరో కీలకమైన పాత్ర... మురుగన్. ఆ పాత్రలో మలయాళ నటుడు వెంకటేశ్ చాలా బాగా నటించారు. స్మగ్లింగ్ కార్టెల్‌ని నడిపే యువ నాయకుడిగా కనిపిస్తాడు. కథానాయిక భాగ్యశ్రీ బోర్సే పాత్రకి పెద్దగా ప్రాధాన్యం లేదు. సాంకేతికంగా.. సినిమా ఉన్నతంగా ఉంది. విజువల్స్ పరంగా ప్రతి ఫ్రేమ్ ఆకట్టుకుంటుంది. అనిరుధ్ నేపథ్య సంగీతం సినిమాకి ప్రధానబలం. మేకింగ్ విషయంలో దర్శకుడి ప్రతిభ అడుగడుగునా కనిపిస్తుంది. మొత్తంగా విజయ్ అభిమానులకు పండగలాంటి సినిమా అని చెప్పవచ్చు.

# మనమే కొట్టినాం..

## రష్మిక ట్వీట్

విజయ్ దేవరకొండ నటించిన తాజా చిత్రం 'కింగ్‌డమ్' విడుదలై, అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. అభిమానులూ, ఇండస్ట్రీ వాళ్లు సోషల్ మీడియాలో హర్షధ్వానాలు చేస్తున్న వేళ, ఓ ఎమోషనల్ ట్వీట్ అందరినీ ఆకట్టుకుంటోంది. తాజాగా నేషనల్ క్రాష్ రష్మిక మందన్న 'నీకూ, నిన్ను ప్రేమించే ప్రతి ఒక్కరికి ఇది ఎంత ముఖ్యమో నాకు తెలుసు విజయ్.. మనమే కొట్టినాం కింగ్‌డమ్. అని ట్వీట్ చేసింది. ఈ మాటల వెనుక ఉన్న భావం సూటిగా హృదయాలను తాకుతుంది. విజయ్ దేవరకొండ ఎంతగా కష్టపడ్డాడో, ఈ సినిమా మీద ఆయనకు ఎంత నమ్మకంతో ఉన్నారో - అన్ని ఈ టీ-÷-వట్ లో స్పష్టంగా కనపడుతున్నాయి. ముఖ్యంగా 'మనమే కొట్టినాం' అన్న మాటలో గర్వం, భావోద్వేగం రెండూ సమపాళ్లలో ఉన్నాయి. తాజాగా ఈ ట్వీట్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతుంది. ఇక కింగ్‌డమ్ చిత్రం ప్రస్తుతానికి పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తోంది. విజయ్ కొత్తగా ఎంచుకున్న కథ, గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం, టె-క్నికల్ టీమ్ చూసినవాళ్లంతా సినిమా బ్లాక్ బస్టర్ అని చెబుతున్నారు. ఈ తరహా మద్దతు, ప్రేమ విజయ్ దేవరకొండకు మరో స్థాయిలో నిలిచేలా చేస్తోంది.



# కింగడమ్ మూవీని చూసి మెచ్చుకున్న హిమాన్షు


### లవ్ ఎమోజీతో ఐలవ్‌యూ అంటూ విజయ్ రిప్లై




స్టార్ కథానాయకుడు విజయ్ దేవరకొండ నటించిన కింగ్‌డమ్ చిత్రంను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొడుకు హిమాన్షు రావు వీక్షించాడు. ఈ సినిమాపై ప్రశంసలు కురిపించాడు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నా స్నేహితులతో కలిసి 'కింగ్‌డమ్' సినిమా చూశాను. ఒక థియేటర్‌లో ఇంత మంచి అనుభూతి పొందడం నాకు ఇదే మొదటిసారి!. స్క్రీన్ కూడా చాలా పెద్దగా ఉండడంతో, ప్రేక్షకులంతా సినిమాను బాగా ఎంజాయ్ చేస్తూ అరుస్తున్నారు. థియేటర్ వాతావరణం మొత్తం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉండడమే కాకుండా. చాలా ఎనర్జీ కనిపించింది. అలాగే ఈ సినిమాలో విజయ్ దేవరకొండ నటన అద్భుతంగా ఉంది. సినిమా అయితే నాకు చాలా నచ్చిందంటూ హిమాన్షు రాసుకొచ్చాడు. అయితే ఈ పోస్ట్‌పై విజయ్ స్పందిస్తూ.. హిమాన్షు లవ్ యూ అంటూ లవ్ ఎమోజీలను పెట్టాడు. కాగా ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.

# విజయ్ సేతుపతిపై మహిళ ఫిర్యాదు

### నేనేంటో నా కుటుంబానికి తెలుసన్న సేతుపతి



ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీక్రి వచ్చి స్టార్‌గా ఎదిగారు నటుడు విజయ్ సేతుపతి. ఆయనపై ఓ మహిళ ఇటీవల సంచలన ఆరోపణలు చేసింది. కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ బాగా ఉందని ఆమె సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. దీంతో ఈ అంశం తీవ్ర చర్చకు దారితీసింది. తాజాగా తనపై వచ్చిన ఆరోపణలపై విజయ్ సేతుపతి స్పందించారు. తన కుటుంబం ఎంతో బాధ పడిందన్నారు. ఆమెపై తన టీమ్ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. నన్ను ఎన్నోఏళ్లుగా చూస్తున్నవారంతా ఆమె ఆరోపణలు చూసి నవ్వుకున్నారు. నేనేంటో నాకు తెలుసు. ఈ రకమైన తప్పుడు ఆరోపణలు నన్ను బాధించలేవు. కానీ, నా కుటుంబం, సన్నిహితులు ఎంతో కలత చెందారు. 'వీటిని పట్టించుకోకండి. ఆమె ఫేమస్ కావడం కోసం కావాలని ఇలా చేస్తోంది. కొన్ని నిమిషాలపాటు- హైలైట్ అవుతుంది. పాపం ఎంజాయ్ చేయనీయండి' అని వారితో చెప్పాను. మేము ఆమెపై సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాం. ఏడు సంవత్సరాలుగా నేను ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. ఇప్పటివరకూ దేనికీ భయపడలేదు. ఇలాంటివి ఎప్పటికీ నన్ను బాధించవు అని విజయ్ సేతుపతి వివరించారు. కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ బాగా ఉందని.. దీనివల్ల తన స్నేహితురాలు ఎంతో ఇబ్బందిపడిందని రమ్య అనే ఓ మహిళ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. విజయ్ సేతుపతి కూడా ఆమెను ఇబ్బందిపెట్టారని తెలిపింది. తన స్నేహితురాలు మానసికంగా కుంగుబాటుకు గురైందని పోస్ట్‌లో రాసుకొచ్చింది. అయితే ఆమె తన పోస్ట్‌ను కొన్ని గంటల్లో డిలీట్ చేసింది. దీంతో విజయ్ అభిమానులు ఆమెపై విరుచుకుపడ్డారు. విమర్శలు నిజమైతే పోస్ట్ ఎందుకు డిలీట్ చేశారని ప్రశ్నించారు. దీంతో ఆ మహిళ మరో పోస్ట్ పెట్టి వివరణ ఇచ్చింది. కోపంలో ఇలా చేశానని.. అది వైరల్ అవుతుందని ఊహించలేదని తెలిపింది. తన స్నేహితురాలి గోప్యత కోసం పోస్ట్ డిలీట్ చేసినట్లు- చెప్పింది.

# నాచారంలో కొత్త మల్టీప్లెక్స్

### లాంఛనంగా ప్రారంభించిన దిల్ రాజు

హైదరాబాద్ సినీ ప్రియులకు గుడ్ న్యూస్. మూవీ లవర్స్‌ని అలరించడానికి మరో కొత్త మల్టీప్లెక్స్ అందుబాటులోకి వచ్చింది. అత్యంత విలాసవంతమైన, అధునాతన సౌకర్యాలతో కూడిన యూకే సినీప్లెక్స్ నాచారంలో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్‌లతో పాటు శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఈ 4-స్క్రీన్ మల్టీప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, యూకే సినీప్లెక్స్ థియేటర్ ఎంతో ఉన్నతంగా ఉందని ప్రశంసించారు. 'సౌండ్ సిస్టమ్, స్క్రీన్, సీట్లు ఎంతో బాగున్నాయి. ఉప్పల్, హబ్సిగూడ, నాచారం ప్రాంతాల్లో నివసించే వారికి ఈ మల్టీప్లెక్స్ వినోదాన్ని పంచడంలో సరికొత్త అనుభూతిని ఇస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదని ఆయన అన్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో శ్రీమతి పృతికా ఉదయ్, శ్రీ రుషిల్ ఉదయ్‌లతో పాటు- పలువురు రాజకీయ ప్రముఖులు కూడా పాల్గొన్నారు. యూకే సినీప్లెక్స్ కేవలం ఒక సినిమా థియేటర్ మాత్రమే కాదని, ఇది ఒక పూర్తిస్థాయి వినోద అనుభూతి అని నిర్వాహకులు పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో పాటు-, అత్యుత్తమ సౌకర్యాలు కలిగిన ఈ సినీప్లెక్స్ సినిమా ప్రేమికులకు, కుటుంబాలకు ప్రీమియం అనుభవాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఇక నాచారంలో కొత్తగా ప్రారంభమైన సినీప్లెక్స్ నగరవాసులకు సరికొత్త సినిమా అనుభూతిని అందించబోతుంది. ఈ మల్టీప్లెక్స్ ప్రేక్షకులకు అత్యంత సౌకర్యాన్ని అందించే మృదువైన సీటింగ్, విలాసవంతమైన వీక్షణ కోసం ప్రీమియం రిక్లైనర్లు, సౌకర్యవంతమైన సోఫాలను ఏర్పాటు- చేసింది. సినిమాలోని ప్రతి ధ్వనినీ స్పష్టంగా వినిపిస్తూ, ప్రేక్షకులను సినిమా ప్రపంచంలో లీనం చేసే అట్మాస్ సౌండ్ వ్యవస్థను కలిగి ఉంది. దృశ్యాలను స్పష్టంగా, మెరుగైన నాణ్యతతో చూడటానికి లేజర్ ప్రొజెక్షన్, అద్భుతమైన దృశ్య అనుభవం కోసం సిల్వర్ స్క్రీన్‌లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు-, ప్రేక్షకుల కోసం లైవ్ కౌంటర్లు, పిజ్జాలు, శాండ్‌విచ్‌లు, డెజర్ట్‌లు వంటి రుచికరమైన ఆహారం, పానీయాలు కూడా ఒకే చోట లభించడం యూకే సినీప్లెక్స్ ప్రత్యేకత. నాచారంలో యూకే సినీప్లెక్స్ ప్రారంభం హైదరాబాద్ నగర వినోద రంగానికి ఒక సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది.



# రుణం ఇప్పిస్తానంటూ 5కోట్లకు టోకరా

### తమిళ నటుడు శ్రీనివాసన్ అరెస్ట్

తమిళ సినీ పరిశ్రమలో 'పవర్ స్టార్'గా గుర్తింపు పొందిన ఎస్. శ్రీనివాసన్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ఢిల్లీకి చెందిన ఓ సంస్థను రూ.1000 కోట్ల రుణం ఇప్పిస్తానంటూ హామీ ఇస్తూ, అడ్వాన్స్‌గా రూ.5 కోట్లు తీసుకుని మోసం చేసిన ఆరోపణలపై ఆయనను ఢిల్లీ పోలీసులు చెన్నైలో అరెస్ట్ చేశారు. 2010లో 'బ్లూ కోస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ లిమిటెడ్' అనే సంస్థకు రూ.1000 కోట్లు లోన్ ఇప్పిస్తానని శ్రీనివాసన్ హామీ ఇచ్చాడట. దీనికి బదులుగా.. వారి దగ్గర నుంచి రూ.5 కోట్లు- అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. నెల రోజుల్లో లోన్ వస్తుందని రాకపోతే డబ్బులు తిరిగిఇస్తానని హామీ ఇచ్చాడు. అయితే నెల కంటే ఎక్కువ రోజులు గడుస్తున్న లోన్ మంజూరు కాకపోవడంతో మోసపోయామని గుర్తించిన సంస్థ యాజమాన్యం పోలీసులను ఆశ్రయించింది. అయితే ఈ కేసుపై విచారణ చేపట్టిన పోలీసులు.. దర్యాప్తులో భాగంగా రూ. 5 కోట్లు- నేరుగా శ్రీనివాసన్, అతని భార్య బ్యాంకు ఖాతాలకు బదిలీ అయినట్లు- గుర్తించారు. అంతేకాదు ఈ డబ్బుని అతడి వ్యక్తిగత అవసరాల కోసంతో పాటు- సినిమాల నిర్మాణానికి ఉపయోగిం చినట్లు తేలింది. ఇక ఈ కేసులో దర్యాప్తునకు సహకరించకుండా, విచారణకు హాజరుకాకుండా 2018 నుంచి శ్రీనివాసన్ తప్పించుకుని తీరుగుతున్నాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో కోర్టు అతడిని నేరస్థుడిగా ప్రకటించింది. అతడు చెన్నైలో ఉన్నట్లు- తెలవడంతో అతడిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఢిల్లీకి తరలించారు.

# తీర్పును స్వాగతించిన కెటిఆర్

**- 3 నెలల్లో ఉప ఎన్నికలు తప్పవని వ్యాఖ్య**



**హైదరాబాద్,జూలై31( వెలుతురు):**
'సత్యమేవ జయతే' అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. తెలంగాణలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన ఈమేరకు స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడిన సీజేఐకి దన్యవాదాలు తెలిపారు. రాహుల్ గాంధీ చెప్పే పాంచ్ న్యాయ సూత్రకు కట్టుబడి ఉండాలి. చట్టవిరుద్ధంగా 10 మంది పార్టీ మారారని చెప్పేందుకు దర్యాప్తు అవసరం లేదు. కష్ట సమయాల్లో మాతో నిలిచిన భారత రాష్ట్ర సమితి లీగల్ టీమ్‌కు ధన్యవాదాలు. 10 నియోజకవర్గాల్లో ఉపఎన్నికకు 3 నెలల సమయం ఉంది. పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కేటీఆర్ పేర్కొన్నారు. దేశం యొక్క ప్రజాస్వామ్య నిర్మాణం హానికరమైన పద్ధతుల ద్వారా క్షీణించకుండా చూసుకున్నందుకు గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తికి మేము కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాలను పటిష్టం చేయాలని, ఫిరాయింపులపై ఆటోమేటిక్ రద్దు చేయాలని తన పంచ న్యాయ్‌లో వాదించిన రాహుల్ గాంధీ ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తారని ఆశిస్తున్నాను. మిస్టర్ గాంధీ, మీ స్వంత ఉపదేశాలకు కట్టుబడి ఉండమని నేను మీకు చెబుతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.గౌరవనీయులైన స్పీకర్ పదవిని మీరు, మీ పార్టీ భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడానికి ఉపయోగించుకోరని నేను ఆశిస్తున్నాను. ఈ 10 మంది ఎమ్మెల్యేలు అక్రమంగా కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రతిరోజూ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని అంగీకరించడానికి పెద్దగా పరిశోధన అవసరం లేదు అని కేటీఆర్ తెలిపారు.

# సుప్రీం తీర్పు సిఎం రేవంత్‌కు చెంపపెట్టు

**- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వివేకానంద**

**హైదరాబాద్,జూలై31( వెలుతురు):**
తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు- పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ నేతలు స్పందించారు. ఈ అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటిదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. ఎమ్మెల్యే వివేకానంద తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ స్పీకర్ దగ్గర ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించడం చరిత్రాత్మకం అని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఈ తీర్పు చెంపపెట్టు- లాంటింది. ఉపఎన్నికలు ఎలా వస్తాయి అధ్యక్షా అని అసెంబ్లీలో రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టును తప్పుపట్టేలా వ్యాఖ్యానించారు. ఇపుడు ఉపఎన్నికలు ఎలా వస్తాయో సుప్రీం కోర్టు చెప్పింది అని వివేకానంద తెలిపారు. సీఎం అధికార మదంతో రాచరికాన్ని తలపించేలా మాట్లాడిన వ్యాఖ్యలకు విరుద్ధంగా సుప్రీం తీర్పు ఇచ్చింది. సుప్రీం తీర్పు మీద ఏ మాత్రం నమ్మకమున్నా పది మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి. పార్టీ మారగానే ఎమ్మెల్యేలు, ఎంపీలు సభ్యత్వాన్ని కోల్పోయేలా చట్టం తెస్తామని ఏఐసీసీ మేనిఫెస్టోలో చెప్పారు. పాంచ్ న్యాయ్ సూత్రాల్లో అది ఒకటని రాహుల్ చెప్పారు. ఏ మాత్రం తాను మేనిఫెస్టోలో పెట్టిన దానిపై గౌరవమున్నా రాహుల్ ఎమ్మెల్యేల అనర్హత వేటు- కోసం చొరవ చూపాలి అని వివేకానంద పేర్కొన్నారు. ఢిల్లీలో రాహుల్ గాంధీది ఓ మాట.. గల్లీలో రేవంత్ రెడ్డిది ఇంకో మాట. ద్వంద్వ ప్రమాణాలకు కాంగ్రెస్ చిరునామాగా మారింది. రేవంత్ ఫిరాయింపులను ప్రోత్సహించడానికి వ్యతిరేకంగా సుప్రీం తీర్పు వచ్చింది. సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ ఆహ్వానిస్తుంది. ఇక మూడు నెలలు ఆగకుండా స్పీకర్ వెంటనే తన నిర్ణయం ప్రకటించాలి. సుప్రీంకోర్టు తాజా తీర్పు మా పార్టీ తొలి విజయం.. ఈ విజయ పరంపర కొనసాగుతుంది. కాంగ్రెస్ పార్టీ ఇకనైనా బుద్ధి తెచ్చుకుని వ్యవహారించాలి అని ఎమ్మెల్యే వివేకానంద మండిపడ్డారు.

# చైనాలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన బంగారం షాపు

**- నగల కోసం ప్రజలు వెతుకులాట**

**- నెట్టింట వైరల్‌గా మారిన దృశ్యాలు**



**బీజింగ్,జూలై31( వెలుతురు):**
చైనాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో చాలాచోట్ల మెరుపు వరదలు సంభవించాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లో వరదల కారణంగా ఓ నగల దుకాణంలో నుంచి బంగారం, వెండి ఆభరణాలు కొట్టుకుపోయాయి. దీంతో వాటిని వెతికేందుకు వీధుల్లో స్థానికులు పోటీపడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కొందరు ఈ పని కోసం వానలో తడుస్తూ వెతకడం మొదలు పెట్టారు. షాపు ముందు నుంచి కాలువలా వెల్లిన చోటల్లా వెతుకుతూ కనిపించారు. షాంగ్జీ ప్రావిన్స్‌లోని వుచి కౌంటీ-లో జులై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతం సముద్రతీరానికి సమీపంలో ఉంటుంది. ఇక్కడ స్థానికంగా ఉన్న లావోఫెంగ్జియాంగ్ ఆభరణాల దుకాణాన్ని ఎప్పటిలాగే ఉదయం సిబ్బంది తెరిచారు. అప్పటికే భారీ వర్షాలతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. చూస్తుండగానే వరద నీరు దుకాణంలోకి చొచ్చుకొచ్చింది. వరద ఉద్ధృతి పెరగడంతో కళ్లముందే దుకాణంలోని నగలు, సేఫ్ బాక్స్ కొట్టుకుపోయాయి. కొట్టుకుపోయిన వాటిల్లో బంగారు హారాలు, గాజులు, ఉంగరాలు, చెవి దుద్దులు, వజ్రపు ఉంగరాలు, వెండి ఆభరణాలు ఉన్నట్లు- దుకాణ యజమాని తెలిపారు. సేఫ్ బాక్సులో రీసైకిల్ చేసిన బంగారంతో పాటు భారీగా నగదు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20 కిలోల బంగారం, నగదు గల్లంతైనట్లు- తెలిపారు. వీటి విలువ 10 మిలియన్ యువాన్లు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.12కోట్ల పైనే ఉంటుందని వెల్లడించారు. బంగారం కొట్టుకుపోయిన విషయం తెలియగానే స్థానికులు పెద్దఎత్తున వీధుల్లోకి చేరి బంగారం కోసం వెతకడం ప్రారంభించారు. కొందరు స్వచ్ఛందంగా తమకు దొరికిన ఆభరణాలను వెనక్కి ఇచ్చేశారని దుకాణ యజమాని తెలిపారు. ఇప్పటివరకు కేజీ బంగారం తమ వద్దకు చేరిందన్నారు. రోజులు గడుస్తున్నా మిగతా బంగారం కోసం స్థానికులు వెతుకుతూనే ఉన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇలా వెతుకుతున్న వారిని చూసి మరికొందరుకూడా రంగంలోకి దిగడం విశేషం.

# ధర్మస్థలి మిస్టరీ మరణాలపై దర్యాప్తు

**- పారిశుద్ధ్య కార్మికుడి చూపిన చోట తవ్వకాలు**

**- తాజాగా తవ్విన చోట కొన్ని అవశేషాల గుర్తింపు**



**బెంగళూరు,జూలై31( వెలుతురు):**
కర్ణాటకలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం 'ధర్మస్థల' లో అనుమానస్పద మరణాల మిస్టరీపై విచారణ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాంతంలో కొన్ని శవాలను పూడ్చి పెట్టానని ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు చూపించిన ప్రదేశాల్లో తవ్వకాలు చేపట్టింది. ఇందులో ఓ చోట గురువారం కొన్ని అవశేషాలను గుర్తించారు. ఇప్పటివరకు ఈ కేసులో బయటపడిన తొలి ఆధారం ఇదే కావడం గమనార్హం. పారిశుద్ధ్య కార్మికుడి ఫిర్యాదు నేపథ్యంలో ఈ అనుమానాస్పద మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గత సోమవారం నుంచి సిట్ అధికారులు.. అతడిని వెంట తీసుకెళ్లి దర్యాప్తు చేపట్టారు. నేత్రావతి నది స్నానఘట్టానికి అవతలి వైపు ఉన్న ప్రాంతం నుంచి పరిశోధన ప్రారంభించారు. మృత దేహాలను పూడ్చిపెట్టినట్లుగా మొత్తం 13 చోట్లను అతడు గుర్తించగా.. ఆ ప్రాంతాల్లో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఆరో ప్రాంతంలో మానవ అవశేషాలు బయటపడ్డాయి. వాటిని ఫోరెన్సిక్ బృందం సేకరించి ల్యాబ్‌కు పంపించింది. ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాతే వాటి గురించి వివరాలు తెలుస్తాయని సిట్ అధికారులు చెబుతున్నారు. దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవ క్షేత్రం.లో ఇటీవల మిస్టరీ మరణాలపై దేశవ్యాప్తంగా చర్చ సాగుతోంది. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. ఇటీవల సంచలన ఆరోపణలు చేశాడు. 1998 నుంచి 2014 మధ్య ఇక్కడ అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని.. వారి మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అవన్నీ అనుమానాస్పద రీతిలో అదృశ్యమైన వారివని, లైంగిక దాడులకు గురై చనిపోయినట్లు- అనుమానాలున్నట్లు- పేర్కొనడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. 2014 డిసెంబరులో తమ కుటుంబంలోని ఒక యువతిని కొందరు లైంగికంగా వేధిస్తుండడంతో తాము అజ్ఞాతం లోకి వెళ్లిపోయామని ఆ వ్యక్తి చెప్పినట్లు సమాచారం. మృతదేహాలను ఎవరు ఖననం చేయమన్నారు? వాటిని ఎవరి సహాయంతో తీసుకువెళ్లేవారు? తదితర ప్రశ్నలను సిట్ అధికారులు అడిగి అతడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది.

# సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కు షాక్

**- ముందస్తు బెయిల్ రద్దు చేసిన సుప్రం**

**- మూడు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశం**



**న్యూఢిల్లీ,జూలై31( వెలుతురు):**
ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో ఆయనపై ఏపీ ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో సంజయ్‌కు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత జస్టిస్ అమానుతుల్లా, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టి ధర్మాసనం ఇవాళ తీర్పు వెలువరిం చింది. ఇకపోతే సంజయ్ కోర్టు ముందు లొంగిపోవడానికి మూడు వారాల సమయం ఇచ్చింది. సంజయ్ కస్టడీ కోసం మేజిస్ట్రేట్ కోర్టులో దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని, బెయిల్ కోరుతూ నిందితుడు మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. సంజయ్‌కి ముందస్తు బెయిల్ ఇస్తూ రాష్ట్ర హైకోర్టు 49 పేజీల తీర్పు రాయడంపై గత విచారణ సందర్భంగా ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్ దశలోనే ట్రయల్ పూర్తి చేసినట్లు- ఉందని వ్యాఖ్యానించింది. నిర్వహించిన ప్రతి సదస్సులో 350 మంది హాజరయ్యారని చూపారు.. ఇదెలా సాధ్యం అని ప్రశ్నించింది. అన్ని సదస్సుల్లో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ లేకుండా ఎలా ఉంటారని విస్మయం వ్యక్తం చేసింది. ముఖ్యమైన పదవుల్లో ఉన్న అధికారులు.. అన్ని చూసుకోవాలి గానీ, ఇష్టానుసారం చేస్తే ఎలా అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాలు ఆన్‌లైన్‌లో జారీచేసేందుకు అగ్ని-ఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు సంజయ్ అప్పగించారు. ఎలాంటి పనులూ జరగకపోయినా ఆ సంస్థకు రూ.59.93 లక్షల బిల్లులు చెల్లించేశారు. సీఐడీ తరఫున ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ- నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ కాంట్రాక్టును క్రిత్వ్యాప్ -టెక్నాలజీస్‌కు ఇచ్చి, రూ.1.19 కోట్లు- చెల్లించారు. సదస్సులు మొత్తం సీఐడీ అధికారులే నిర్వహించారు. క్రిత్వ్యాప్ సంస్థ అసలు సదస్సులే నిర్వహించక పోయినా బిల్లుల పేరిట దోచేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.2 కోట్ల మేర నష్టం కలిగించారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభుత్వానికి రెండు వేర్వేరు నివేదికలు సమర్పించింది. వాటి ఆధారంగా సంజయ్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# పాక్‌ను చేరదీస్తున్న ట్రంప్

**- పాక్‌తో కలసి చమురు నిల్వల అభివృద్ది**

**- పాక్ ఎప్పటికైనా భారత్‌కు చమురు విక్రయించగలదని వ్యాఖ్య**



**వాషింగ్టన్,జూలై31( వెలుతురు):**
భారత్‌పై కత్తికట్టిన ట్రంప్ పాక్‌ను దువ్వే ప్రయత్నంలో ఉన్నారు. పాకిస్తాన్ తో కలిసి చమురు నిల్వలను అభివృద్ధి చేయడానికి పనిచేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా పాకిస్తాన్ ఏదో ఒక రోజు భారతదేశానికి చమురు అమ్మవచ్చని పేర్కొన్నారు. పాకిస్తాన్ తో మేము ఇప్పుడే ఒక ఒప్పందాన్ని చేసుకున్నాం. దీని ద్వారా పాకిస్తాన్, యునైటెడ్ స్టేట్స్ వారి భారీ చమురు నిల్వలను అభివృద్ధి చేయడానికి కలిసి పనిచేస్తాయి. ఈ భాగస్వామ్యానికి నాయకత్వం వహించే చమురు కంపెనీని మేము ఎంచుకునే ప్రక్రియలో ఉన్నాము. బహుశా వారు ఏదో ఒక రోజు భారతదేశానికి చమురు అమ్మే అవకాశం ఉందని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. భారతదేశంపై 25శాతం సుంకం, భారత్, రష్యన్ సైనిక పరికరాలు, ఇంధన కొనుగోలుపై అదనపు జరిమానా ప్రకటించిన కొన్ని గంటల తర్వాత ట్రంప్ ఈ పోస్ట్ చేశారు. వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈసందర్భంగా భవిష్యత్తులో భారత్‌కు పాక్ చమురు విక్రయించవచ్చని వ్యాఖ్యానించారు. భారత దిగుమతులపై 25శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన కొన్ని గంటల్లోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా, పాక్‌ల మధ్య ఒక వాణిజ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా ఇరుదేశాలు చమురు నిల్వలను పెంచుకోవడంలో కలిసి పనిచేస్తాయన్నారు. అందుకోసం ఒక మంచి చమురు కంపెనీని ఎంచుకునే ప్రక్రియలో ఉన్నామన్నారు. దీని కారణంగా భవిష్యత్తులో భారత్‌కు పాక్ చమురు విక్రయించొచ్చు అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇది చర్చనీయాంశంగా మారింది. ఇక, వాణిజ్య ఒప్పందాలకు సంబంధించి అనేక దేశాల నాయకులతో మాట్లాడానని ట్రంప్ పేర్కొన్నారు. వారంతా యూఎస్‌ను సంతోషపెట్టాలని చూస్తున్నారన్నారు. అదేవిధంగా మరికొన్ని దేశాలు సుంకాల తగ్గింపు కోసం ప్రతిపాదనలు చేస్తున్నాయని తెలిపారు. ఇవన్నీ వాణిజ్య లోటును తగ్గించడంలో సహాయపడతాయన్నారు. ఈ ఒప్పందంపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ స్పందిస్తూ.. ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఒప్పందం భవిష్యత్తులో తమ భాగస్వామ్యం కొనసాగేందుకు ఉపయోగ పడుతుందన్నారు.టారిఫ్‌లు ప్రకటించిన అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. సుంకాలపై భారత్‌తో ఇంకా చర్చలు జరుపుతున్నామన్నారు. ఈసందర్భంగా మరోసారి బ్రిక్స్‌ను ప్రస్తావించారు. యూఎస్‌కు వ్యతిరేకంగా, డాలర్‌ను అణగదొక్కాలని బ్రిక్స్ దేశాలు చూస్తున్నాయని ఆరోపించారు. భారత్ కూడా ఆ కూటమిలో భాగమేనన్నారు. కానీ, అది జరగనివ్వనని స్పష్టంచేశారు. భారత ప్రధాని మోదీ తనకు మంచి స్నేహితుడని ఉద్ఘాటించారు. అయితే, వారు పెద్దఎత్తున సుంకాలు విధిస్తున్నారని ప్రస్తుతం వాటిని తగ్గించేందుకు ఆ దేశం సిద్ధమైందని పేర్కొన్నారు. మరోవైపు ట్రంప్ ప్రకటించిన సుంకాల ప్రభావంపై అధ్యయనం చేస్తున్నట్లు- భారత్ తెలిపింది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

**(ఆధ్యాత్మిక చింతన)**

# పుస్తకం లాంటిదే మన జీవితం !

**తిరుమల,జూలై31( వెలుతురు):**
కొత్త పుస్తకంలో అన్ని పుటలూ ఖాళీగానే ఉంటాయి. ప్రతి పుటా ఓ తెరిచిన పుస్తకమే. ఓ పుటలో పిచ్చి గీతలు గీసినా, లేక స్ఫూర్తినిచ్చే కథనాలు రాసినా అది ఆ పుస్తకంలో భాగం మాత్రమే. దాన్ని వదిలి మరో పుట తిప్పితే మరకలు లేని వర్తమానం స్వాగతం పలుకుతుంది. తెలిసో తెలియకో గత తప్పిదాల అనుభవం రెండో భాగాన్ని అర్థవంతంగా మలచుకోవడానికి ప్రేరణ కావాలి. దీన్ని జీవితానికి అన్వయిస్తే పుస్తకంలోని ప్రతి పుటా మన జీవితంలో ఓరోజు వంటిది. ప్రతి సూర్యోదయం మనకు ఆ రోజు సద్వినియోగమో దుర్వినియోగమో అయ్యేందుకు అవకాశం కల్పిస్తూనే ఉంటుంది. మునుపటి అనుభవంతో భవిష్యత్తుకు మార్గం చూపే వాక్యాలు వర్తమానంలోనే రాసుకోవాలి. ఇదంతా కూడా పాజిటివ్ దృక్పథం అలవర్చుకుంటేనే సాధ్యం అవుతుంది. నెగెటివ్ థాట్స్‌కు దూరంగా ఉండాలి. అలా ఉంటేనే మన అవయవాలు సరిగా పనిచేస్తాయి.




లేకుంటా వాటిపై ప్రభావం పడి అవి పనిచేయకుండా చచ్చుపడతాయి. మన శరీరంలోకి వెళ్లిన ఆహారం 24 గంటల్లో... మలినంగా బయటికి వెళ్లిపోవాలి. లేకపోతే ఆ మలినాలు జబ్బులకు కారణం అవుతాయి. శరీరంలోకి వెళ్లిన గాలి ఒక నిముషంలోగా బయటికి వెళ్లిపోవాలి లేకపోతే మనం రోగ గ్రస్థులం అవుతాం. మరి మనలోకి చేరిన కోపం, అసూయ, ద్వేషం, మోసం... ఇలాంటివన్నీ సంవత్సరాలుగా మనలోనే ఉంటే... ఏమౌతుందో తెలుసా... మనం నిత్య రోగగ్రస్తులుగా అవుతాం. నెగెటివ్ ఎనర్జీతో నిత్యం మరణిస్తున్నామన్న చేదు నిజాన్ని త్వరగా గ్రహించాలి. మనలో చేరి బయటికి వెళ్లిపోకుండా తిష్ట వేసుకొని... మన జీవితాల్ని మృతప్రాయం చేస్తున్న కోపాన్ని, ఒత్తిడిని, ద్వేషాన్ని, బద్ధకాన్ని, అనారోగ్యాన్ని ప్రతి రోజూ ధ్యానం, యోగ చెయ్యడం ద్వారా ప్రాణశక్తిని ఎక్కువగా పొందగలం.


Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com